
అధికారులపై మండిపడుతున్న బాలినేని


పోలీసులపై దౌర్జన్యం చేస్తున్న బాలినేని కుమారుడు ప్రణీత్‌రెడ్డి




టీడీపీ శ్రేణులపై దాడి చేస్తున్న వైసీపీ మూకలు (ఇన్‌సెట్‌లో) గాయపడిన ప్రభావతి కుమారుడు

జనంపై రౌడీయిజం

ఒంగోలులో వైసీపీ దౌర్జన్య ప్రచారం


విలపిస్తున్న హైమావతి


వైసీపీ మూకల దాడిలో గాయపడిన టీడీపీ నేత మోహన్‌రావు

- వలంటీర్ ఉందని ప్రశ్నించినందుకు సామాన్య కుటుంబంపై దాడి
- సమతానగర్‌లో రెచ్చిపోయిన మూకలు
- పరామర్శించేందుకు వెళ్లిన టీడీపీ నేతపైనా దాడి
- మద్యం మత్తులో వీరంగం
- అసభ్యపదజాలంతోపాటు రెచ్చగొట్టే వ్యాఖ్యలు
- ప్రేక్షక పాత్ర వహించిన పోలీసులు
- బాధితులను పరామర్శించిన దామచర్ల
- అందరి లెక్కలు తేలుస్తామని హెచ్చరిక

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 10: ఒంగోలులో వైసీపీ నేతలు బరితెగించారు. ఓటమి భయంతో ప్రచారం పేరుతో ప్రజల ఇంటికెళ్లి మరీ దాడులకు తెగబడ్డారు. వైసీపీ ప్రచారంలో వలంటీర్ ఉందని ఫొటో తీసే ప్రయత్నం చేసిన సామాన్య కుటుంబంపైన నేతలు, వారి అనుచరులు ప్రతాపం చూపారు. విషయం తెలిసిన అందరూ ఇదేం తీరు అంటూ మండిపడుతున్నారు. వివరాల్లోకెళితే.. నగరంలోని 37వ డివిజన్ సమతా నగర్‌లో బుధవారం రాత్రి వైసీపీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. ఈ సందర్భంగా సమతానగర్ మొదటి లైనులో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు కావ్యశ్రీ రెడ్డి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించడం ప్రారంభించారు. ఆ డివిజన్ కార్పొరేటర్ గోలి కోటేశ్వరమ్మ, ఆమె భర్త అయిన వైసీపీ బీసీ నాయకుడు తిరుపతిరావు కార్యక్రమానికి నేతృత్వం వహించారు. అందులో భాగంగా హిమశ్రీ అపార్ట్‌మెంట్‌లోని 2వ అంతస్తులో నివాసం ఉంటున్న చప్పిడి ప్రభావతి ఇంటికెళ్లిన వైసీపీ శ్రేణులు ఓట్లు అభ్యర్థించారు. అయితే ఈ ప్రచారంలో వలంటీర్ సుజనాప్రియ పాల్గొనడంతో ఆమె రావడమేమిటని ప్రభావతి కుటుంబసభ్యులు ప్రశ్నించారు. దీంతో అవమానంగా భావించిన వైసీపీ యువజన నాయకుడు గంటా రామానాయుడు, గోలి తిరుపతిరావు, కల్యాణ్ రెడ్డితోపాటు మరికొందరు ప్రభావతి కుటుంబసభ్యులపై దాడిచేశారు. అనంతరం కిందకు వచ్చి మిగతా ఇళ్లలో ప్రచారానికి వెళ్లారు. దాడి విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకుడు మేడికొండ మోహన్‌రావు అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకోగా, ఆవేశంతో ఊగిపోయిన వైసీపీ శ్రేణులు ముప్పై మంది ఒక్కసారిగా ఆయనపై దాడిచేశారు. నడిరోడ్డుపై పడేసి కొట్టారు. స్థానికులు సర్ది చెప్పబోయినా వినిపించుకోకుండా వారిపైనా దాడిచేశారు. దీంతో ఆ వీధిలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు ఒక్కొక్కరుగా అక్కడకు చేరుకున్నారు. దాడి జరిగిన విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న వైసీపీ మూకలు పెద్దపెద్దగా అరుస్తూ, రెచ్చగొడుతూ వీరంగం సృష్టించాయి. దీంతో డీఎస్పీ ఆధ్వర్యంలో భారీగా పోలీసులు మోహరించి పరిస్థితిని అదుపుచేసే ప్రయత్నం చేయగా, వారి అండ చూసుకున్న వైసీపీ శ్రేణులు మరింత రెచ్చిపోయారు. తొడలు గొడుతూ, మీసాలు మెలేస్తూ, ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతూ సమతా నగర్‌లో రెచ్చిపోవడంతో స్థానికులు భయంతో తలుపులు వేసుకున్నారు.

రేయ్.. జనా.. అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు

టీడీపీ నాయకుడు మోహన్‌రావుపై వైసీపీ నాయకుల దాడి విషయం తెలుసుకున్న దామచర్ల జనార్దన్ నగరంలోని ప్రచార కార్యక్రమాలను రద్దుచేసుకుని సమతానగర్ చేరుకున్నారు. అయితే ఫూటుగా మద్యం సేవించి ఉన్న వైసీపీ యువకులు అక్కడే ఉన్న జనార్దన్‌పై నోరుపారేసుకుంటూ ఊగిపోయారు. కొందరైతే రేయ్ జనా... చూసుకుందాం రారా అంటూ రెచ్చగొట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం నడిచింది. ఓ పది అడుగుల దూరంలో ఉన్న వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య సవాళ్ల వార్ నడవడంతో ఏం జరుగుతుందోనన్న భయం అందరిలోనూ కనిపించింది. అయితే అక్కడే ఉన్న పోలీసులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐలు భక్తవత్సలరెడ్డి, లక్ష్మణ్‌ల నేతృత్వంలో భారీగా పోలీసులు మోహరించారు. అయితే అక్కడ జరిగిన ఘటనకు కారణమైన వారిని పల్లెత్తుమాట కూడా అనని పోలీసులు టీడీపీ వారిని మాత్రం అడ్డుకున్నారు. అంతేకాకుండా టీడీపీ శ్రేణులనే చెదరగొట్టే ప్రయత్నాలు చేశారు. ఇదే సమయంలో వైసీపీ వర్గీయులకు అండగా నిలబడ్డారు.

రిమ్స్‌లో చేరిన బాధితులు

వైసీపీ గూండాల దాడిలో గాయపడిన చప్పిడి ప్రభావతి కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకుడు మేడికొండ మోహన్‌రావు చికిత్స కోసం రిమ్స్‌లో చేరారు. ఈ మేరకు వైద్యులు అడ్మిట్ చేసుకొని తగిన చికిత్స అందించారు. ఈ సందర్భంగా టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్, రాష్ట్ర యవనేత దామచర్ల సత్య, పలువురు పార్టీ శ్రేణులు రిమ్స్ వద్దకు చేరుకుని బాధితులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులను కోరారు.

ఇళ్లలోకి వెళ్లి కొడుతున్నారు..


బాధితులతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న జనార్దన్, సత్య

ఉద్రిక్తత అనంతరం దామచర్ల జనార్దన్ బాధితుల ఇంటికెళ్లి పరామర్శించారు. జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒంగోలులో వైసీపీకి ఓటమి తప్పదన్న భయంతో ఆ పార్టీ నేతలు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రౌడీయిజం చేస్తే ఓట్లు రావన్నారు. ప్రజలను బెదిరిస్తే భయపడి ఓటు వేస్తారని అనుకోవడం అవివేకమన్నారు. మౌనంగా ఉంటున్న తమ పార్టీ నేతలపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. తాము కూడా ఇలా రౌడీయిజం చేస్తే ఇళ్లకు కూడా వెళ్లలేరన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అందరి లెక్కలు తేలుస్తామని హెచ్చరించారు.

రిమ్స్‌లోనూ రగడ

- ఆస్పత్రి అద్దాలు పగులగొట్టిన వైసీపీ శ్రేణులు
- చేతులెత్తేసిన పోలీసులు

మెయిన్‌లో..


మద్దిశెట్టికి బొకే ఇస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి లక్ష్మి, పక్కన సాగర్

మద్దిశెట్టి మద్దతు టీడీపీకే?

- ఆయన అనుచరులూ అదే సూచించారు
- వేణుగోపాల్‌ను కలిసిన టీడీపీ కూటమి అభ్యర్థి లక్ష్మి, ఆమె భర్త సాగర్
- కనిగిరిలో టీడీపీలో చేరిన మద్దిశెట్టి సోదరుడు
- పమిడి రమేష్‌కు ఫోన్ చేసిన బాబు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

దర్శి వైసీపీ ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ నియోజకవర్గంలో టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మికి మద్దతు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. అనుచరుల అభిప్రాయలకనుగుణంగా ఆయన ఆ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. టీడీపీ అభ్యర్థి డాక్టర్ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు ఎమ్మెల్యేను కలిసినప్పుడు కూడా అదే సంకేతం ఇచ్చారు. మరోవైపు ఎమ్మెల్యే సోదరుల్లో ఒకరైన రవీంద్ర కనిగిరి నియోజకవర్గంలోని ఆయన స్వగ్రామంలో అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ వైసీపీ అధిష్ఠానంపై అసంతృప్తిగా ఉన్న విషయం తెలిసిందే. సీఎంతోపాటు ఆయన పాల్గొన్న కార్యక్రమాలు, వైసీపీ కార్యక్రమాలకు పూర్తిగా దూరమయ్యారు. బుధవారం దర్శిలో ఆయన నియోజకవర్గంలోని తన ముఖ్యఅనుచరులతో సమావేశమయ్యారు. అనుచరుల్లో అత్యధికులు 'వైసీపీ అధిష్ఠానం మనకు అన్యాయం చేసింది.. శివప్రసాద్‌రెడ్డి మనల్ని అసలు మనుషులుగానే చూడడం లేదు.. మనం టీడీపీ కూటమికి మద్దతు ప్రకటించడం సముచితంగా ఉంటుంది' అని ఆయనకు సూచించారు. ఎమ్మెల్యేను గౌరవించకుండా, కుల ప్రాతిపదికన శివప్రసాద్‌రెడ్డిని సీఎం బలపరిచారని కొందరు అనగా, కులం వారికి జగన్ చేసిందేమీ లేదని సుబ్బారెడ్డి, వారి అనచరులు ఉదహరించారు. ఇలా సాగిన సమీక్ష అనంతరం మనం టీడీపీ అభ్యర్థికే మద్దతు ఇవ్వాలని సూచించినట్లు తెలిసింది.

మద్దిశెట్టిని కలిసిన డాక్టర్ లక్ష్మి, పాపారావు

దర్శి టీడీపీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగరపంచాయతీ ఛైర్మన్ పిచ్చయ్య, జనసేన, బీజేపీ ప్రతినిధులు ఎమ్మెల్యే మద్దిశెట్టిని కలిశారు. టీడీపీలో చేరాలని, లక్ష్మికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఆ సమయంలో మద్దిశెట్టి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఇదేసమయంలో ఆయన సోదరులలో ఒకరైన రవీంద్ర, వారి స్వగ్రామంలో ఉన్న అనుచరులందరితో కలిసి టీడీపీలో చేరడం విశేషం, కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం లక్ష్మీనరసింహాపురం ఎమ్మెల్యే మద్దిశెట్టి స్వగ్రామం. ఆ గ్రామంలోనూ అన్నివర్గాలకు చెందిన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే సోదరుడు రవీంద్ర కనిగిరి టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర సమక్షంలో బుధవారమే టీడీపీ తీర్థంపుచ్చుకున్నారు. దీంతో దర్శిలో కూడా టీడీపీ అభ్యర్థి లక్ష్మికి మద్దిశెట్టి మద్దతు ఇచ్చినట్లుగా భావించొచ్చు. అయితే ఎమ్మెల్యే నేరుగా ఆ పార్టీలో చేరతారా, తన కుటుంబసభ్యులను మాత్రమే చేరుస్తారా అనేది వేచిచూడాలి.

పమిడికి చంద్రబాబు ఫోన్

దర్శి నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జిగా పనిచేసిన పమిడి రమేష్‌కు బుధవారం ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఫోన్ చేశారు. 'కష్టకాలంలో నియోజకవర్గంలో పార్టీ కోసం బాగా పనిచేశారు. అంతకుమించి డాక్టర్ లక్ష్మి విజయం కోసం పనిచేయండి.. భవిష్యత్తులో పార్టీ అండగా ఉంటుంది' అని బాబు చెప్పినట్లు తెలిసింది. రమేష్ కూడా గట్టిగా పనిచేస్తానని సమాధానం ఇచ్చినట్లు సమాచారం.


వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

గెలాక్సీపురంలో గంజాయి గుప్పు

- గ్రానైట్ కార్మికులే లక్ష్యంగా విక్రయాలు
- 2.6 కేజీలు పట్టుకున్న ఎస్‌ఈబీ అధికారులు

చీమకుర్తి, ఏప్రిల్ 10: గెలాక్సీపురంగా పేరుగాంచిన చీమకుర్తి పట్టణంలో మరోసారి గంజాయి గుప్పుమంది. కార్మికులే లక్ష్యంగా ఒడిశా నుంచి కొనుగోలు చేసి యథేచ్ఛగా ఈప్రాంతంలో విక్రయాలు జరుపుతున్న ఇద్దరు వ్యక్తులను ఎస్‌ఈబీ అధికారులు అరెస్టు చేశారు. వారి వద్ద 2.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను బుధవారం పట్టణంలోని ఎస్‌ఈబీ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ వెల్లడించారు. వలస కార్మికుడిగా వచ్చిన యుధిష్టర్ పట్టణంలోని ఒక సెలూన్ షాపులో పనిచేస్తున్నాడు. అడ్డదారిలో డబ్బులు సంపాదించేందుకు గంజాయి విక్రయాన్ని ఎంచుకున్నాడు. పేర్నమిట్టలో సెంట్రింగ్ పనిచేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన మరో వలస కార్మికుడైన గోలం మండల్‌తో పరిచయం పెంచుకున్నాడు. వీరిద్దరూ ఒడిశా నుంచి గంజాయిని తెచ్చి చీమకుర్తి పరిసర ప్రాంతాల్లో కార్మికులకు విక్రయిస్తున్నారు. బుధవారం మండల్ గంజాయిని తీసుకొచ్చి యుధిష్టర్‌కు ఇస్తుండగా ఎస్‌ఈబీ సీఐ ఈ.మారయ్య బాబు, ఎస్‌ఐ వినీతారెడ్డిల ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. దాడిలో సిబ్బంది యూసఫ్ షరీఫ్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


'స్వీప్ ప్రకాశం' ఆకారంలో కూర్చున్న కార్మికులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అందరూ ఓటు వేయాలి

- స్వీప్ ప్రకాశం ఆధ్వర్యంలో గ్రానైట్ కార్మికులకు అవగాహన

చీమకుర్తి, ఏప్రిల్ 10 : గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్న ప్రతి ఒక్క కార్మికుడు తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ కోరారు. స్వీప్ ప్రకాశం ఆధ్వర్యంలో కార్మికులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని రామతీర్థం వద్ద ఉన్న ఏపీఎండీసీ గ్రానైట్ క్వారీలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈసందర్భంగా కార్మికులు 'స్వీప్ ప్రకాశం' ఆకారంలో ప్రదర్శన చేశారు. అనంతరం కలెక్టర్, జేసీ గోపాలకృష్ణ మాట్లాడారు. కార్మికులతో ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. వేర్వేరు రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులతో చీమకుర్తి మినీ ఇండియాను తలపిస్తున్నదన్నారు. తర్వాత చీమకుర్తిలోని ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో మైన్స్ డీడీ జగన్నాథరావు, స్వీప్ నోడల్ అధికారులు రవి, జ్యోతి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


ఒంగోలులో దామచర్ల, మాగుంట సమక్షంలో టీడీపీలో చేరిన చెన్నుపాటి కుటుంబం (ఇన్‌సెట్‌లో) ఎస్ఎన్.పాడు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఎన్, వేదికపై ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్



ఒంగోలులో భారీగా చేరికలు

ఒంగోలు టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ సమక్షంలో వైసీపీ నుంచి పెద్దసంఖ్యలో శ్రేణులు వచ్చి పార్టీలో చేరారు. ఆయన నివాసం వద్ద కొత్తపట్నం మండలం పిన్నివారిపాలెం, వజ్జిరెడ్డిపాలెం, అలాగే నగరంలోని 10వ డివిజన్ అగ్రహారంనకు చెందిన పలువురు టీడీపీలో చేరారు. 37వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్‌తోపాటు ఆయన సోదరులు ప్రసాదరావు, హరిబాబు, శ్రీనివాసరావులు అలాగే దాదాపు వందమందికిపైగా వారి వర్గం టీడీపీ తీర్థంపుచ్చుకున్నారు. వేణుగోపాల్ నివాసానికి వెళ్లిన జనార్దన్ వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు. రాత్రికి 50వ డివిజన్‌లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు.

చేరికల జోరు.. ప్రచార హోరు


ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన కంభంపాడు గ్రామస్థులు

- ఉధృతంగా కూటమి అభ్యర్థుల ప్రచారం
- వైసీపీని వీడి భారీగా టీడీపీలోకి వస్తున్న శ్రేణులు
- పలుచోట్ల విభిన్న వర్గాలతో ఆత్మీయ సమావేశాలు
- కార్యకర్తలకు నేతల దిశానిర్దేశం

ఒంగోలు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థుల ప్రచారం ఉధృతంగా సాగుతోంది. ఒకవైపు ఇంటింటి ప్రచారం, మరోవైపు వైసీపీని వీడి పార్టీలోకి భారీగా వస్తున్న శ్రేణులకు సాదర స్వాగతాలు, ఇంకోవైపు కార్యకర్తలతోనూ, వివిధ సామాజికవర్గాలతోనూ ఆత్మీయ సమావేశాలు ఊపందుకున్నాయి. అలాగే ఎక్కడికక్కడ స్థానికంగా పార్టీ కార్యాలయాలు ప్రారంభిస్తూ అభ్యర్థులు వేగంగా ముందుకు సాగుతున్నారు. జిల్లావ్యాప్తంగా బుధవారం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు అలాగే ఒంగోలు, బాపట్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థులు తమ పరిధిలో విభిన్న కార్యక్రమాల్లో కనిపించారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వ ఐదేళ్ల అరాచకం, అవినీతి పాలన, రాష్ట్ర భవిష్యత్-చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం, ఆయావర్గాల సంక్షేమానికి టీడీపీ కూటమి ప్రకటించిన మేనిఫెస్టోలోని అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నారు. అదే సమయంలో ఆయా ప్రాంతాల్లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తీసుకోవాల్సిన చర్యలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. టీడీపీ కూటమిలోని జనసేన, బీజేపీ శ్రేణులు ఆ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతున్నాయి. జిల్లాలో బుధవారం ఆయా ప్రాంతాల్లో జరిగిన ప్రధాన కార్యక్రమాలు ఇలా ఉన్నాయి.

- సంతనూతలపాడు అభ్యర్థి బీఎన్.విజయకుమార్ బుధవారం ఉదయం మంగమూరు రోడ్డులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక కర్నూలు రోడ్డులోని ఫంక్షన్ హాలులో బాపట్ల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్‌తో కలిసి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. రాత్రికి బసవన్న పాలెంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు.
- కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, పార్టీ యువనేత దామ చర్ల సత్యలు సాయంత్రం టంగుటూరులో ఎంపీ మాగుంటతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం వావిలేటిపాడు వద్ద వేలాది మందితో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మాదిగ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.
- కనిగిరి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో లక్ష్మీనరసాపురంలో భారీగా వైసీపీ వర్గీయులు టీడీపీలో చేరారు. దర్శి ఎమ్మెల్యే వేణుగోపాల్ సోదరుడు రవి కూడా చేరిన వారిలో ఉండగా సాయంత్రం నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించి రాత్రికి ఇంటింటి ప్రచారం చేశారు.
- దర్శి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పాపారావు, ఇతర నేతలతో కలిసి దర్శి పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు.
- మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి సమక్షంలో చినమనగుండంకు చెందిన 30 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. నాలుగు మండలాల్లోనూ కందులతోపాటు కుటుంబ సభ్యులు ప్రచారం చేశారు.
- గిద్దలూరు అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు జనార్దన్ టీడీపీలో చేరారు. రాత్రికి గిద్దలూరు మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.
- ఎర్రగొండ పాలెం టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు సమక్షంలో అక్కపాలెంకు చెందిన 15 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అలాగే సాయంత్రం గ్రామాల్లో ఇంటింటి ప్రచారంలో ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు.


మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న టీడీపీ కూటమి నేతలు

ఒంగోలులో వైసీపీకి షాక్..!

నియోజవకర్గంలో ఫ్యానుకి వ్యతిరేక గాలులు.. ● పెరిగిన సైకిల్ స్పీడ్
టీడీపీలో చేరిన వైసీపీ కార్పొరేటర్ చెన్నుపాటి వేణు అండ్ బ్రదర్స్
నగరంలో ఒకేరోజు 500 మందికి పైగా చేరికలు



దామచర్ల, ఎంపీ మాగుంట సమక్షంలో టీడీపీలో చేరిన కార్పొరేటర్ వేణు, ఆయన సోదరులు

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 10: ఒంగోలు నియోజకవర్గంలో అధికార వైసీపీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దీంతో నగరంలో వైసీపీ ఫ్యాను గాలి స్పీడు తగ్గిపోతోంది. ప్రజల నుంచి వస్తున్న ఆదరణతో టీడీపీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తుండగా, వైసీపీ శ్రేణుల్లో కలవరం మొదలైంది. గడిచిన ఐదేళ్లపాటు వైసీపీలో తగిన గుర్తింపు, ప్రాధాన్యత లేకపోగా, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల పట్ల ఆ పార్టీకి చెందిన కొందరు నేతలు, కార్యకర్తల్లో అసహనం, అసంతృప్తులు బహిర్గతం అవుతున్నాయి. దీంతో ఇక అక్కడ ఉండలేమంటూ వైసీపీకి గుడ్ బై చెప్పి తెలుగుదేశం పార్టీలోకి వరుస పెడుతున్నారు. ఈ క్రమంలోనే నగరంలో వైసీపీలో ప్రాధాన్యత కలిగిన వైసీపీ కార్పొరేటర్ చెన్నుపాటి వేణు, ఆయన సోదరులు చెన్నుపాటి ప్రసాద్, హరిబాబు, శ్రీనివాస్‌తోపాటు వారి కుటుంబసభ్యులు, డివిజన్‌కు చెందిన మరో 200 మందికి పైగా తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ మేరకు 37వ డివిజన్‌లోని వేణు నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు చెన్నుపాటి బ్రదర్స్‌కు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం దామచర్ల మీడియాతో మాట్లాడుతూ టీడీపీలో గతంలో కీలకంగా వ్యవహరించిన చెన్నుపాటి బ్రదర్స్ తిరిగి పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో వారికి తగిన గౌరవం, సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరడానికి చాలామంది సిద్ధంగా ఉన్నారని, వైసీపీ విధానాలు ప్రజలకే కాకుండా, ఆ పార్టీ వారికే కూడా నచ్చడం లేదని తెలుస్తుందన్నారు. ఎంపీ మాగుంట మాట్లాడుతూ వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు పెరగడం శుభపరిణామన్నారు. పార్టీలో చేరికలతో నూతనోత్సాహం కనిపిస్తుందని, తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయడమే అందరి లక్ష్యమని చెప్పారు.

అలాగే బాపట్ల ఎంపీ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్, ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ చెన్నుపాటి బ్రదర్స్ టీడీపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం కార్పొరేటర్ చెన్నుపాటి వేణు, ఆయన సోదరులు ప్రసాద్, హరిబాబు, శ్రీనులు మాట్లాడుతూ తాము తిరిగి తెలుగుదేశం పార్టీలోకి చేరడం సొంతింటికి వచ్చినంత సంతోషంగా ఉందన్నారు. వైసీపీలో ఏకపక్ష నిర్ణయాలు, ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చని కారణంగానే తాము పార్టీని వీడినట్లు చెప్పారు. ఎన్నికల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంటను గెలపించుకోవడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ నుంచి ప్రజలు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జనార్దన్ సమక్షంలో టీడీపీలో చేరిన వజ్జిరెడ్డిపాలెం వైసీపీ కార్యకర్తలు

10వ డివిజన్‌లో వైసీపీ నుంచి తెలుగుదేశంలోకి..

నగరంలోని 10వ డివిజన్‌కు చెందిన పలువురు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. బుధవారం దామచర్ల నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అగ్రహారంనకు చెందిన వైసీపీ నాయకులు, మాజీ సర్పంచ్ బత్తుల రామచంద్రయ్య, అడపాల శ్రీను, ఉంగరాల ప్రశాంత్, కాట సాయి, తోటకూర శ్రీకాంత్, రావూరి వెంకటేశ్వర్లు, మరో 20 కుటుంబాలు టీడీపీలో చేరగా వారికి దామచర్ల పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం పనిచేయాలని కోరారు.

21వ డివిజన్‌లో టీడీపీ కార్యాలయం ప్రారంభం

నగరంలోని 21వ డివిజన్‌లోని స్థానిక ఎన్జీవో హోమ్ సమీపంలో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి పుసుపులేటి నారాయణ కుటుంబంతోపాటు ఆయన మిత్రులు, మరో పదిహేను మంది టీడీపీలో చేరగా, దామచర్ల వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గొల్లపూడి బాబూరావు, నగర కార్యదర్శి పొన్నరసు మురళీకృష్ణ, చావలి రాజేష్, చావలి సుధీర్, కాశీరావు, న్యాయవాది శ్రీకాంత్ పాల్గొన్నారు.

కొత్తపట్నం మండలం నుంచి చేరికలు

కొత్తపట్నం మండలం పిన్నివారిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు అంగా బజంగరావు, పిన్ని రత్తయ్య, పిన్ని నాగరాజు, అంగా సుబ్బారావు, పెద్దశింగు శివాజితోపాటు మరో 35 మంది తెలుగుదేశంపార్టీలో చేరగా, దామచర్ల వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే వజ్జిరెడ్డిపాలెం పంచాయతీలోని పట్టపుపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కోమూరి వంశీ, కోమూరి అశోక్, కాటం అశోక్, కోడూరి అర్జున్, కోమూరి విష్ణు, వాయల వడివేలు మరో 25 మంది టీడీపీలో చేరగా, దామచర్ల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

● కలెక్టర్ దినేష్‌కుమార్



ఎస్ఐ మహేష్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

మద్దిపాడు, ఏప్రిల్ 10: ఎన్నికల నిబంధనల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం రాత్రి గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం చెక్‌పోస్ట్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మద్యం, నగదు, బంగారు ఆభరణాల తరలింపులపై నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని చెప్పారు. గ్రామాల్లో ఓటర్లను ప్రభావితం చేసేలా డబ్బు, మద్యం పంపిణీ జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ జిల్లా గ్రీవెన్స్ అధికారులకు తగిన ఆధారాలు చూపించి నగదు తీసుకొని పోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంల కేంద్రం పరిశీలన

సంతనూతలపాడు: ఎండ్లూరు డొంకవద్దనున్న ఎస్ఎస్ఎన్ ఇంజనీరింగ్ కళాశాలలోని ఈవీఎంల తరలింపు కేంద్రాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ బుధవారం రాత్రి పరిశీలించారు. ఈవీఎంల తరలింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తపై జేసీ, రిటర్నింగ్ అధికారి ఆర్.గోపాలక్రిష్ణతో మాట్లాడారు. కాలేజీ ప్రాంగణంలో బస్సుల పార్కింగ్, సిబ్బంది బయలు దేరుతున్న తీరును సమగ్రంగా పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైన భోజనం, సదుపాయాలపై ఆరా తీశారు.

ఘనంగా సంగీత విభావరి



విభావరిలో పాల్గొన్న కళాకారులు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 10: క్రోధి నామ ఉగాది సందర్భంగా ఆల్ ఇండియా కళారంగం, పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి ట్రస్ట్ సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో నిర్వహించిన సంగీ త విభావరి ఘనంగా జరిగింది. సంస్థ జిల్లా అధ్యక్షురాలు, సీనియర్ గాయని డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ అధ్యక్షత వహించారు. నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురా లు తేళ్ల అరుణ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం సాహిత్య, కళారంగాలలో సేవలు అందిస్తున్న మహిళలను నిర్వాహకురాలు ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం జరిగిన సంగీత విభావరిలో డాక్టర్ నాగేశ్వరమ్మ, కె.లక్ష్మీప్రసన్న, టి.శ్రీదేవి, కె.శైలజ, ఎ.మనోహర్, డి.కోటేశ్వరరావు పలు సినీగీతాలను ఆలపించారు. అదేవిధంగా గాయకులు డి.ఉషారాణి, కుంభా రాఘవరావు చేసిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో ఆర్.వేణుమాస్టర్, చల్లా బాలకొండయ్య, అప్పిశెట్టి రత్తయ్య, జి.పవన్‌కుమార్, ఎస్.వెంకటలక్ష్మి, రాజు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 10: జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో బుధవారం సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశానికి పూనాటి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదైనందున నీటి సమస్య తీవ్రంగా ఉందని, ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని కోరారు. కనిగిరి, దర్శి, చీమకుర్తి పట్టణాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, మంచినీటి పథకాలు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో నీటి నిల్వలు లేవని, మంచినీటి పథకాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, ప్రతి ఏటా నీటి సరఫరా చేసిన ట్యాంకర్ల ఆపరేటర్లకు పెండింగ్ బిల్లులు ఇవ్వాలని తీర్మానించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్, డి.రమాదేవి, జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు చీకటి శ్రీనివాసరావు, ఎస్‌కే.మాబు, ఎం.రమేష్, సోమయ్య ఊసా వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సుమతికి ఎమ్మెల్యే స్వామి నివాళి

టంగుటూరు, ఏప్రిల్ 10 : మండలంలోనొందూరులో అనారోగ్యంతో మృతి చెందిన కొమ్ము సుమతి (50) భౌతిక కాయాన్ని బుధవారం ఎమ్మెల్యే స్వామి సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్, నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, ఏరువ ఆనంద్, సర్పంచ్ పిల్లి కోట్లింగం, మాజీ సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బలరాం ఉన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ పిలుపు ● నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తానన్న ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్



సభలో ప్రసంగిస్తున్న కృష్ణప్రసాద్, వేదికపై విజయ్‌కుమార్, పలువురు నాయకులు

ఒంగోలు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఎన్నికల్లో సంతనూతలపాడు నియోజకవర్గంలో టీడీపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆ నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ కూటమి అభ్యర్థి బీఎస్.విజయకుమార్ పిలుపునిచ్చారు. తన గెలుపుతోపాటు బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్‌కు భారీ మెజార్టీ వచ్చేలా చూడాలన్నారు. అందుకోసం టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు అంతా సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. బుధవారం ఒంగోలు నగరం కర్నూలురోడ్డులోని మహాలక్ష్మి ఫంక్షన్ హాలులో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల సంయుక్త నియోజకవర్గ సమావేశం బీఎస్ అధ్యక్షతన జరిగింది వివిధ గ్రామాల నుంచి మూడు పార్టీల కార్యకర్తలు సమావేశానికి భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ శ్రేణులు మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నాయని, అదేస్థాయిలో జనసేన, బీజేపీ కార్యకర్తలు కలిసి వస్తున్నారన్నారు. ఆయా గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో కార్యకర్తలలో ఉత్సాహం, ప్రజల్లో సానుకూలత స్పందన స్పష్టంగా కనిపిస్తున్నదని చెప్పారు. అయితే మూడు పార్టీల శ్రేణులు నియోజకవర్గ స్థాయి నుంచి పోలింగ్ బూత్ వరకు సమన్వయంతో పనిచేస్తే విజయం మరింత సులభం అవుతుందని చెప్పారు. అందుకోసం అందరూ ఐక్యంగా పనిచేయాలన్నారు. అదే సమయంలో వివిధ వర్గాల ప్రజలకు టీడీపీ కూటమి ప్రకటించిన మేనిఫెస్టోలోని అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. తాను అధికారంలో ఉన్నా, లేకున్నా నియోజకవర్గాన్ని అంటిపెట్టుకొని ఉండి ఇక్కడి ప్రజల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి శక్తివంచన లేకుండా పనిచేశానన్నారు. ఈసారి కచ్చితంగా రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని, తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడతానని పేర్కొన్నారు.

బాపట్ల పార్లమెంట్ కూటమి అభ్యర్థి టి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విజయ్‌కుమార్ కుటుంబంతో సుదీర్ఘకాలంగా తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. మంచి వ్యక్తి, ఉన్నత విద్యావంతుడైన విజయకుమార్ ప్రజాసేవలో నిబద్ధతతో పని చేస్తున్నారని, అదేవిధంగా తనను కూడా పార్లమెంట్ సభ్యునిగా గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తానని తెలిపారు. రాష్ట్రం ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో చంద్రబాబు వంటి అనుభవం, నిబద్ధత ఉన్న నాయకుని అవసరాన్ని ప్రజలంతా గుర్తించారన్న కృష్ణప్రసాద్ ఎన్నికల్లో కూటమి గెలిచేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి కందుకూరి బాబు, బీజేపీ ఇన్‌చార్జి మండవ రామకృష్ణ, టీడీపీ నేతలు మన్నం ప్రసాద్, బొమ్మినేని రామాంజనేయులు, ఎం.వీరయ్యచౌదరి, వివిధ మండలాల అధ్యక్షులు తేళ్ల మనోజ్, మండవ జయంత్‌బాబు, మద్దినేని హరిబాబు, గొట్టిపాటి రాఘవరావు, గొల్లపూడి సుబ్బారావు, బి.అనిల్‌కుమార్, మంత్రి శ్రీనివాసరావు, అడకా స్వాములు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార గ్రామాల్లో టీడీపీదే హవా

● ప్రచారంలో దూసుకుపోతున్న శ్రేణులు



కె.పల్లెపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

కొత్తపట్నం(ఒంగోలునగరం) ఏప్రిల్ 10: కొత్తపట్నం మండలంలోని మత్స్యకార గ్రామాల్లో తెలుగుదేశం పార్టీకి రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది. మత్స్యకారుల వందలాది మంది స్వచ్ఛందగా కదలి వచ్చి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి దామచర్ల జనార్దన్‌ను గెలిపించాలని ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఒక వైపు మత్స్యకార గ్రామాల్లో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు పెరుగుతుండగా ఎన్నికల ప్రచారంలో కూడా పార్టీ కేడర్ దూసుకుపోతోంది. బుధవారం సాయంత్రం కొత్తపట్నం పల్లెపాలెంలో వందలాది మంది తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. మత్స్యకారులకు సంక్షేమ కార్యక్రమాలు, తీర ప్రాంత గ్రామాల అభివృద్ధి గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాల హయాంలోనే జరిగిందని ప్రచారం నిర్వహించారు. ఈ సారి ఎన్నికల్లో ఊహించని స్థాయిలో దామచర్లకు మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని నాయకులు కార్యకర్తలు, గ్రామాల్లోని మత్స్యకారులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశంపార్టీ తరఫున గతంలో ఎమ్మెల్యేగా గెలిచిన దామచర్ల జనార్దన్ చేసిన అభివృద్ధి పనులను ఇంటింటి తిరిగి వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి, కె.పల్లెపాలెం మాజీ సర్పంచి ప్రభుప్రకాష్, ఎంపీటీసీ పిన్ని నరసింహారావు, మాజీ ఎంపీటీసీ బాంబే శ్రీను, జ్వాలారామ్ తదితరులు పాల్గొన్నారు.

రౌడిషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ దుర్గాప్రసాద్

చీమకుర్తి, ఏప్రిల్ 10: చీమకుర్తి పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం రౌడీషీటర్లకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికలపై అనుక్షణం నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి గొడవలు, సమస్యలు పెంచే చర్యలలో పాల్గొంటే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. అందరిని బైండోవర్ చేసినట్లు ఆయన చెప్పారు.

ఎయిడెడ్ స్కూళ్లకు ఐఎఫ్‌పీని అందజేయాలి

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 10: ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు టోఫెల్ పరీక్ష నిర్వహించేందుకు ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ) అందజేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ పాఠశాలల విద్యార్థులకు అటు యాజమాన్యం కానీ, ఇటు ప్రభుత్వం కానీ ఐఎఫ్‌పీని ఏర్పాటు చేయకపోవడంతో టోఫెల్ పరీక్ష నిర్వహించడం ఇబ్బందికరంగా ఉందన్నారు. అందువల్ల వాటిని అందజేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

అడవిపందిని ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి

మర్రిపూడి, ఏప్రిల్ 10 : మోటారు సైకిల్‌పై వెళ్తూ అడవి పందిని ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన టంగుటూరు-పొదిలి రహదారిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. మర్రిపూడికి చెందిన దారుకుమల్లి వెంకట సుబ్బారెడ్డి (45) ద్విచక్ర వాహనంపై జువ్విగుంట వెళ్తున్నారు. విజయలక్ష్మీపేట సమీపంలో అకస్మాత్తుగా అడవి పంది అడ్డు వచ్చింది. దాన్ని ఢీకొని సుబ్బారెడ్డి రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయమైంది. ఆయన్ను ప్రయాణికులు ప్రైవేటు వాహనంలో పొదిలిలోని ఓ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్బారెడ్డి మరణించాడు. టైర్లు కొట్టు సుబ్బయ్యగా మండలంలోని వాహనదారులకు సుబ్బారెడ్డి పరిచయం. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివబసవరాజు తెలిపారు.

12నుంచి మూల్యాంకనం

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 10: ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ఈనెల 12నుంచి 16వతేదీ వరకు ఒంగోలులోని సెయింట్ థెరెస్సా హైస్కూలులో నిర్వహిస్తున్నట్లు ఓపెన్ స్కూలు జిల్లా కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. మూల్యాంకనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మూల్యాంకనానికి అవసరమైన సీఈలు, ఏఈలు 12న ఉదయం 9గంటలకు మూల్యాంకనానికి హాజరుకావాలన్నారు. స్క్రూటినైజర్లు ఈనెల 13న ఉదయం9గంటలకు హాజరుకావాలని, మూల్యాంకన కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

అవీ..ఇవీ..

15 నుంచి చేపల వేటపై నిషేధం

ఒంగోల నగరం, ఏప్రిల్ 10: ఈ నెల 15 నుంచి జూన్ నెల 14వ తేదీ వరకు ప్రభుత్వం చేపల వేటపై నిషేధాన్ని విధించింది. సముద్రంలో వేటను 61 రోజుల పాటు నిషేధించింది. లీన్ సీజన్ అంటే చేపలు, ఇతర సముద్ర ఉత్పత్తులు గుడ్లను ఉత్పత్తి చేసే సమయంలో ప్రభుత్వం చేపల వేటపై నిషేదాన్ని ప్రతి ఏటా విధిస్తుంది. ఇందులో భాగంగా పెద్దపెద్ద మరబోట్లు, మెకనైజ్డు పడవలు, యాంత్రీకరణ జరిపిన బోట్లతో జరిపే వేటను ప్రభుత్వం నిషేధించింది. వేట నిషేధాన్ని పగడ్బందీగా అమలు చేసే దిశగా మత్స్యశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టారు. లీన్ సీజన్‌లో వేటను బంద్ చేయటం ద్వారా మత్స్యకారులు జీవనోపాధి కోల్పోకుండా ప్రభుత్వం నుంచి తగిన సాయం అందజేస్తుంది.

ఓటు నమోదుకు మరో అవకాశం

మద్దిపాడు, ఏప్రిల్ 10: ఓటు నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని, ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఓటరు తుది జాబితాను ఈ ఏడాది జనవరి 22వ తేదీ అధికారులు విడుదల చేశారు. తదుపరి దరఖాస్తున్న చేసుకున్న వారికి అనుబంధ జాబితాలో చేరుస్తామని అప్పట్లో ప్రకటించారు. తాజాగా ఈ నెల 14 వరకు అవకాశం కల్పించారు. ఆన్‌లైన్‌లో ఓటర్ సర్వీస్ పోర్టల్ ద్వారా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకొని నేరుగా బూత్ స్థాయి అధికారులను సంప్రదించి ఫారం 6తో పాటు ధ్రువపత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు ఇవ్వాలి. ఇప్పటికే నమోదైన వారు ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో తెలుసుకునేందుకు 1950కు ఫోన్ చేయవచ్చని వారు పేర్కొన్నారు.

ఉత్తమ విద్యావేత్త పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న సురేష్‌బాబు దంపతులు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 10: ఒంగోలుకు చెందిన ట్రినిటి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు డాక్టర్ కొప్పోలు సురేష్ బాబును నేచర్ సేవా ఫౌండేషన్ ఉగాది సందర్భంగా ఉత్తమ విద్యావేత్త పురస్కారంతో ఘనంగా సన్మానించింది. ఒంగోలు నగరం కేశవస్వామిపేటలోని శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థాన బీఎంఆర్ కళ్యాణమండపంలో ఫౌండేషన్ నిర్వాహకులు, దేవస్థాన ఛైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, ప్రముఖ నటులు బేతంశెట్టి హరిబాబులు సురేష్ దంపతులను జ్ఞాపిక, శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా విద్యా, సామాజిక సేవారంగంలో సురేష్‌బాబు చేసిన సేవలను కొనియాడారు. అదేవిధంగా ఎంతో మంది దివ్యాంగులకు ఉపాధి కల్పిస్తున్న చిప్పలపల్లి సురేష్‌ను సైతం వారు ఘనంగా సత్కరించారు.

12,15 తేదీల్లో దివ్యాంగుల ఉచిత నిర్ధారణ పరీక్షలు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 10: జిల్లాలోని 3 నుంచి 17 సంవత్సరాల వయస్సుగల దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాలను అందించేందుకు ఈనెల 12,15వ తేదీల్లో ఉచిత నిర్ధారణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఈవో డి.సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న ఒంగోలులోని డాన్‌బాస్కో కేంద్రంలో, 15న మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర హైస్కూలులో ఈ శిబిరాలు జరుగుతాయన్నారు. ఉచిత ఉపకరణాలు అవసరమైన విద్యార్థులు ఆయా తేదీల్లో తమకు అందుబాటులోని శిబిరాలకు హాజరుకావాలన్నారు. ఈ శిబిరాలకు హాజరయ్యే దివ్యాంగ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఉచిత భోజన వసతితో పాటు రవాణా భత్యం చెల్లిస్తామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గాయకుడు హరిబాబుకు సన్మానం



హరిబాబును సత్కరిస్తున్న పృథ్వీరాజ్

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 10: ఒంగోలుకు చెందిన ప్రముఖ గాయకుడు పసుపులేటి హరిబాబును పలువురు ప్రముఖుల సత్కరించారు. బుధవారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో ఆర్ఎస్.మంజువాణి ఈవెంట్స్‌లో ఆయన పాడిన పాటలకు అభినందనగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త దైవజ్ఞశర్మ, సినీనటుడు పృథ్వీరాజ్, తెలంగాణ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, యువ హీరో కిరణ్ ఉత్తమ గాయకుడు పురస్కారంతో హరిబాబును సత్కరించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ తనకు పురస్కారం లభించటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వీణ, ప్రసన్న, చైతు, రాధారెడ్డి, రేఖాసాగర్ పాల్గొన్నారు.

వీఆర్వోలకు జేసీ పరామర్శ



వీఆర్వోలను పరామర్శిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 10: ఎన్నికల విధులు నిర్వహిస్తూ మద్దిపాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఒంగోలులోని వెంకట రమణ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వీఆర్వోలను జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ బుధవారం పరామర్శించారు. మద్దిపాడు మండలం వెల్లంపల్లి, కొలచనకోట గ్రామాల వీఆర్వోలు సీహెచ్.వెంకటేశ్వర్లు, టి.నరసింహారావు రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జేసీ వైద్యశాలకు వెళ్ళి వీఆర్వోల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం వీఆర్వోల కుటుంబసభ్యులను పరామర్శించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 10 : త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజాసామ్య పరిరక్షణకు పాటు పడే పార్టీలను ఎన్నుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య కోరారు. ఒంగోలులోని మల్లయ్యలింగంభవన్‌లో బుధవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశం ఎం.విజయమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు, డి.శ్రీనివాస్, పీవీఆర్.చౌదరి, అందే నాసరయ్య, ఎస్‌డీ.మౌలాలి, మురళీ, రామకృష్ణ, గోపి, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టోఫెల్ పరీక్ష పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న రమేష్

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 10: విద్యార్థులు ఇంగ్లీషు బాషా నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు టోఫెల్ ఎంతో ఉపయోగపడుతుందని సమగ్ర శిక్ష అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ ఎం.రమేష్ పేర్కొన్నారు. ఒంగోలు నగరం బాలాజీనగర్‌లోని మునిసిపల్ హైస్కూలులో బుధవారం 3,4,5 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తున్న టోఫెల్ పరీక్షను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. 6నుంచి 9 తరగతులకు వరకు విద్యార్థులకు నిర్వహిస్తున్న సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను పరిశీలించారు.

ముగ్గురు వలంటీర్ల రాజీనామా

మద్దిపాడు, ఏప్రిల్ 10: ఘడియపూడి సచివాలయం పరిధిలో ముగ్గురు వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. గార్లపాడు పంచాయతీకి చెందిన రావూరి అశోక్ రెడ్డి, అనపర్తి చిరంజీవి, ఘడియపూడి పంచాయతీకి చెందిన బొమ్మల కోటేశ్వరరావులు తమ రాజీనామా పత్రాలను మద్దిపాడులో ఈవోఆర్డీ రఘుబాబుకు అందజేశారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 10 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లాలోని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో చేపట్టిన కఠోర ఉపవాస దీక్షలు ముగించి పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి జిల్లాలోని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

బీసీవై మార్కాపురం అభ్యర్థిగా భాగ్యలక్ష్మి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 10: భారత చైతన్య యువజన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా రావెళ్ళ భాగ్యలక్ష్మిని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ ప్రకటించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మిని పార్టీ రాష్ట్ర సమన్వయ సారథి మిరియం శ్రీనివాసులు ప్రకటనలో అభినందించారు.

మాదిగల ఆత్మగౌరవానికి ప్రతీక టీడీపీ

ఆత్మీయ సమ్మేళనంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు

ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ఎస్సీలను నాశనం చేశారని ధ్వజం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెఎస్‌రాజు



సమావేశానికి హాజరైన మాదిగలు

జరుగుమల్లి(కొండపి), ఏప్రిల్ 10: మాదిగల ఆత్మగౌరవానికి ప్రతీక టీడీపీ అని ఆపార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు అన్నారు. బుధవారం మండలంలోని వావిలేటిపాడు గ్రామంలో కొండపి నియోజకవర్గ స్థాయిలో జరిగిన మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ఎస్సీలకు అన్ని విధాలా అన్యాయం చేశారన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఎస్సీల పథకాలను రద్దు చేసి అందరికీ పంచారని విమర్శించారు. మాదిగలకు టీడీపీ అండగా నిలిచిందని చెప్పారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు మాట్లాడుతూ మాదిగల సంక్షేమానికి టీడీపీ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. రిజర్వేషన్‌లను కల్పించి ఆదుకున్న ఘనత టీడీపీదన్నారు. ఎన్‌డీఏ కూడా మాదిగల న్యాయమైన వర్గీకరణకు అండగా నిలుస్తున్నదన్నారు. ప్రధాని మోదీ మాదిగల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల విజయానికి మాదిగలు అండగా నిలవాలని కోరారు. ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ కొండపి నియోజకవర్గంలో ఎస్సీల సంక్షేమానికి, ప్రధానంగా మాదిగల అభివృద్ధికి పనిచేశానని అన్నారు. డప్పుకళాకారుల పింఛన్‌లు, కాలనీల అభివృద్ధికి టీడీపీ హయాంలో నిధులు భారీగా ఖర్చు చేశామన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య మాట్లాడుతూ ప్రస్తుతం కొండపికి వచ్చిన వైసీపీ అభ్యర్థి కులాలను రెచ్చగొడుతున్నాడన్నారు. ఆయన పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నియోజవకర్గంలో ఎస్సీ కాలనీల అభివృద్ధి, వారి సంక్షేమానికి స్వామి, తాను పాటుపడతామని సత్య హామీ ఇచ్చారు. సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో మాదిగలు హాజరయ్యారు. తొలుత వావిలేటిపాడు అడ్డరోడ్డు నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. సభా ప్రాంగణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త అడకా స్వాములు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఐనంపూడి రమేష్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు బాలకోటయ్య, టీడీపీ నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు భాస్కర్, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి పేముల విజయనిర్మల, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి పొనుగోటి కొండయ్య, సింగరాయకొండ జడ్పీటీసీ మాజీ సభ్యురాలు కోడూరి ఎస్తేరమ్మ, పొన్నలూరు మండల ఎస్సీసెల్ నాయకుడు చుండి రాజేష్, జరుగుమల్లి మండల టీడీపీ అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, తెలుగు రైతు ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు పోటు శ్రీనివాసమురళి (పెదబాబు), పాలేటిపాడు సర్పంచ్ యోహాన్, నాయకులు దగ్గుమాటి సుబ్బారెడ్డి, కామేపల్లి మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు, బెల్లం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేణుగోపాల్ మంతనాలు



నాయకులతో మాట్లాడుతున్న వేణుగోపాల్

దర్శి, ఏప్రిల్ 10 : ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ దర్శిలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అనుచరులతో వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఆయన సోదరుడు శ్రీధర్‌తో కలిసి అందరి అభిప్రాయాలు తెలుసుకున్నారు. తాళ్లూరు ఎంపీపీ శ్రీనివాసరావు, కురిచేడు ఎంపీపీ భర్త చంద్రశేఖర్, దొనకొండ జడ్పీటీసీ సభ్యుడు సుధాకర్, దొనకొండ మండల వైసీపీ కన్వీనర్ నారపురెడ్డి, వైస్ ఎంపీపీలు కోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, ముండ్లమూరు మండల వైసీపీ కన్వీనర్ సుబ్బారెడ్డి, దర్శి నగర పంచాయతీ కౌన్సిలర్ వీసీ రెడ్డితోపాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. వైసీపీ టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేసినందున వచ్చే ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇస్తే బాగుంటుందని అధికశాతం మంది నాయకులు తమ అభిప్రాయాలను సూచించినట్లు తెలిసింది. అందరి అభిప్రాయం తెలుసుకున్న తర్వాత ఎమ్మెల్యే వేణుగోపాల్ అందరి మనోభావాలకు అనుగుణంగా త్వరలో నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసినట్లు సమాచారం.

ఓటమి భయంతోనే వైసీపీ ఫేక్ ప్రచారాలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిపైనా అబద్ధపు ప్రచారం

టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర



మాట్లాడుతున్న ఉగ్ర

కనిగిరి, ఏప్రిల్ 10 : వచ్చే ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకున్న వైసీపీ నేతలు ఎన్డీయే కూటమి అభ్యర్థిపై ఫేక్ ప్రచారాలకు దిగటం సిగ్గుచేటని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో బుధవారం జరిగిన కూటమి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫేక్ ప్రచారాలు చేసినంత మాత్రాన గెలుపును ఆపలేరన్నారు. ఆయా వీడియోలను చిత్రీకరించిన వారెవరో తెలుసని, సమాధానం చెప్పే సమయం దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కలసికట్టుగా ఎన్నికల్లో నిలబడ్డాయని, దీనిని జీర్ణించుకోలేని వైసీపీ బీజేపీ, టీడీపీ, జనసేన రాష్ట్రస్థాయి నాయకులపై కూడా ఫేక్ వీడియోలు చిత్రీకరించి సోషల్ మీడియా వేదికగా కుటిల ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిపై కూడా వైసీపీ ఫేక్ సమాచారం చేసి ముస్లిం కుటుంబాల్లో వ్యతిరేకత తెచ్చేందుకు పథకాన్ని వేసిందన్నారు. పింఛన్‌ల విషయంలో తాను మాట్లాడిన మాటలను ముందు వెనుక తొలగించి వ్యతిరేకంగా మాట్లాడినట్లు పేటీఎం బ్యాచ్ ఫేక్ వీడియో తయారు చేసి తన మాటలను వక్రీకరించి శునకానందం పొందటం సిగ్గుచేటు అన్నారు. జనసేన నాయకులు వరికూటి నాగరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి లాంటి పాలనాదక్షత కల్గిన నేత అవసరం అన్నారు. బీజేపీ నాయకులు కొండిశెట్టి రమణయ్య మాట్లాడుతూ బీజేపీ ఏ వర్గానికి, కులానికో, మతానికో సంబంధించింది కాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వీవీఆర్ మనోహరరావు (చిరంజీవి), భేరి పుల్లారెడ్డి, మండలపార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, షేక్ ఫిరోజ్, నంబలు వెంకటేశ్వర్లుయాదవ్, కుందురు తిరుపతిరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, అహ్మద్, జంషీర్, గుడిపాటి ఖాదర్, తెలుగుమహిళలు కరణం అరుణ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి 13 గొర్రెలు మృతి

కంభం (అర్థవీడు), ఏప్రిల్ 10 : పొలాల్లో గడి మేస్తున్న గొర్రెలకు విద్యుత్ తీగ తగిలి 13 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. సుమారు రూ. 3లక్షల మేర నష్టం జరిగిన సంఘటన అర్థవీడు మండలం కాకర్లలో జరిగింది. వివరాల్లోకి వెళితే కాకర్ల గ్రామానికి చెందిన మహబూబ్‌పీరా మేకలు, గొర్రెలు మేపుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం తనదగ్గరున్న 20 గొర్రెలను సమీప పొలంలో మేపుకునేందుకు తోలుకుని వెళ్ళాడు. అయితే ఈదురుగాలులకు ప్రధాన విద్యుత్ తీగ తెగి కిందపడింది. ఇది గమనించని గొర్రెలు తెగిన విద్యుత్ తీగను తగిలి అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారు రూ. 3లక్షల నష్టం వచ్చినట్లు మహబూబ్‌పీరా వాపోయాడు.

గుండెపోటుతో టెన్నిస్ కోచ్ మృతి

గిద్దలూరు, ఏప్రిల్ 10 : గిద్దలూరు పట్టణానికి చెందిన టెన్నిస్ కోచ్ బి.ఎస్.సతీష్ (52) గుండెపోటుతో మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న సతీష్ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందగా బుధవారం స్వగ్రామమైన గిద్దలూరుకు తీసుకుని వచ్చారు. ఈయన భార్య వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పని చేస్తుండగా ఇరువురు కుమారులు ఉన్నారు. టెన్నిస్ క్రీడాకారునిగా, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు పొంది చిన్నారులకు, ఎంతో మందికి టెన్నిస్ నేర్పించిన సతీష్ మృతి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. సతీష్ మృతదేహాన్ని టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు.



దామచర్ల సమక్షంలో టీడీపీలో చేరిన పిన్నివారిపాలెం శ్రేణులు

తెలుగుదేశంలోకి జోరుగా చేరికలు

కొత్తపట్నం(ఒంగోలునగరం) ఏప్రిల్ 10: మండలంలో వైసీపీ నుంచి తెలుగుదేశంపార్టీలోకి చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతూనే ఉంది. బుధవారం మండలంలోని పిన్నివారిపాలెం, వజ్జిరెడ్డిపాలెం గ్రామాల నుంచి పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వజ్జిరెడ్డిపట్టపుపాలెంకు చెందిన 25 మంది, పిన్నివారిపాలెం వైసీపీ చెందిన 25 మంది ఒంగోలులో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అభ్యర్థి దామచర్ల జనార్దన్‌ను కలిసి పార్టీలో చేరారు. వీరికి దామచర్ల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రజావ్యతిరేక కార్యక్రమాలకు విసిగి వేసారిన అనేక మంది తెలుగుదేశం పార్టీలోకి వస్తున్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్ బాగుపడాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు గుర్తించారని చెప్పారు. వైసీపీ నాయకులు అవినీతి సొమ్ముతో తిరిగి అధికారంలోకి రావాలని చూస్తున్నారని, వారికి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బీసీసెల్ నాయకులు గేనం సుబ్బారావు, పార్టీ మండల అధ్యక్షులు ద్వారబాకుల శ్రీనివాసులురెడ్డి, బలగాని వెంకటేశ్వర్లు, బలగాని నారాయణ, జంపాని రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూలే జయంతి



సభలో మాట్లాడుతున్న హరిబాబు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 10 : మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ రాజమోహన్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యూనివర్శిటీ రిజిస్ట్రార్ బి.హరిబాబు మాట్లాడుతూ విద్యద్వారా సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్, ఉమెన్స్‌సెల్ సమన్వయకర్త ఎ.భారతీదేవి, ఇంజనీరింగ్ ఇన్‌చార్జి ఆర్.శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డైరెక్టర్ పదవి, వైసీపీకి కోటయ్యగౌడ్ రాజీనామా

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 10 : బీసీలను చిన్నచూపు చూడడం పట్ల తాను ఆంధ్రప్రదేశ్ గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి, వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు డైరెక్టర్ కంచర్ల కోటయ్యగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 సంవత్సరాలుగా ఎన్నో ధర్నాలు, రాస్తారోకోలు చేసి కమ్యూనిటీ హాలు కోసం పోరాటం చేశామని, దాని నిర్మాణం పట్ల ఇంతవరకు ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకోలేదని తెలిపారు. అలాగే మార్కెట్‌యార్డు విషయంలో కూడా అనేక రకాలుగా మభ్యపెట్టిందని, మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో బీసీ కాని వ్యక్తిని చైర్మన్ చేసేందుకు అనేక కుట్రలు చేశారని విమర్శించారు. గౌడ, గీత కార్మికులకు, గౌడ కులస్థులకు వృత్తిపరంగా ఏమీ చేయలేక పోయానని ఆవేదన వ్యక్తం చేశారు.

ముస్లింలకు అండగా ఉంటాం!

టీడీపీ కూటమి ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట • టంగుటూరులో ఇఫ్తార్ విందు • హాజరైన ఎమ్మెల్యే స్వామి, సత్య, నాయకులు



ఇఫ్తార్ విందుకు హాజరైన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే స్వామి, సత్య



ఎమ్మెల్యే స్వామి సమక్షంలో టీడీపీ చేరిన వైసీపీ మద్దతుదారులు

టంగుటూరు, ఏప్రిల్ 10: ముస్లింలకు అన్ని విధాలా అండగా ఉంటానని టీడీపీ కూటమి ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి హామీ ఇచ్చారు. టంగుటూరులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మాగుంటతోపాటు కొండపి అసెంబ్లీ అభ్యర్థి స్వామి, ఇతర నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముస్లింల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. ఎన్నికల్లో తనతోపాటు స్వామిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లింల అభ్యున్నతికి అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రంజాన్ తోఫాను ఇవ్వడంతోపాటు మసీదులు, ఈద్గాలు, షాదీఖానాల అభివృద్ధికి భారీగా నిధులు వెచ్చించిందన్నారు. ముస్లింలంతా ఎన్నికల్లో పార్టీకి మద్దతు తెలపాలని కోరారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య మాట్లాడుతూ టీడీపీ విజయానికి ప్రతి ముస్లిం అంకితభావంతో పనిచేయాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, టంగుటూరు మాజీ సర్పంచ్ జయంత్‌బాబు, టీడీపీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, ముస్లి పెద్దలు పాల్గొన్నారు.

10కుటుంబాలు టీడీపీలో చేరిక

పొన్నలూరు(కొండపి): మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన పది వైసీపీ కుటుంబాల వారు బుధవారం ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన షేక్ షరీఫ్, షేక్ అహంతుల్లా ఆధ్వర్యంలో పఠాన్ కాలేషా, షేక్ చాంద్ బాషా, షేక్ మస్తాన్, వంకదారి రమేష్, షేక్ చిన్నరహంతుల్లా, షేక్ రహంతుల్లా, షేక్ రసూల్, షేక్ షరీఫ్ కుటుంబాలు టీడీపీ తీర్థంపుచ్చుకున్నాయి. ఒంగోలులోని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారికి స్వామి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు సుధాకర్, హనుమాన్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో ఆర్థిక భరోసా

టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ • బసవన్నపాలెంలో ఎన్నికల ప్రచారం • ఘన స్వాగతం పలికిన శ్రేణులు



బసవన్నపాలెంలో కరపత్రాలను అందజేస్తున్న విజయ్‌కుమార్



మంగమూరులో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీఎన్

మద్దిపాడు, ఏప్రిల్ 10: సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు తెలుగుదేశం పార్టీ ఆర్థిక భరోసా కల్పిస్తుందని టీడీపీ కూటమి సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం బసవన్నపాలెంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో అన్ని సామాజిక వర్గాల వారు తనను ఆదరించి అండగా నిలవాలని, సైకిల్ గుర్తుపై ఓటు వేసి మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. వైసీపీ నాయకులు మండలంలో సహజ వనరులను మిగల్చకుండా దోపిడీ చేశారని, పేద ప్రజలు సైతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గ్రామాల్లో తాగునీరు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం తన హయాంలోనే జరిగిందని గుర్తుచేశారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ టీడీపీ గెలుపు కోసం శ్రేణులు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో అడకా స్వాములు, అబ్బూరి శేషగిరిరావు, మండవ గోవిందరాజులు, మండవ లక్ష్మీనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు నున్న బాలసుబ్రహ్మణ్యం, రామాంజనేయులు, మండవ నరసింహారావు, దేవబత్తిన ప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నపల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

40 కుటుంబాలు టీడీపీలో చేరిక

బసవన్నపాలెంకు చెందిన 40 కుటుంబాల వారు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండవ రంగారావు, ఆర్ల శివరాం, ఆర్ల రామాంజనేయులు, అద్దేపల్లి భవాని, చింతల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మంగమూరులో ..

సంతనూతలపాడు: మంగమూరులో బుధవారం టీడీపీ కార్యాలయాన్ని కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ ప్రారంభించారు.

రిమ్స్ వద్ద ఉద్రిక్తత..!

- బాధితులను పరామర్శించేందుకు వచ్చిన దామచర్ల
- అదే సమయంలో వచ్చిన ఎమ్మెల్యే బాలినేని, తనయుడు
- ఆసుపత్రిలో వైసీపీ శ్రేణుల ఓవరాక్షన్
- మూకలను అడ్డుకోవడంలో పోలీసుల ఘోర వైఫల్యం
- ఆసుపత్రిలో రోగుల భయాందోళనలు
- ఎట్టకేలకు అగ్రనేతలను ఇళ్లకు పంపిన పోలీసులు



దామచర్ల కారును ధ్వంసం చేయబోతున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 10 : ఒంగోలులోని రిమ్స్ వద్ద బుధవారం అర్ధరాత్రి వైసీపీ నాయకులు చేసిన అలజడి ఉద్రిక్తతకు దారి తీసింది. స్థానిక సమతానగర్‌లో జరిగిన వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన టీడీపీ నాయకుడు మేడికొండ మోహన్‌రావు, అదే డివిజన్‌కు చెందిన చప్పిడి ప్రభావతి కుటుంబం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం జాయిన్ అయ్యారు. దీంతో బాధితులను పరామర్శించేందుకు టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ రిమ్స్ వద్దకు వెళ్లారు. ఈక్రమంలో దాడికి పాల్పడిన వైసీపీకి చెందిన కొందరు యువకులు తమకూ గాయాలు అయ్యాయంటూ రిమ్స్‌లో చేరారు. అయితే అప్పటికే దామచర్ల ఆసుపత్రిలో ఉండగా, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డి తమ పార్టీ శ్రేణులను పరామర్శించేందుకు అక్కడకు చేరుకున్నారు. ఇరు పార్టీల అగ్రనేతలు ఒకే సమయంలో ఆసుపత్రిలో ఉండటంతో క్యాజువాలిటీలో ఒక్కసారిగా ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. దీంతో బాలినేని వెంట వచ్చిన ఆయన అనుచరులు అక్కడే ఉన్న టీడీపీ శ్రేణులపై ఒక్కసారిగా తెగబడ్డారు. సుమారు రెండు గంటల పాటు వైసీపీ శ్రేణులు చేసిన ఓవరాక్షన్ భయానక పరిస్థితి కల్పించింది. దీంతో పోలీసులు దామచర్లను ఓ ప్రత్యేక వార్డులో ఉంచగా, ఎమ్మెల్యే బాలినేని, ఆయన తనయుడు క్యాజువాలిటీలో కూర్చున్నారు. అయితే బాలినేని అక్కడే ఉండటాన్ని అదునుగా చూసుకున్న వైసీపీ మూకలు రెచ్చిపోయారు. దామచర్ల బయటకు రావాలంటూ నినాదాలు చేస్తూ.. తేల్చుకుందామంటూ సవాళ్లు విసిరారు. ఈ సమయంలో అత్యుత్సాహం చూపిన కొందరు యువకులు మద్యం మత్తులో ఉండి దామచర్ల వాహనం ధ్వంసం చేసేందుకు యత్నించారు. అయితే అప్పటివరకు ప్రేక్షక పాత్ర పోషించిన పోలీసులు, భద్రతాబలగాలు స్వల్ప లాఠీచార్జి చేశారు. అనంతరం గంట తరువాత దామచర్లను వేరే మార్గం గుండా ఇంటికి పంపివేయగా, ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలినేని తన అనుచరులతో ఇంటిముఖం పట్టారు. ఇదియిలా ఉండగా.. సుమారు మూడు గంటల పాటు రిమ్స్ వద్ద జరిగిన ఈ ఘటనతో రోగులు భయభ్రాంతులకు గురయ్యారు.

పసుపు చొక్కా వేసుకున్న రోగిపై దాడి

రిమ్స్‌లో వైసీపీ శ్రేణులు చేసిన అరాచకం రోగులను మరింత భయాందోళనకు గురిచేసింది. మద్దిపాడు మండలం బసవన్నపాలెంకు చెందిన హరిబాబు అనే వ్యక్తి చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చారు. అయితే ఆయన పసుపు రంగు చొక్కా ధరించి ఉండటంతో వీడు.. టీడీపీకి చెందిన వాడంటూ.. ఆయనపై ఒక్కసారిగా దాడి చేశారు. దీంతో ఏం జరుగుతుందోనని తెలియక హరిబాబు కన్నీరుపెట్టుకున్నారు. ఆసుపత్రిలో జరిగిన ఘర్షణతో వైద్యులు సైతం విస్మయం వ్యక్తం చేశారు.



మోహన్‌రావును పరామర్శిస్తున్న దామచర్ల



వైసీపీ శ్రేణులను అడ్డుకుంటున్న బలగాలు



ఎస్పీ ఆఫీసు వద్ద టీడీపీ శ్రేణుల నిరసన



పరిశీలిస్తున్న పోలీసులు



దాడికి గురైన హరిబాబు


మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు దమ్మాల జనార్దన్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

వైసీపీలో ఇమడలేకే తిరిగి వచ్చా

- టీడీపీలోకి కోఆప్షన్ సభ్యులు దమ్మాల జనార్దన్
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 10 : మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు దమ్మాల జనార్దన్ తిరిగి టీడీపీలో చేరారు. బుధవారం దమ్మాల జనార్దన్‌కు టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఇటీవల జనార్దన్ ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. చేరిన కొద్ది రోజులకే మళ్లీ వైసీపీలోకి వెళ్లారు. అయితే ఆపార్టీ సిద్ధాంతాలు, వైసీపీ అవలంబిస్తున్న విధానాలు తనకు నచ్చక తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సిద్ధపడినట్లు తెలిపారు. దీనితో బుధవారం అశోక్‌రెడ్డి వద్ద జనార్దన్ తిరిగి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దమ్మాల జనార్దన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు పేదలను ఆకర్షిస్తున్నాయని, తాను ముత్తుముల అశోక్‌రెడ్డి గెలుపు కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గడ్డం భాస్కర్‌రెడ్డి, లొక్కు రమేష్, ఎంపీటీసీ గర్రె శ్రీనాథ్, కుసుమ హరనాథ దేవస్థాన అధ్యక్షులు నటుకుల శ్రీనివాసులు, ఆర్య వైశ్య నాయకులు ఆరవీటి సత్యనారాయణ (జీలకర), ఆరవీటి సుబ్రమణ్యం (టీవీఎస్), వాడకట్టు శివప్రసాద్, వాడకట్టు రామాంజనేయులు, సి.వి.ఎస్.ప్రసాద్, బి.వి.ఎస్.రమేష్, శ్రీధర్‌రెడ్డి, కొండపేట శ్రీను, వెంకటేశ్వర్లు, తుమ్మలపెంట మోహన్ తదితరులు పాల్గొన్నారు.


అక్కపాలెం గ్రామస్థులకు కండువా వేస్తున్న వైపాలెం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు

ఏఎంసీ మాజీ చైర్మన్ సొంత గ్రామంలో వైసీపీకి షాక్

- టీడీపీలోకి 15 కుటుంబాలు చేరిక

పుల్లలచెరువు, ఏప్రిల్ 10: మండలంలోని వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పరంపర రోజూ కొనసాగుతోంది. బుధవారం ఎర్రగొండపాలెంలోని టీడీపీ కార్యాలయంలో పుల్లలచెరువు మండలం అక్కపాలెం గ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 15 కుటుంబాలకు వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ పాలనలో కనీసం గ్రామంలో తట్ట మట్టి పోయలేదని అన్నారు. మంచి నీటి సమస్య తీవ్రంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు.వైసీపీ పాలనలో దాచుకోవడం, దోచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీని గెలిపించాలని కోరారు. వైపాలెంలో నియోజకవర్గ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను, ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగుంట శ్రీనివాసలు రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ మండల నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి,శనగా నారాయణరెడ్డి, కాకర్ల కోటయ్య,రామిరెడ్డి టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి, వైసీపీకి కోటయ్యగౌడ్ రాజీనామా


కంచర్ల కోటయ్యగౌడ్

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 10 : బీసీలను చిన్న చూపు చూడడం పట్ల తాను ఆంధ్రప్రదేశ్ గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి, వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆ కార్పొరేషన్ డైరెక్టర్, వైసీపీ నాయకుడు కంచర్ల కోటయ్యగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 16 సంవత్సరాలుగా ఎన్నో ధర్నాలు, రాస్తారోకోలు చేసి కమ్యూనిటీ హాలు కోసం పోరాటం చేశామని, దాని నిర్మాణం పట్ల ఇంతవరకు ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకోలేదని తెలిపారు. అలాగే మార్కెట్‌యార్డు విషయంలో కూడా ఈ ప్రభుత్వం అనేక రకాలుగా మభ్యపెట్టిందని, మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో బీసీ కాని వ్యక్తిని చైర్మన్ చేసేందుకు అనేక కుట్రలు చేశారని విమర్శించారు. తాను కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్నప్పటికీ గౌడ, గీత కార్మికులకు, గౌడ కులస్థులకు వృత్తిపరంగా ఏమీ చేయలేక పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బీసీ సామాజిక వర్గానికి చెందినప్పటికీ ఆ సామాజిక వర్గానికి ఎలాంటి న్యాయం చేయలేక పోవడంతో ఆత్మాభిమాన్ని చంపుకుంటూ వైసీపీలో ఉండలేనని ఆ ప్రకటనలో కోటయ్యగౌడ్ తెలిపారు. డైరెక్టర్ పదవికి, వైసీపీ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.


భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న మిత్ర బృందం సభ్యులు

కన్నడ యాత్రికులకు ఉచిత భోజన వసతి

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 10: స్థానిక రైల్వే స్టేషన్‌లో శ్రీశైలం దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వచ్చిన కన్నడ యాత్రికులకు ఉచిత భోజన వసతిని బుధవారం ఆర్యవైశ్య మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సుమారు 5,000 మంది కన్నడ భక్తులకు ఈ భోజన ఏర్పాట్లను చేసినట్లు మిత్ర మండలి నాయకులు చెక్కా మాలకొండ నరసిహారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి ఉగాది సందర్భంగా శ్రీశైలం దేవస్థానానికి వచ్చి మొక్కులు తీర్చుకొని తిరుగు ప్రయాణం అవుతున్న భక్తులకు భోజనవసతిని ఏర్పాటు చేశామని తెలిపారు. మిత్ర మండలి సభ్యుల సహకారంతో భక్తులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేయటం తమకు ఎంతో సంతోషమని అన్నారు. భోజన ఏర్పాట్లను ఊటుకూరి రామకృష్ణ, కోశెట్టి సుబ్బారావు, కలువ భాస్కర్, చెక్కచిన్న నరసింహారావు, కేవీ సత్యనారాయణ, తాళ్లపల్లి ఆదినారాయణ పర్యవేక్షించారు.

ప్రారంభమైన కుంభాభిషేక మహోత్సవం

గిద్దలూరు, ఏప్రిల్ 10 : మండలంలోని కేఎస్‌పల్లి గ్రామంలో వెలసిన శ్రీపోలేరమ్మ దేవాలయంలో మహా కుంభాభిషేక మహోత్సవం ప్రారంభమైంది. 5రోజుల పాటు జరుగనున్న శతరుద్రీయ, శతచండీయాగ పూర్వక మహాకుంభిషేక మహోత్సవ ప్రారంభ పూజలను బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్త అంబటి బాలిరెడ్డి, గ్రామస్థులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

వైసీపీ నేతలా.. మజాకా..!

అధికారం అండతో అనధికారిక బార్ అండ్ రెస్టారెంట్లు రెండు చోట్ల ఏర్పాటు

కళ్లుమూసుకున్నఎస్ఈబీ, పోలీసులు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 10: వచ్చే ఎన్నికల నాటికి మద్య నిషేధం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పార్టీ నేతలతోనే అనధికారిక బార్ అండ్ రెస్టారెంట్లను నడుపుతోంది. 2019 ఎన్నికలకు ముందు జగన్ పాదయాత్రలో పేద మధ్య తరగతి వర్గాల వారు మద్యం వలన కుటుంబాలను మరింత పేదరికంలోకి తీసుకుపోతున్నారని, వారిని మద్యానికి దూరం చేయాలనే ఉద్దేశంతో నిషేధం అమలు చేస్తామని నవరత్నాలలో చేర్చారు. కానీ ప్రస్తుతం మార్కాపురం పట్టణ, మండల పరిధిలో వైసీపీ వాళ్లే ఏకంగా అధికార అండతో అనధికారిక బార్ అండ్ రెస్టారెంట్లు నడుపుతున్నారు. అంతా తెలిసినప్పటికీ అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీ సమీపంలో మార్కాపురం ఎమ్మెల్యే దగ్గర బంధువు యథేచ్ఛగా రెస్టారెంట్‌లోనే కావలసిన మందును సరఫరా చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వ అనుమతులు ద్వారా ఏర్పాటు చేసిన బార్ అండ్ రెస్టారెంట్ల నుంచి మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. అలాగే వేములకోట రోడ్డులో జంక్షన్ కుంట వద్ద అనధికారికంగా ఓ బార్ అండ్ రెస్టారెంట్‌ను వైసీపీ వాళ్లు నడుపుతున్నారు. రెస్టారెంట్ల నిర్వాహకులు ప్రతి నెలా సంబంధిత అధికారులకు మామూళ్లు పంపిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామాలలో, పట్టణంలో ఎక్కడో ఒకరు ఇద్దరిని పట్టుకొని వారి నుంచి 10 లేదా 20 సీసాలు స్వాధీనం చేసుకుని చేతులు దులుపుకుంటున్నారు. నిత్యం కళ్ల ముందే రాత్రి 11 గంటల వరకు అనధికారిక బార్ అండ్ రెస్టారెంట్లలో మద్యం వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నా సంబంధిత సెబ్, పోలీస్ అధికారులు కొమ్ముకాసేలా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.


పట్టణంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన బార్ అండ్ రెస్టారెంట్

వైసీపీ అరాచక ప్రభుత్వాన్ని తరిమికొట్టండి

యువ నాయకుడు రోహిత్‌రెడ్డి పిలుపు

తర్లుపాడు, ఏప్రిల్ 10: వైసీపీ అరాచక ప్రభుత్వాన్ని ప్రజలు తరమికొట్టాలని యువ నాయకులు కందుల రోహిత్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని రాగసముద్రంలో ఇంటింటి ప్రచారం చేస్తూ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమన్నారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే మార్కాపురాన్ని జిల్లాగా చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డిని, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పి.ఏసుదాసు, టీడీపీ మండలాధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, టీడీపీ నాయకులు నంబుల లక్ష్మయ్య, నంబుల తిరుపతయ్య, కాశిరెడ్డి, చిట్టిబాబు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.


సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న రోహిత్‌రెడ్డి


చింతగంపల్లిలో ఇంటింటికీ మన కందుల కార్యక్రమంలో కందుల విగ్నేష్‌రెడ్డి

నాతండ్రిని ఆశీర్వదించండి

పొదిలి, ఏప్రిల్ 10 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తండ్రి నారాయణరెడ్డిని ఆశీర్వదించాలని ఆయన తనయుడు కందుల విగ్నేష్‌రెడ్డి కోరారు. ఇంటింటికీ మన కందుల కార్యక్రమాన్ని మండలంలోని అన్నవరం పంచాయతీలోని చింతగంపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనసేన, బీజేపీలు బలపరిచిన మార్కాపురం ఉమ్మడి టీడీపీ అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డిని, పార్లమెంట్ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసరెడ్డిని ఆదరించాలని కోరారు. ప్రజా సేవకే కందుల నారాయణరెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజలకు భరోసా చంద్రబాబు పాలనలోనే ఉంటుందన్నారు. మహిళలలకు, బీసీలకు భద్రత కల్పించిన పార్టీ టీడీపీ అని అన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎదురాళ్ళపాడు గ్రామంలో ఇంటింటికీ కందుల

కొనకనమిట్ల : మండలంలోని ఎదురాళ్ళపాడు గ్రామంలో ఇంటింటికీ కందుల కార్యక్రమాన్ని కందుల వేణుగోపాలరెడ్డి, టీడీపీ నాయకులు బుధవారం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ప్రజలను కోరారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజలకు భరోసా చంద్రబాబు పాలనలో ఉంటుందన్నారు. మహిళలకు, బీసీలకు భద్రత కల్పించిన పార్టీ టీడీపీ అన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎదురాళ్ళపాడు గ్రామంలో ఇంటింటికీ మన కందుల కార్యక్రమంలో టీడీపీ నాయకులు

వైసీపీ నుంచి 20 ముస్లిం కుటుంబాలు టీడీపీలోకి..

తర్లుపాడు, ఏప్రిల్ 10: తర్లుపాడులోని 20 ముస్లింలు కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. వీరికి మార్కాపురం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలిసా, ఫిరోజ్ కాన్, నన్నేసా, అపోజ్, సయ్యద్ రంజా, షేక్ అమిత్, షేక్ అక్బర్, సింతం శీను, ఆశీర్వాదం, రఫీలతో పాటు మరో 10 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. ఈ సందర్భంగా కందుల మాట్లాడుతూ..ముస్లింల అభ్యున్నతికి టీడీపీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. గతంలో టీడీపీ హయాంలో మసీద్‌ల రిపేర్‌కు, మౌజామ్‌లకు జీతాలు, ముస్లింలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం ముస్లింల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం సాధించటం తథ్యం అన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాసపతిరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షులు వెలుగొండా రెడ్డి, జి.సుబ్బయ్య, కె.శ్రీనివాసులు, ఈర్ల వెంకటయ్య, మేకల వెంకట్ యాదవ్, కుందురు చిన్నకాశి రెడ్డి, ఖైరున్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కందుల నారాయణరెడ్డి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ముస్లిం నాయకులు

కొనకనమిట్లలో 30 కుటుంబాలు చేరిక

కొనకనమిట్ల, ఏప్రిల్ 10: మండలంలోని చినమనగుండం గ్రామంలో 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, మాగుంట సన్నిహితుడు బెజవాడ సురేష్‌రెడ్డిల సమక్షంలో టీడీపీలో బుధవారం చేరారు. మాజీ సర్పంచ్ కొల్లా కోటేశ్వరావు, ఏఎంసీ పొదిలి మాజీ చైర్మన్ చప్పిడి రామలింగయ్య ఆధ్వర్యంలో వైసీపీని వీడి 30 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు కందుల తెలిపారు. పార్టీలో చేరిన రావుల చెన్నకేశవులు, రావుల చెన్నారావు, రావుల బాలచెన్నయ్య, ఈర్ల గుణశేకర్, ఈర్ల బాలవద్దిరాజు, దోసపాటి బాలగురవయ్య, ఈర్ల బాలరాజు, రావుల బాలగురవయ్య, రావుల చంద్రశేఖర్, కసిబిసి చినకొండయ్య, దోసపాటి నవీన్, కంచుగుంట్ల పాపయ్య, ఈర్ల హరికృష్ణ, కసిబిసి రవి, చంద్రయ్య, ఈర్ల రామయ్య, ఈర్ల గుంటయ్య, బత్తుల సురేష్, కందుల ఏసయ్య, కందుల ఇరిమయ్య, పోలెబోయిన పుల్లయ్యతో పాటు 30 కుటుంబాల వైసీపీకి చెందిన వీరు కందుల నారాయణరెడ్డి, బెజవాడ సురేష్‌రెడ్డిల సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారందరికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చినమనగుండం గ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులతో కందుల

ఆక్సిజన్ కాన్సంట్రేటర్ ఏర్పాటు


ఉచితంగా అందించిన కాన్సంట్రేటర్

మార్కాపురం వన్ టౌన్, ఏప్రిల్ 10: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా ఆక్సిజన్ కాన్సంట్రేటర్ ఏర్పాటు చేసినట్లు రెడ్ క్రాస్ సొసైటీ మార్కాపురం శాఖ చైర్మన్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ తెలిపారు. స్థానిక శ్రావణి వైద్యశాలలో కంభం గ్రామంలో చికిత్స పొందుతున్న ఒక మహిళకు ఆక్సిజన్ అవసరమై వారి అభ్యర్థన మేరకు బుధవారం ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ అందించారు. ఈ సందర్భంగా కనకదుర్గ మాట్లాడుతూ..రెడ్ క్రాస్ సొసైటీ సేవలు ఉపయోగించుకోవాలని, ఆక్సిజన్ అవసరమైన వారు తనను సంప్రదిస్తే కాన్సంట్రేటర్‌ను అందిస్తామన్నారు.

వైసీపీకి మర్రివేముల ఎంపీటీసీ రాజీనామా

పుల్లలచెరువు, ఏప్రిల్ 10: అధికార వైసీపీకి పుల్లలచెరువు మండలంలో బిగ్‌షాక్ తగిలింది. ఆ పార్టీ ఎంపీటీసీ సభ్యురాలు వరికల్లు నాగేంద్రమ్మ వైసీపీకి రాజీనామా చేసినట్లు బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఎంపీడీవోకు తన రాజీనామా పత్రాన్ని అందజేస్తానని తెలిపారు. గ్రామంలో నేలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఎంపీటీసీ రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.


ఎస్వీకేపీ కళాశాలలో స్ట్రాంగ్‌రూం ఏర్పాట్ల గురించి తెలుసుకుంటున్న ఎస్పీ సుమిత్ సునీల్, సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా

సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ సునీల్

మార్కాపురం, ఏప్రిల్ 10: ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూంల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ అన్నారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో మార్కాపురంలో స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేసిన ఎస్వీకేపీ కళాశాలలో భద్రతా ఏర్పాట్లను బుధవారం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికలు పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు చర్యలన్నీ తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని, ఉల్లఘించినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వారి వెంట డీఎస్పీ బాల సుందరం, సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఓబులక్కపల్లిలో పోలింగ్ స్టేషన్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రాహుల్‌మీన

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పొదిలి, ఏప్రిల్ 10 : సార్వత్రిక ఎన్నికల నిర్వహణ జరిగే పోలింగ్ స్టేషన్‌లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌మీన బుధవారం పరిశీలించారు. మార్కాపురం నియోజకవర్గం పొదిలి మండలంలోని మూగచింతల, కొండాయపాలెం, దొండ్లేరు, ఓబులక్కపల్లి, మాదాలవారిపాలెం, కంభాలపాడు, పోతవరం గ్రామాల్లోపోలింగ్ స్టేషన్‌లను పరిశీలించి వసతులపై ఆరా తీశారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఉండాల్సిన వసతులు ఇప్పటికే సంబంధిత అధికారులకు తెలియపరిచామని, వాటిని తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు ఆయన సూచించారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లు అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి, అధికారులకు తెలిపారు. సంబంధిత అధికారులందరూ కలిసి ప్రణాళిక వేసుకొని ముందుకు సాగాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్‌జియా, సీఐ మల్లిఖార్జున్, ఎస్ఐ కోటయ్య తదితర సిబ్బంది ఉన్నారు.


ఈద్ నమాజ్‌కు సిద్ధమైన నాగులవరం రోడ్డు ఈద్గా(ఇన్‌సెట్లో) టోపీలు కొనుగోలు చేస్తున్న ముస్లింలు

ఈద్‌కు సర్వం సిద్ధం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 10: రంజాన్ పురస్కరించుకుని ఈద్ నమాజ్ నిర్వహించేందుకు మార్కాపురం పట్టణంలో సర్వం సిద్ధం చేశారు. ముస్లింలు 30 రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు పాటించి బుధవారం ఉపవాస దీక్షలు విరమించారు. నెలవంక కనిపించటంతో గురువారం ఈద్ నిర్వహించుకునేందుకు ఈద్గాల వద్ద టెంట్లు వేసి అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానిక కంభం రోడ్డులోని పెద్ద ఈద్గా, నాగులవరం రోడ్డు, తర్లుపాడు రోడ్డు ఈద్గాలలో ఈద్ నమాజ్ లు నిర్వహించనున్నారు. ఉదయం 9గంటలకు ఈద్ నమాజ్ నిర్వహిస్తున్నట్లు ముస్లిం మత పెద్దలు తెలిపారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మల్లికార్జున్

రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

పొదిలి, ఏప్రిల్ 10 : వివిధ సందర్భాలలో వివాదాలకు పోయి పోలీసుల రికార్డుల్లో రౌడీషీటర్లుగా నమోదైన పలువురికి సీఐ మల్లికార్జున్‌రావు ఆధ్వర్యంలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రి ఎన్నికల్లో వివాదాలకు వెళ్ళి గొడవలు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే శిక్షార్హులు అవుతారన్నారు. ప్రజలు ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఓటర్లను భయానికి గురిచేసే పనులు చేయవద్దని సూచించారు. ఎన్నికల సమయంలో ఎదైనా సంఘటనలు, సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. హింసకు తావులేకుండా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని ఎన్నికల కమిషన్ చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ కోటయ్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


లారీకిందకు చొచ్చుకుపోయిన మోటార్‌బైక్

పొదిలి, ఏప్రిల్ 10: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే స్థానిక రథం రోడ్డులో తన బైక్‌పై వెళుతూ అదుపు తప్పి వెంకటేశ్వర్లు ఎదురుగా వస్తున్న లారీకి అతి సమీపంలో కింద పడ్డాడు. లారీ డ్రైవర్ అప్రమత్తతో పెనుప్రమాదం తప్పింది. క్షతగాత్రుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గుండెపోటుతో టెన్నిస్ కోచ్ మృతి


టెన్నిస్ కోచ్ భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న క్రీడాకారులు

గిద్దలూరు, ఏప్రిల్ 10 : గిద్దలూరు పట్టణానికి చెందిన టెన్నిస్ కోచ్ బి.ఎన్.సతీష్ (52) గుండెపోటుతో మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న సతీష్ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందగా బుధవారం స్వగ్రామమైన గిద్దలూరుకు తీసుకుని వచ్చారు. ఈయన భార్య వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పని చేస్తుండగా ఇరువురు కుమారులు ఉన్నారు. లాన్‌టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ జీకేమోహన్‌రెడ్డి, స్థానిక అధ్యక్షులు డాక్టర్ చేరెడ్డి రంగారెడ్డి, రిక్రియేషన్ క్లబ్ కోశాధికార త్రిమూర్తి రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ టపావలి, టెన్నిస్ క్రీడాకారులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. టెన్నిస్ క్రీడాకారునిగా, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు పొంది చిన్నారులకు, టెన్నీస్ అభిమానులకు ఎంతో మందికి టెన్నిస్ నేర్పించిన సతీష్ మృతి తీరని లోటని పేర్కొన్నారు. సతీష్ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సందర్శించి నివాళులు అర్పించి కుటుంబీకులకు సానుభూతి తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి 13 గొర్రెలు మృతి

- రూ. 3 లక్షలు నష్టం


మృతిచెందిన గొర్రెలు

కంభం (అర్థవీడు), ఏప్రిల్ 10 : పొలాల్లో గడి మేస్తున్న గొర్రెలకు విద్యుత్ తీగ తగిలి 13 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. సుమారు రూ. 3లక్షల మేర నష్టం జరిగిన సంఘటన అర్థవీడు మండలం కాకర్లలో జరిగింది. వివరాల్లోకి వెళితే కాకర్ల గ్రామానికి చెందిన షేక్ మహబూబ్‌పీరా మేకలు, గొర్రెలు మేపుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం తనదగ్గరున్న 20 గొర్రెలను సమీప పొలంలో మేపుకునేందుకు తోలుకుని వెళ్ళాడు. అయితే ఈదురుగాలులకు ప్రధాన విద్యుత్ తీగ తెగి కిందపడింది. ఇది గమనించని గొర్రెలు తెగిన విద్యుత్ తీగను తగిలి అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారు రూ. 3లక్షల నష్టం వచ్చినట్లు మహబూబ్‌పీరా వాపోయాడు.

ఓటమి భయంతోనే వైసీపీ ఫేక్ ప్రచారాలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిపైనా అబద్ధపు ప్రచారం

నా మాటలను ముందూవెనకా కత్తిరించి.. ఆపై వక్రీకరించి వీడియోలు విడుదల చేయడం నీచం

టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఏప్రిల్ 10 : వచ్చే ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకున్న వైసీపీ నేతలు ఎన్డీయే కూటమి అభ్యర్థిపై ఫేక్ ప్రచారాలకు దిగటం సిగ్గుచేటని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో బుధవారం జరిగిన కూటమి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫేక్ ప్రచారాలు చేసినంత మాత్రాన గెలుపును ఆపలేరన్నారు. ఆయా వీడియోలను చిత్రీకరించిన వారెవరో తెలుసని, సమాధానం చెప్పే సమయం దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కలసికట్టుగా ఎన్నికల్లో నిలబడ్డాయని, దీనిని జీర్ణించుకోలేని వైసీపీ బీజేపీ, టీడీపీ, జనసేన రాష్ట్రస్థాయి నాయకులపై కూడా ఫేక్ వీడియోలు చిత్రీకరించి సోషల్ మీడియా వేదికగా కుటిల ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిపై కూడా వైసీపీ ఫేక్ సమాచారం చేసి ముస్లిం కుటుంబాల్లో వ్యతిరేకత తెచ్చేందుకు పథకాన్ని వేసిందన్నారు. పింఛన్‌ల విషయంలో తాను మాట్లాడిన మాటలను ముందు వెనుక తొలగించి వ్యతిరేకంగా మాట్లాడినట్లు పేటీఎం బ్యాచ్ ఫేక్ వీడియో తయారు చేసి తన మాటలను వక్రీకరించి శునకానందం పొందటం సిగ్గుచేటు అన్నారు. జనసేన నాయకులు వరికూటి నాగరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి లాంటి పాలనాదక్షత కల్గిన నేత అవసరం అన్నారు. బీజేపీ నాయకులు కొండిశెట్టి రమణయ్య మాట్లాడుతూ బీజేపీ ఏ వర్గానికి, కులానికో, మతానికో సంబంధించింది కాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వీవీఆర్ మనోహరరావు (చిరంజీవి), భేరి పుల్లారెడ్డి, మండలపార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, షేక్ ఫిరోజ్, నంబలు వెంకటేశ్వర్లుయాదవ్, కుందురు తిరుపతిరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, అహ్మద్, జంషీర్, గుడిపాటి ఖాదర్, తెలుగుమహిళలు కరణం అరుణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

బీసీలకు అండగా టీడీపీ



మాట్లాడుతున్న బాలసుబ్బయ్య

పీసీపల్లి, ఏప్రిల్ 10 : బీసీలకు టీడీపీ అండగా ఉంటోందని ఆ పార్టీ నేత బాలసుబ్బయ్య చెప్పారు. మండలంలోని రామాపురంలో బుధవారం టీడీపీ జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి బాలసుబ్బయ్య మాట్లాడుతూ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిలను గెలిపించాలని కోరారు. సదస్సులో బీసీ సెల్ జిల్లా కార్యదర్శి కోమటిగుంట్ల వీరయ్య, సర్పంచ్‌లు కనపర్తి శ్యాంసన్, కరణం తిరుపతయ్య, పల్లా మల్లికార్జున్, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు రాజు, గుదే నాగేశ్వరరావు, ముప్పూరి పెదబ్రహ్మయ్య, లక్ష్మీనారాయణ, గురుబ్రహ్మం, ఏనుగంటి శ్రీను, వెంకయ్య, నాగరాజు, ఎబినేజరు పాల్గొన్నారు.

లక్ష్మీనరసాపురం, కంభంపాడులో అధికార పార్టీకి షాక్

ఉగ్ర సమక్షంలో 125 కుటుంబాలు టీడీపీలో చేరిక

ఉగ్ర, మద్దిశెట్టి సమక్షంలో టీడీపీలో చేరిక

పామూరు ఏప్రిల్ 10 : పామూరు మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. లక్ష్మీనరసాపురంలో దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు రవి ఆధ్వర్యంలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 78 కుటుంబాలు, రేగిచెట్లపల్లికి చెందిన 12 కుటుంబాల వారు అధికార వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో బుధవారం టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ ఉగ్ర టీడీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉగ్ర మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, గత ఎన్నికల్లో మీ ఓట్లతో గెలిచిన పాలకులు ప్రజల సమస్యలను పట్టించుకోలేదని, కానీ తాను నియోజకవర్గాన్ని అంటిపెట్టుకొని ప్రజలకు సేవా కార్యక్రమాలు చేస్తున్నానని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు కాలువ విస్తరణ, నిమ్జ్, ట్రిపుల్‌ఐటీ, రైల్వేలైన్, ఇంటింటికీ మంచినీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని, లేకపోతే మరోసారి ఓట్ల కోసం రానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ దశరథరామయ్య, నేతలు భైరెడ్డి జయరామిరెడ్డి, బొల్లా నరసింహారావు, ఆకుపాటి వెంకటేష్, హుసేన్‌రావు యాదవ్, సయ్యద్ అమీర్‌బాబు, హరిబాబు, పాలపర్తి వెంకటేశ్వర్లు, నరసయ్య, ఇర్రి కోటిరెడ్డి, ఎన్ సాంబయ్య పాల్గొన్నారు. కాగా సీఎస్‌పురం మండలం కంభంపాడు గ్రామ మాజీ సర్పంచ్ మేకల అంజయ్య, సచివాలయం కన్వీనర్ దాసరి మాధవరావు, చింతం సెల్వరాజ్, గ్రామ పంచాయతీ 2వ వార్డు సభ్యులు మేకల చినరోశయ్య, దూపాటి వినోద్‌తో పాటు 39 కుటుంబాలు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు, బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ తోడేటి చినఅల్లూరయ్య, ఎన్‌సీ చినమాలకొండయ్య, ఎం నరసింహరాజు, వెంకటరామరాజు, మన్నెపల్లి శ్రీను, దాసరి మల్లికార్జున పాల్గొన్నారు.



లక్ష్మీనరసాపురంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో ఉగ్ర

ఉగ్రను గెలిపిస్తేనే కనిగిరి అభివృద్ధి సాధ్యం

వైసీపీని వీడి టీడీపీకి మద్దతు ప్రకటించిన పోతు కొండారెడ్డి



ఉగ్రతో పోతు కొండారెడ్డి

ఉగ్రతో కలసి ప్రచారం

కనిగిరి, ఏప్రిల్ 10 : టీడీపీ కూటమి అభ్యర్థి ఉగ్రనరసింహారెడ్డిని గెలిపించాలని మాజీ ఎంపీపీ, వైసీపీ నేత పోతు కొండారెడ్డి కోరారు. మండలంలోని లింగారెడ్డిపల్లిలో డాక్టర్ ఉగ్ర సూపర్‌సిక్స్ పథకాలపై బుధవారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో మాజీ ఎంపీపీ, వైసీపీ నేత పోతు కొండారెడ్డి డాక్టర్ ఉగ్రకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ టీడీపీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ కనిగిరిలో అభివృద్ధి పాతికేళ్లు వెనుకబడి పోయిందన్నారు. తిరిగి కనిగిరి అభివృద్ధిలోకి రావాలంటే సమర్థుడైన ఉగ్రతోనే సాధ్యమన్నారు. ప్రచారకార్యక్రమానికి వస్తున్న డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి స్వాగతం పలికారు. మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నారపరెడ్డి(యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, భేరిపుల్లారెడ్డి, కుందురు తిరుపతిరెడ్డి, సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి, బజాజ్ ఓబులరెడ్డి, సిద్దాటపు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

దొనకొండలో టీడీపీ అభ్యర్థి లక్ష్మికి ఘనస్వాగతం

భారీగా ద్విచక్ర వాహనాలతో ర్యాలీ

దొనకొండ, ఏప్రిల్ 10 : నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మొట్టమొదటి సారిగా ఎన్నికల ప్రచారం నిమిత్తం దొనకొండకు బుధవారం విచ్చేయటంతో టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. కూడలిలోని విజయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి అక్కడ నుంచి బాణసంచా కాల్చుతూ, కేరింతలు కొడుతూ భారీగా ద్విచక్ర వాహనాలతో ర్యాలీ చేశారు. దొనకొండలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ, ఆమె భర్త డాక్టర్ కడియాల లలిత్‌సాగర్‌ను శాలువాలు, పూలమాలలతో నాయకులు సన్మానించారు. దొనకొండ మాజీ సర్పంచ్ మండ్లా అంతోనిపీటర్‌కు, దివ్యాంగుడైన కాశయ్యకు చల్లటి మజ్జిగ అందజేసి మీ సహకారం మాకు అందించాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తన తాత దివంగత గొట్టిపాటి హనుమంతరావు, తండ్రి దివంగత నర్సయ్య ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవలందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు శివకోటేశ్వరరావు, నాయకులు వెంకటేశ్వర్లు, వల్లపునేని వెంకటస్వామి, వడ్లమూడి చెన్నయ్య, దుగ్గెంపూడి చెంచయ్య, కొత్తం రఘునాథరెడ్డి, కొమ్మతోటి సుబ్బారావు, విప్పర్ల లక్ష్మీరావు, మన్నెం గాలెయ్య, శృంగారపు నాగసుబ్బారెడ్డి, యరగొర్ల బసవయ్య, అంకాల మల్లి, కమ్మా వెంకటనారాయణ, కుందుర్తి లక్ష్మణ్, షేక్ తౌహీద్, చెన్నయ్య పాల్గొన్నారు.





టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీ, అనారోగ్యంతో ఉన్న వ్యక్తి వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ లక్ష్మీ

దర్శిలో ముమ్మరంగా ప్రచారం

దర్శి, ఏప్రిల్ 10 : దర్శిలో టీడీపీ ప్రచారం జోరుగా సాగుతోంది. టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. పట్టణంలోని 1, 20 వార్డుల్లో బుధవారం ఆమె మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి ప్రజలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఆమె మాట్లాడుతూ మీ ఆడపడుచుగా మీ ముందుకు వచ్చా అని వినమ్రతతో విజ్ఞప్తి చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య, నేతలు యాదగిరి వాసు, కనం మల్లేశ్వరి శ్రీనివాసరావు, శ్రీరాం రమణయ్య బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి, జనసేన నాయకులు కుప్పాల పాపారావు పాల్గొన్నారు.

200 మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

దర్శి ఏప్రిల్ 10 : టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, ఆమె భర్త లలిత్‌సాగర్ సమక్షంలో దొనకొండ మండలంకు చెందిన 200 మంది బుధవారం టీడీపీలో చేరారు. దొనకొండ వైస్ ఎంపీపీ వడ్లమూడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మల్లంపేట వైసీపీ సర్పంచ్ పోలు కుమార్, మండల వైసీపీ నాయకుడు వడ్లమూడి వెంకటాద్రితో పాటు 200 మందికి కండవాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీపై విశ్వాసంతో వైసీపీ నుండి భారీ స్థాయిలో చేరుతున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాతో సాధ్యమని అన్నీ వర్గాలు ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని, ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్దులకు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.



లక్ష్మీ సమక్షంలో టీడీపీలో చేరుతున్న నేతలు

నాయకులతో ఎమ్మెల్యే వేణుగోపాల్ మంతనాలు

దర్శి, ఏప్రిల్ 10 : ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అనుచరులతో వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఆయన సోదరుడు శ్రీధర్‌తో కలిసి అందరి అభిప్రాయాలు తెలుసుకున్నారు. తాళ్లూరు ఎంపీపీ శ్రీనివాసరావు, కురిచేడు ఎంపీపీ భర్త చంద్రశేఖర్, దొనకొండ జడ్పీటీసీ సభ్యుడు సుధాకర్, దొనకొండ మండల వైసీపీ కన్వీనర్ నారపురెడ్డి, వైస్ ఎంపీపీలు కోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, ముండ్లమూరు మండల వైసీపీ కన్వీనర్ సుబ్బారెడ్డి, దర్శి నగర పంచాయతీ కౌన్సిలర్ వీసీ రెడ్డితోపాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. వైసీపీ టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేసినందున వచ్చే ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇస్తే బాగుంటుందని అధికశాతం మంది నాయకులు తమ అభిప్రాయాలను సూచించినట్లు తెలిసింది. అందరి అభిప్రాయం తెలుసుకున్న తర్వాత ఎమ్మెల్యే వేణుగోపాల్ అందరి మనోభావాలకు అనుగుణంగా త్వరలో నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసినట్లు సమాచారం.



అనుచరులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

తూతూమంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

అధికారులకే పరిమితం.. 40 నిమిషాల్లో ముగించిన వైనం

దొనకొండ, ఏప్రిల్ 10 : మండల సమావేశం తూతూమంత్రంగా ముగిసింది. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహించాల్సిన సమావేశ లక్ష్యం పక్కదారి పట్టింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం మధ్యాహ్నం 12 గంటల వరకు అధికారులు తప్పా సభ్యులు హాజరుకాలేదు. అనంతరం ఎంపీపీతో కలిపి ఐదుగురు సభ్యులు హాజరుకావటంతో ఎంపీడీవో వసంతరావునాయక్ 12-15 గంటలకు సమావేశం ప్రారంభించి 45 నిమిషాల్లో ముగించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ సాగర్ కాలువకు నీరు ఈనెల 8న విడుదలైందని, శుక్రవారం ఉదయం మండలంలోకి నీళ్లు చేరతాయన్నారు. కేవలం 10 రోజులు మాత్రమే కాలువలో నీరు సరఫరా జరుగుతుండటంతో యుద్ధప్రాతిపదికన స్టోరేజీ నింపేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఏవో లక్ష్మీనారాయణ, విద్యాశాఖ అధికారి షేక్ అమీర్, వైద్యాధికారిణి సునీత, ఉపాధి ఏపీవో దేవయ్య, వైకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, సంక్షేమాధికారి సురేష్, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ గఫార్ పాల్గొన్నారు.

పీసీపల్లిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ

పీసీపల్లి, ఏప్రిల్ 10 : మండలంలోని పెద్దన్నపల్లి, మర్రికుంటపల్లి, గుదేవారిపాలెం, పెదయిర్లపాడు గ్రామాల్లో నిర్వహించినబాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో నేతలు వీరపనేని పెద్దన్న, రత్తయ్య, మాల్యాద్రి, విష్ణు, మాలకొండయ్య, శివప్రసాదు, రమణయ్య ఆంజనేయులు, కూరపాటి కిట్టు, క్రిష్ణారెడ్డి, కొండపనాయుడు, హనుమారెడ్డి, ఓబుల్‌రెడ్డి, జి.మాల్యాద్రి, పిచ్చిరెడ్డి, గుదే నాగేశ్వరరావు, పువ్వాడి నాగరాజు, ఇజ్రాయెల్, వెంకయ్య పాల్గొన్నారు.





అర్ధరాత్రి కరకట్టపై లారీల బారులు

హనిమిరెడ్డి.. ఎక్కడ?

- తుస్సుమన్న జగన్ బస్సుయాత్ర
- ఆచూకీలేని అద్దంకి వైసీపీ అభ్యర్థి పాణ్యం
- పోటీ విషయంలో విముఖతే కారణమా?

బాపట్ల(ఆంధ్రజ్యోతి)/ సంతమాగులూరు, ఏప్రిల్ 10: మేమంతా సిద్ధం అంటూ ముఖ్యమంత్రి జగన్ బస్సుయాత్ర చేపట్టారు. అయితే అద్దంకి నియోజకవర్గంలో అసెంబ్లీ అభ్యర్థి పాణ్యం హనిమిరెడ్డి మాత్రం.. తాను సిద్ధంగా లేనంటూ జగన్ బస్సుయాత్రకు ముఖం చాటేశారు. సంతమాగులూరు మండల పరిధిలో బుధవారం సుమారు 7 కిలోమీటర్లు రోడ్‌షో సాగగా ఎక్కడా హనిమిరెడ్డి కానరాలేదు. జగన్ బస్సుయాత్రలో అభ్యర్థి పత్తాలేకపోవడం చర్చకు దారి తీసింది. మేమంతా సిద్ధం బస్సుయాత్ర బుధవారం పల్నాడు జిల్లాలోకి ప్రవేశించే క్రమంలో అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరు క్రాస్‌రోడ్డు మీదగా జగన్ బస్సుయాత్ర సాగింది. జగన్ బస్సుపై నుంచి శ్రేణులకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. అయితే ఎక్కడా అద్దంకి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి పాణెం హనిమిరెడ్డి జాడే కానరాలేదు. పార్టీ పనులపై అభ్యర్థి హైదరాబాద్ వెళ్లారని అనుచరవర్గం చెబుతున్నప్పటికీ తన నియోజకవర్గం మీదగా సీఎం వెళుతున్నప్పుడు హనిమిరెడ్డి కలవకపోవడం వైసీపీ శ్రేణులనే నిరాశకు గురిచేసింది. పైగా గత కొన్ని రోజులుగా హనిమిరెడ్డి తీరుపై వచ్చిన ఆరోపణలకు బుధవారం నాటి పరిణామాలు బలం చేకూర్చినట్లైందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అడ్డరోడ్డు వద్ద ముఖ్యమంత్రి జగన్ బస్సుయాత్ర రోడ్‌షో తుస్సుమన్నది. మండల పరిధిలో సుమారు 7 కిలోమీటర్లు సాగిన రోడ్‌షో వెలవెలపోయింది. హనిమిరెడ్డి ఈ రోడ్‌షోకు మొహం చాటేయడంతో మండల వైసీపీ నాయకులు జనసమీకరణ చేయకుండా మమ అనిపించారు. అడ్డరోడ్డుకు జగన్ బస్సు వచ్చే సరికి వెయ్యి మంది కూడా లేరు. దీంతో అభివాదం చేసిన వెంటనే బస్సులోకి జగన్ వెళ్లిపోయారు.

అడ్డరోడ్డు వద్ద అభివాదం చేస్తున్న జగన్



గతంలోనూ ఒకసారి..

అద్దంకి వైసీపీ అభ్యర్థి ఉన్నట్లుండి నియోజకవర్గం నుంచి మాయమవడం ఇది తొలిసారి కాదు. గతంలోనూ ఒకసారి ఇలానే వైసీపీ శ్రేణులకు అందుబాటులో లేకుండా పోయారు. ఇప్పుడు ఏకంగా సీఎం బస్సుయాత్రకే డుమ్మా కొట్టారు. అద్దంకిలో వైసీపీ శ్రేణుల నుంచే మద్దతు దక్కకపోవడంతో పాటు సిట్టింగ్ టీడీపీ ఎమ్మెల్యే రవికుమార్ రాజకీయ వ్యూహాలతో కొన్ని రోజులుగా హనిమిరెడ్డి ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి పెద్దఎత్తున చేరికలు సాగాయి. ఈ నేపథ్యంలోనే రెండు వారాల క్రితం హనిమిరెడ్డి తాడేపల్లి పెద్దలను కలిసి తాను పోటీ చేయబోనని, అక్కడ పరిస్థితులన్నీ పూర్తి ప్రతికూలంగా ఉన్నాయని వాపోయినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆర్థిక పరమైన అంశాలు కూడా చర్చకు రాగా నిధుల విషయంలో హామీ ఇచ్చి పంపినట్లు ప్రచారం సాగింది. అయినా నియోజకవర్గంలో ఆయన మొక్కుబడి పర్యటనలు తప్ప చేతులెత్తేశారన్న ప్రచారం ఉంది. ఈ పరిణామాల మధ్య జగన్ బస్సుయాత్ర లో ఆయన జాడ లేకపోవడంతో పోటీపై సొంతపార్టీ శ్రేణుల్లోనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కృష్ణానదిలో.. ఇసుక దొంగలు

- అర్ధరాత్రి అనుమతుల్లేని రీచ్‌లో తవ్వకాలు
- ఎన్నికల కోడ్ సమయంలో అధికారిక దందా
- బొమ్మువానిపాలెం, అన్నవరం రీచ్‌లలో తవ్వకాలు
- వీడియోలు తీసి పంపినా పట్టించుకోని అధికారులు

కృష్ణానదిలో ఇసుక దొంగలు. అర్ధరాత్రి యథేచ్ఛగా ఇసుకను తోడేస్తున్నారు. కృష్ణమ్మను కుళ్లబొడుస్తున్నా పోలీసు, ఎస్‌ఈబీ అధికారులకు పట్టడంలేదు. అధికారానికి అధికారులు దాసోహయ్యారా.. లేదంటే అనధికారిక వసూళ్లలో నిమగ్నమయ్యారో తెలియడంలేదు కానీ గత కొద్ది రోజులుగా చీకటి పడగానే ఇసుక దొంగలు చెలరేగిపోతున్నారు. బొమ్మువానిపాలెం దగ్గర కరకట్టపై లారీలకు లారీలు బారులు తీరి భారీ యంత్రాలతో ఇసుక దొంగలు ఇసుక తవ్వుకుపోతున్నారు. ఏ అనుమతులూ లేని రీచ్‌లో ఇసుకను తోడేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. ఎన్నికల కోడ్‌లో ఏ నేతకూ తలొగ్గాల్సిన అవసరం లేదు. అధికార ఇసుక దందాను అధికారులు కట్టడి చేస్తారని ప్రజలు భావించారు. అయితే అందుకు విరుద్ధంగా ఇక్కడి పరిస్థితి నెలకొంది.

తెనాలి/కొల్లిపర, ఏప్రిల్ 10: జాతీయ హరిత ట్రిబ్యునల్, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతి ఉన్న రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు పగలు మాత్రమే జరగాలి. రాత్రి సమయాల్లో ఇసుక తవ్వకాలు నిషేధం. అయితే ఏకంగా రాత్రి వేళ నిర్భయంగా వందల సంఖ్యలో లారీలకు ఇసుక నింపేసి పంపించేస్తున్నారు. బహిరంగంగానే ఈ దందా నడుస్తున్నా అధికారులు అడ్డుకున్న దాఖలాలే లేవు. కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం, అన్నవరం రీచ్‌లలో ఇసుక దోపిడీ జరుగుతుంది. ఇసుక దందాపై స్థానికులు పోలీసులకు ఎన్నిసార్లు సమాచారం ఇచ్చినా, వీడియోలు తీసి పంపినా ఫలితం లేదు. మీడియాను ఆశ్రయించగా బుధవారం ఆయా రీచ్‌లను పరిశీలిస్తే... ఎటు చూసినా బారులు తీరిన లారీలు, పరిమితికి మించిన లోడ్‌తో వెళుతున్న లారీలు కనిపించాయి. ఇటీవల దుగ్గిరాల మండలం పెదకొండూరు దగ్గర ఇసుక లారీలను పట్టుకుని స్థానికులు పోలీసులకు పట్టించారు. ఆ ఒక్కరోజు ఆపినా, ఆ తర్వాత మళ్లీ తవ్వకాలు, అక్రమ రవాణా యథావిధిగా జరిగిపోతోంది. ఇదే పరిస్థితి కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం, అన్నవరం రీచ్‌లలో కూడా నెలకొంది.

కోడ్ వచ్చినా అధికారిక దందా..

ఇంతకాలం ఎమ్మెల్యేనో, ఎంపీ, మంత్రి పేరుచెప్పి ఇసుక తవ్వుకుపోయారు. ఇప్పుడు అవేమీ కుదరవు. ఏది జరిగినా మా కన్నుసన్నల్లో జరగాల్సిందే. ఇదీ ఇటీవల ఇసుక లారీల యజమానులతో ఓ అధికారి చెప్పిన మాట. ఈ రెండు నెలలూ తాము చెప్పినట్లు వినాల్సిందేనంటూ హుకుం జారీచేసి మరీ ఇసుక తవ్వకాలకు పచ్చజెండా ఊపారు. అంటే ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతున్నట్లు అర్థమవుతుంది. బొమ్మువానిపాలెం దగ్గర చీకటిపడితే చాలు.. కరకట్టపై, నదిలో వేసిన గాలు మార్గంలో వందల సంఖ్యలో లారీలు బారులుతీరి ఉంటున్నాయి. నదిలో భారీ ఎక్స్‌కవేటర్లతో ఇసుక తోడుస్తున్నారు. పరిమితికి మించిన లోడుతో ఇసుక లారీలు తరలిపోతున్నాయి. ప్రస్తుతం మున్నంగి రీచ్‌లో తవ్వకాలు ఆగాయి. వారంక్రితం అధికారికంగా రీచ్ తెరుస్తామని ప్రచారం చేసినా ప్రారంభం కాలేదు. పెదకొండూరు రీచ్‌లో తవ్వకాలకు స్థానికులు అడ్డుపడుతుండటంతో బొమ్మువానిపాలెం, అన్నవరం రీచ్‌లో అక్రమ తవ్వకాలకు డిమాండ్ పెరిగింది. దీంతో నిన్నటి వరకు పగలు తవ్వకాలు జరపగా ఇప్పుడు రాత్రివేళల్లో సాగిస్తున్నారు. బొమ్మువానిపాలెం, మనుమాన్ పాలెం వాసులు పోలీసులకు సమాచారం అందించినా అధికారులు పట్టించుకోలేదని వారు వాపోతున్నారు. ఫోన్‌చేసి ఫిర్యాదు చేసినప్పుడు వచ్చి కేకలు వేసి వెళ్లిపోవడం, గంట తర్వాత మళ్లీ తవ్వకాలు సాగడం పరిపాటిగా మారిందని వారు చెబుతున్నారు.

బోర్ల నుంచి నీరు రావటంలేదు

మొక్కజొన్న చేతికొచ్చి, నీటి తడులు పెట్టాల్సిన అవసరం లేకున్నా భూగర్భ జలాలు మరింత అడుగుకుపోయాయి. లంక గ్రామాల్లో వాణిజ్య పంటలకు ఎకరాకు నీటి తడిని అందించాలంటే మొన్నటి వరకు మూడు నుంచి వారం రోజులు పడితే, ఇప్పుడు ఆ మాత్రం కూడా నీరు అందడం లేదు. ఇసుక నిల్వలు ఉన్నా తవ్వుకున్నారంటే పట్టించుకునేవారిమి కాదని, ఇసుక తవ్వటానికి లేకపోయినా, నీరు బయటపడే వరకు పది నుంచి 20 అడుగుల లోతుపెట్టిమరీ తవ్వుకుపోతున్నారని వాపోతున్నారు. దీనివల్ల భూగర్భ జలాలు పూర్తిగా పడిపోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్నటి వరకు సాధారణ మోటార్లకు నీరు రాకపోతే సబ్‌మెర్సిబుల్, జెట్ మోటార్లు అమర్చామని, ఇప్పుడు వాటికి కూడా నీరు రాకుండా మట్టి, ఇసుక వస్తున్నాయంటున్నారు. ఎన్నికల కోడ్ వచ్చినా ఇసుక తవ్వకాలు ఆగలేదేంటనేది వారి ప్రశ్న. నిన్నటి వరకు నాయకులు తవ్వుకుపోతే, ఇప్పుడు అధికారులు తవ్వుకుపోతున్నారా! అంటూ వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక తవ్వనివ్వని వారికే ఈ సారి ఓటు వేద్దాం!

ఇసుక విచ్చలవిడి తవ్వకాలకు అనుమతివ్వని వారికే ఈ సారి ఓటు వేస్తామని కొల్లిపర మండలంలోని కొన్ని తీర గ్రామాల ప్రజలు తేల్చి చెప్పేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు కట్టుబడి ఉందామని తీర్మానించుకున్నట్లు సమాచారం. ప్రచారాలకు వచ్చే అభ్యర్థులకు కూడా ఇదే విషయాన్ని చెప్పాలని వారు నిర్ణయించుకున్నారు. ఈ సారి పార్టీల అభిమానంతో ఓటేస్తే కష్టమని, మన భవిష్యత్ కోసం కఠిన నిర్ణయం తీసుకోవాల్సిందేనని వారి ఆలోచన. ఇసుక దందాతో ఒక్కో ఊరికి ఒకరిద్దరు దోచుకుని లాభపడుతుంటే, మిగిలిన గ్రామాలన్నీ నాశనమవుతున్నాయంటున్నారు. పచ్చని పల్లెల్లో ఇసుక చిచ్చురేపుతోందని, ఇకపై ఇటువంటివి లేకుండా ఉండాలంటే ఇసుక తవ్వకాలు ఆపేవారు కావాలని బొమ్మువానిపాలెం, కొల్లిపర, వల్లభాపురం, అత్తలూరివారిపాలెం, అన్నవరం, అన్నవరపులంక, కొత్తూరులంక తదితర గ్రామాల ప్రజలు తీర్మానించారు. నది మధ్య ఉన్న లంక గ్రామాల ప్రజలు ఈ విషయంలో పట్టుదలగా ఉన్నారని సమాచారం.



కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం-చిలుమూరు మధ్య కరకట్టపై పరిమితికి మించిన లోడుతో అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు

షర్మిలతో ఆమంచి

- బహిరంగ సభకు హాజరుకావాలని ఆహ్వానం



పీసీసీ చీఫ్ షర్మిలను కలిసిన ఆమంచి కృష్ణమోహన్

చీరాల, ఏప్రిల్ 10: వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ బుధవారం పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలను కలిశారు. ఇది వైసీపీకి ఊహించని షాక్‌గా చెప్పుకుంటున్నారు. మంగళవారం పందిళ్లపల్లిలోని తన నివాసంలో ఆమంచి తన అనుచరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి తాను కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. ఈనేపథ్యంలో బుధవారం ముఖ్య అనుచరులతో కలసి బెంగళూరులోని షర్మిలను ఆమె నివాసంలో కలిశారు. ముందుగా తనను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించినందుకు ఆమంచి కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ పార్టీ నుంచి మొదలైనట్లు చెప్పారు. త్వరలో చీరాల నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, ఆ సభకు రావాల్సిందిగా షర్మిలను ఆయన ఆహ్వానించారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఆమంచి వెంట నియోజకవర్గ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ మార్పు గ్రెగోరి, మేడిబోయిన బలరామిరెడ్డి, బండ్ల బాబు, కోటి దాసు, శీలం శ్యామ్, బజ్జిబాబు,షేక్ రెహ్మాన్, ఎండ్రపాటి సునీల్, కంకట శివప్రసాద్ ఉన్నారు.

ఆర్టీసీ.. చలో సిద్ధం

- బస్సులు లేక ప్రయాణికుల పాట్లు
- 41 సర్వీస్‌లకు 26 బస్సులు తరలింపు

బాపట్ల, ఏప్రిల్ 10: మేమంతా సిద్ధం అంటూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టగా.. ఆర్టీసీ ఆయన సేవలో తరిస్తోంది. బుధవారం పిడుగురాళ్ల సమీపంలో సిద్ధం సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు జనాన్ని తరలించేందుకు బాపట్ల ఆర్టీసీ డిపో నుంచి 26 బస్సులను తరలించారు. డిపో పరిధిలో మొత్తం 41 సర్వీస్‌లు ఉండగా వాటిలో 24 ఆర్డనరీలు, 2 ఎక్స్‌ప్రెస్ బస్సులను సిద్ధం సభకు కేటాయించారు. దీంతో డిపో పరిధిలో మిగిలిన 15 బస్సులు మాత్రమే అన్నిరూట్లలో తిరగాల్సి వచ్చింది. గంటకు ఒక బస్సు కూడా రాక ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రతిసారి వైసీపీ సభలకు అరకొర ఉన్న బస్సులను తీసుకెళ్లడం.. ఇబ్బందులను పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు ఆర్టీసీ అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే ఆసరాగా ఆటోవాలాలు అధనపు చార్జీలు చేసి ప్రయాణికులను గమ్యస్థానాలకు తరలించారు. బస్సులు లేని కారణంగా తమ జేబుకు చిల్లుపడిందని ప్రయాణికులు వాపోయారు. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో ప్రయాణికులకు ప్రయాణ కష్టాలు ఎదురయ్యాయి.



పిడుగురాళ్లలో జరిగే సిద్ధం సభకు తరలిస్తున్న ఆర్‌టీసీ బస్సులు



బస్సుల కోసం బాపట్ల పాతబస్టాండ్‌లో పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

12న చంద్రబాబు ప్రజాగళం

వేమూరులో టీడీపీ, జనసేన శ్రేణులతో మాట్లాడుతున్న ఆనందబాబు



కొల్లూరు/రేపల్లె, ఏప్రిల్ 10: ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం సభ 12వ తేదీ సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జరుతుందని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఉప్పూడి రోడ్డులోని హెలీప్యాడ్ పనులను బుధవారం ఆర్‌అండ్‌బీ అధికారులు ఎమ్మెల్యే సోదరుడు శివప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాగళం సభకు నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, ప్రజలు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

- వేమూరు: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మండల కేంద్రమైన కొల్లూరులో శుక్రవారం ప్రజాగళం రోడ్డు షోను నిర్వహించనున్నట్లు మాజీమంత్రి, వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు కోరారు. బుధవారం సాయంత్రం వేమూరులోని పార్టీ కార్యాలయంలో టీడీపీ, జనసేన శ్రేణుల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం 3గంటలకు కొల్లూరు గౌడపాలెం వద్ద ప్రజాగళం కార్యక్రమం జరుగుతుందన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, వేమూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పూడి రోడ్డులో చంద్రబాబు పర్యటనకు హెలీప్యాడ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోదరుడు శివప్రసాద్, ఆర్‌అండ్‌బీ అధికారులు

ఈద్ ముబారక్

- నేడే ఈద్-ఉల్-ఫితర్ పర్వదినం
- 30 రోజుల ఉపవాస దీక్షల విరమణ
- ఫిత్రా రూ.100గా నిర్ణయం
- విద్యుత్ వెలుగుల్లో మసీదులు

రేపల్లె, ఏప్రిల్, 10: గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బుధవారం సాయంత్రం ఆకాశంలో నెలవంక (చంద్రోదయం) దర్శనమిచ్చింది. దీంతో గురువారం రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవచ్చని ముస్లిం మత పెద్దలు ప్రకటించారు. దీంతో ముస్లింలు 30 రోజులుగా చేసిన కఠిన ఉపవాస దీక్షలు వీడి పండుగ పనుల్లో బిజీ అయిపోయారు. రంజాన్ పర్వదినం సందర్భంగా మసీదులు, ఈద్గాలను అంగరంగ వైభవంగా ముస్తాబు చేశారు. ఈ ఏడాది రంజాన్ మాసంలో ఎన్నికల హడావుడి మొదలు కావడంతో రాజకీయ ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. నెలరోజుల పాటు సాగిన రంజాన్ ఉపవాస దీక్షలు, ఇఫ్తార్లలో పలువురు రాజకీయ నేతలు పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. వారికి పలు రకాలుగా సేవలు అందజేశారు.



పరోపకారానికి నిదర్శనంగా దాన, ధర్మాలు

ఈదుల్ ఫితర్ పండుగ అత్యున్నత మానవీయ విలువలను, పరస్పర ప్రేమానురాగాలను పెంపొందిస్తుందని ముస్లింలు బలంగా నమ్ముతారు. రంజాన్ నెలలో అత్యధిక దానధర్మాలు చేస్తారు. సంపాదనాపరులైనవారు, సంపన్నులైనవారు రంజాన్ నెలలో జకాత్ అచరించాలని ఖురాన్ బోధిస్తోంది. ఆస్తిలోనుంచి నిర్ణీత మొత్తాన్ని పేదలకు దానం చేయడాన్ని జకాత్ అని అంటారు.

మసీదులకు అలంకరణ...

రంజాన్ పండుగ సందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. విద్యుత్ వెలుగుల్లో మసీదులు శోభాయమానంగా కన్పిస్తున్నాయి. కొనుగోలుదార్లతో దుకాణాలు కిటకిటలాడాయి. నమాజ్ చేయడానికి వీలుగా అయా ప్రాంతాల్లో ఈద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు పూర్తయ్యాయి. నమాజు చేసుకోవాడానికి వీలుగా షామియానాలు వేశారు. వజూ చేసుకోవాడానికి వసతి ఏర్పాట్లు చేశారు. ఉదయం పదిగంటలకు ఈద్ నమాజ్ ప్రారంభమవుతుందని మైకుల ద్వారా చెప్పించారు. పండుగ సందర్భంగా ప్రతి ముస్లిం విధిగా ఫిత్రాను ఇవ్వాలి. ఈ ఏడు ఫిత్రాను 100 రూపాయలుగా ప్రకటించారు. ఇంట్లో ఎంతమంది సభ్యులు ఉంటే అంతమంది ఫిత్రా విధిగా ఇవ్వాలి. రంజాన్ సందర్భంగా ప్రతి ఒక్క ముస్లిం జకాత్‌ను ఇవ్వాలి. జకాత్ అంటే తమ ఆదాయంలో పది శాతం ధనాన్ని తీసి, పేద ముస్లింలకు ఇవ్వాలి.

రంజాన్ అంటే..

రమదాన్ అంటే శుభవేళ, ఉత్సవ సమయం అని అర్థం. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం. రమదాన్‌ను వాడుక భాషలో సాధారణ ప్రజలు రంజాన్‌గా పిలుస్తుంటారు. చంద్రమానాన్ని అనుసరించి రూపొందించిన ఇస్లామిక్ క్యాలండరులో తొమ్మిదో నెల 'రంజాన్'. ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ ఈ మాసంలోనే ఆవిర్భవించిందని ప్రవక్తలు చెప్పడంతో రంజాన్‌ను అత్యంత పవిత్రమైన నెలగా భావిస్తారు. ముప్పై ఉపవాస దీక్షలు పాటించి పదో నెల 'షవ్వాల్' మొదటి రోజున ఈదుల్ ఫిత్ర్ జరుపుకుంటారు. 'చంద్రోదయం(నెలవంక దర్శనం) జరిగితేనే ఈద్- ఉల్- ఫితర్ జరుపుకుంటారు. ఈద్-ఉల్- ఫితర్ నాడు ప్రత్యేకమైన సలాత్(ఇస్లామీయ ప్రార్థన) చేస్తారు. ఈ ప్రార్థనను సమూహంగానే (జమాత్) చేస్తారు. ఈద్గాల వద్ద అందరూ గుమిగూడి దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకుంటూ నమాజ్ చేస్తారు.



రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

కార్డుదారుకు అందని రేషన్

బియ్యం అడిగినా ఈ నెలలో లేవు సర్దుకోండి అంటూ సలహా

ఎన్నికల సమయం కావడంతో పట్టించుకోని అధికార యంత్రాంగం

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 10 : జిల్లాకేంద్రమైన ఒంగోలులో రేషన్ మాఫియా మరింత రెచ్చిపోతున్నారు. ఎన్నికల అనంతరం పరిస్థితి ఏ విధంగా ఉంటుందోననే భయంతో ముందుగానే వచ్చిన కాడికి దండుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ ప్రాంతం, ఆ ప్రాంతం అనే తేడా లేకుండా డీలర్ల వద్ద నుంచి రేషన్ దందా నడుపుతున్న అధికార పార్టీ నాయకులు బియ్యం కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నిప్రాంతాల్లో కార్డుదారులు మొబైల్ వాహనాల వద్ద బియ్యం కోసం వెళితే ఈసారికి సర్దుకోండి సరిపడా లేవని చెప్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. కొంతమంది డీలర్లే స్వయంగా బియ్యం అక్రమ వ్యాపారంలోకి దిగారు. గతంలో బియ్యం తీసుకోని కార్డుదారునికి రూ.10 నుంచి రూ.11 వరకు కిలోకు ఇవ్వగా ఇప్పుడు కేవలం రూ.9 మాత్రమే ఇస్తున్నారు. ఇదేమిటి అని కార్డుదారులు అడిగితే కనీస సమాధానం కూడా ఇవ్వడం లేదు. మొబైల్ వాహనం వద్ద కార్డుదారుల నుంచి వేలిముద్ర తీసుకున్న అనంతరం ఏ రోజుకారోజు ఎన్ని కార్డులు తీసుకున్నారో లెక్క కట్టుకొని వెంటనే బయటకు విక్రయిస్తున్నారు. పేదల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని కిలో రూ.21 నుంచి రూ.23 వరకు విక్రయిస్తూ లక్షలు గడిస్తున్నారు. గత పది రోజుల నుంచి జిల్లాకేంద్రమైన ఒంగోలులో ఇదే తంతు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడం, అధికారయంత్రాంగం ఎన్నికల విధుల్లో ఉండటంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కిలో బియ్యం రూ.55 పలుకుతున్నాయి. అయితే అనేక శివారు కాలనీల్లో ప్రజానీకం ఈ బియ్యాన్నే ఎక్కువగా వినియోగిస్తున్నారు. అటువంటి వారికి కూడా బియ్యం ఇవ్వకుండా డీలర్లు అడ్డుకుంటున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే దురుసుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కాగా ఒంగోలులోనే ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. ప్రధానంగా కొంత మంది డీలర్లే స్వయంగా బియ్యం కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆ డీలర్లందరూ అధికారపార్టీ నేతల అనుయాయులు కావడంతో పౌరసరఫరాల శాఖ ఉద్యోగులు కూడా పట్టించుకోవడం లేదు. మరో రెండు నెలల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ముందుగానే ఊహించుకుని రేషన్ మాఫియా మరింత రెచ్చిపోతుందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి,

గెలాక్సీపురంలో గంజాయి గుప్పు

గ్రానైట్ కార్మికులే లక్ష్యంగా విక్రయాలు

2.6 కేజీలు పట్టుకున్న ఎస్ఈబీ అధికారులు

చీమకుర్తి, ఏప్రిల్ 10: గెలాక్సీపురంగా పేరుగాంచిన చీమకుర్తి పట్టణంలో మరోసారి గంజాయి గుప్పుమంది. గ్రానైట్ పరిశ్రమలో పనిచేసే కార్మికులే లక్ష్యంగా ఒడిశా నుంచి కొనుగోలు చేసి యథేచ్ఛగా ఈప్రాంతంలో విక్రయాలు జరుపుతున్న స్థావరంపై బుధవారం ఎస్ఈబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 2.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం పట్టణంలోని ఎస్ఈబీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ వెల్లడించారు. వలస కార్మికునిగా వచ్చిన యుధిష్టర్ పట్టణంలోని ఒక సెలూన్‌లో పనిచేస్తూ అడ్డదారిలో డబ్బులు సంపాదించేందుకు గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మరో వలస కార్మికుడు పేర్నమిట్టలో సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తున్న గోలం మండల్‌తో పరిచయం పెంచుకున్న యుధిష్టర్ ఒడిశా నుంచి కొనుగోలు చేసి తెచ్చిన గంజాయిని చీమకుర్తి పరిసర ప్రాంతాల్లో కార్మికులనే లక్ష్యంగా చేసుకొని విక్రయిస్తున్నారు. కాగా బుధవారం గోలమండల్ గంజాయిని తీసుకొచ్చి యుధిష్టర్‌కు ఇస్తుండగా ఎస్ఈబీ సీఐ ఈ.మారయ్యబాబు, ఎస్ఐ వినీతారెడ్డిల ఆధ్వర్యంలో సిబ్బంది ఆకస్మిక దాడి నిర్వహించి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దాడుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందిని రవికుమార్ అభినందించారు. దాడిలో సిబ్బంది యూసఫ్ షరీఫ్, రామిరెడ్డి పాల్గొన్నారు.

మద్దిశెట్టి మద్దతు టీడీపీకే?

ఆయన అనచరులూ అదే సూచించారు

వేణుగోపాల్‌ను కలిసిన టీడీపీ కూటమి అభ్యర్థి లక్ష్మి, పాపారావు

కనిగిరిలో టీడీపీలో చేరిన మద్దిశెట్టి సోదరుడు

పమిడి రమేష్‌కు ఫోన్ చేసిన బాబు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

దర్శి వైసీపీ ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ నియోజకవర్గంలో టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మికి మద్దతు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఆయన అనుచరుల అభిప్రాయలకనుగుణంగా ఆయన ఆ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. టీడీపీ అభ్యర్థి డాక్టర్ లక్ష్మి, ఆ పార్టీ నేత మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు ఎమ్మెల్యేను కలిసినప్పుడు కూడా అదే సంకేతం ఇచ్చారు. మరోవైపు ఎమ్మెల్యే సోదరుల్లో ఒకరైన రవీంద్ర కనిగిరి నియోజకవర్గంలోని ఆయన స్వగ్రామంలో అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. టీడీపీ మాజీ ఇన్‌చార్జి పమిడి రమేష్‌కు చంద్రబాబు ఫోన్ చేయడం కూడా ఆ పార్టీలో చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ వైసీపీ అధిష్ఠానంతో అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసిందే. సీఎం జగన్‌తోపాటు ఆయన పాల్గొన్న కార్యక్రమాలు, వైసీపీ కార్యక్రమాలకు పూర్తిగా దూరమయ్యారు. బుధవారం దర్శిలో ఆయన నియోజకవర్గంలోని తన ముఖ్య అనచరులతో సమావేశమయ్యారు. ఆ సమావేశంలో పాల్గొన్న అనుచరుల్లో అత్యధికులు 'వైసీపీ అధిష్ఠానం మనకు అన్యాయం చేసింది.. శివప్రసాద్‌రెడ్డి మనల్ని అసలు మనుషులుగానే చూడడం లేదు.. మనం టీడీపీ కూటమికి మద్దతు ప్రకటించడం సముచితంగా ఉంటుంది' అని ఆయనకు సూచించారు. ఆ సమావేశానికి హాజరైన వారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్కే అమీనుబాషా, తాళ్లూరు ఎంపీపీ శ్రీనివాసరావు, కురిచేడు ఎంపీపీ భర్త చంద్రశేఖర్, దొనకొండ జడ్పీటీసీ సభ్యుడు మధుకర్, దొనకొండ మండల వైసీపీ కన్వీనర్ నారపరెడ్డి, వైస్ ఎంపీపీ కోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, ముండ్లమూరు మండల వైసీపీ కన్వీనర్ సుబ్బారెడ్డి, దర్శి మున్సిపల్ కౌన్సిలర్ ఈశ్వరరెడ్డితోపాటు ఆయా మండలాలు, గ్రామాల నుంచి ముఖ్యనేతలు పాల్గొన్నారు. వేణుగోపాల్ తొలుత అనుచరుల అభిప్రాయాలు కోరగా అందులో 90శాతం మంది టీడీపీకి మద్దతు ఇద్దామని కోరగా, మిగిలిన వారు ఎమ్మెల్యే నిర్ణయమే ఫైనల్ అని చెప్పినట్లు తెలిసింది. ఆ సందర్భంగా గత ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంలో పోటీ చేసేందుకు వైసీపీ తరఫున పిలిచి టికెట్ ఇవ్వగా, గత నాలుగున్నరేళ్లుగా అనేక అవమానాలకు గురిచేయడాన్ని సమీక్షించుకున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యేను గౌరవించకుండా, కుల ప్రాతిపదికన శివప్రసాద్‌రెడ్డిని సీఎం బలపరిచారని కొందరు అనగా, కులం వారికి జగన్ చేసిందేమీ లేదని సుబ్బారెడ్డి, వారి అనచరులు ఉదహరించారు. ఇలా సాగిన సమీక్ష అనంతరం మనం టీడీపీ అభ్యర్థికే మద్దతు ఇవ్వాలని సూచించినట్లు తెలిసింది.

మద్దిశెట్టిని కలిసిన డాక్టర్ లక్ష్మి, పాపారావు

దర్శి టీడీపీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగరపంచాయతీ చైర్మన్ పిచ్చయ్య, జనసేన, బీజేపీ ప్రతినిధులు ఎమ్మెల్యే మద్దిశెట్టిని కలిశారు. టీడీపీలో చేరాలని, లక్ష్మికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఆ సమయంలో మద్దిశెట్టి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఇదేసమయంలో ఆయన సోదరులలో ఒకరైన రవీంద్ర, వారి స్వగ్రామంలో ఉన్న అనుచరులు అందరితో కలిసి టీడీపీలో చేరడం విశేషం, కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం లక్ష్మి నరసింహాపురం ఎమ్మెల్యే మద్దిశెట్టి స్వగ్రామం. ఆ గ్రామంలోనూ అన్నివర్గాలకు చెందిన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే సోదరుడు రవీంద్ర కనిగిరి టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర సమక్షంలో బుధవారమే టీడీపీలో చేరారు. దీంతో దర్శిలో కూడా టీడీపీ అభ్యర్థి లక్ష్మికి కూడా మద్దిశెట్టి మద్దతు ఇచ్చినట్లుగా భావించొచ్చు. అయితే ఎమ్మెల్యే నేరుగా ఆ పార్టీలో చేరతారా, తన కుటుంబసభ్యులను మాత్రమే చేరుస్తారా అనేది వేచిచూడాలి.

పమిడికి చంద్రబాబు ఫోన్

దర్శి నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జిగా పనిచేసిన పమిడి రమేష్‌కు బుధవారం టీడీపీ అధినేత చంద్రబాబు ఫోన్ చేశారు. కష్టకాలంలో నియోజకవర్గంలో పార్టీ కోసం బాగా పనిచేశారు. అంతకుమించి డాక్టర్ లక్ష్మి విజయం కోసం పనిచేయండి.. భవిష్యత్తులో పార్టీ అండగా ఉంటుందని బాబు చెప్పడంతో రమేష్ కూడా గట్టిగా పనిచేస్తారని చెప్పినట్లు తెలిసింది.

జనంపై రౌడీయిజం

ఒంగోలులో వైసీపీ దౌర్జన్య ప్రచారం

వలంటీర్ ఉందని ప్రశ్నించినందుకు సామాన్య కుటుంబంపై దాడి

సమతానగర్‌లో రెచ్చిపోయిన వైసీపీ మూకలు

పరామర్శించేందుకు వెళ్లిన టీడీపీ నేతపైనా దాడి

మద్యం మత్తులో వీరంగం

అసభ్యపదజాలంతో పాటు రెచ్చగొట్టే వ్యాఖ్యలు

ప్రేక్షక పాత్ర వహించిన పోలీసులు

బాధితులను పరామర్శించిన దామచర్ల

అందరి లెక్కలు తేలుస్తామని హెచ్చరిక



ఫొటో తీశారని ఓట్లు అడగడానికెళ్లిన ఇంటి సభ్యులనే చితకబాదిన వైసీపీ మూకలు

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 10: ఒంగోలులో వైసీపీ నేతలు బరితెగించారు. ఓటమి భయంతో ప్రచారం పేరుతో ప్రజల ఇంటికెళ్లి మరీ దాడులకు తెగబడ్డారు. వైసీపీ ప్రచారంలో వలంటీర్ ఉందని ఫొటో తీసే ప్రయత్నం చేసిన సామాన్య కుటుంబంపైనా నేతలు, వారి అనుచరులు తెగబడి మరీ కొట్టారు. విషయం తెలిసిన అందరూ ఇదేం తీరు అంటూ మండిపడుతున్నారు. వివరాల్లోకెళితే.. నగరంలోని 37వ డివిజన్‌లోని సమతానగర్‌లో బుధవారం రాత్రి వైసీపీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. ఈ సందర్భంగా సమతానగర్ మొదటి లైనులో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు కావ్యశ్రీరెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తుండగా, ఆ డివిజన్ కార్పొరేటర్ గోలి కోటేశ్వరమ్మ, ఆమె భర్త వైసీపీ బీసీ నాయకుడు గోలి తిరుపతిరావు కార్యక్రమానికి నేతృత్వం వహించారు. అందులో భాగంగా హిమశ్రీ అపార్ట్‌మెంట్‌లోని 2వ అంతస్తులో నివాసం ఉంటున్న చప్పిడి ప్రభావతి ఇంటికెళ్ళిన వైసీపీ శ్రేణులు ఓట్లు అభ్యర్థించారు. అయితే ఈ ప్రచారంలో వలంటీర్ సుజనాప్రియ పాల్గొనడంతో ఆమె రావడమేమిటని ప్రభావతి కుటుంబసభ్యులు అడిగారు. దీంతో అవమానంగా భావించిన వైసీపీ యువజన నాయకుడు గంటా రామానాయుడు, గోలి తిరుపతిరావు, కళ్యాణ్ రెడ్డితోపాటు మరికొందరు ప్రభావతి కుటుంబసభ్యులపై దాడిచేశారు. అనంతరం కిందకు వచ్చి మిగతా ఇళ్లలో ప్రచారానికి వెళ్లారు. అయితే దాడి విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకుడు మేడికొండ మోహన్‌రావు అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకోగా, ఆవేశంతో ఊగిపోయిన వైసీపీ శ్రేణులు ముప్పై మంది ఒక్కసారిగా మోహన్‌రావుపై దాడి చేసి, నడిరోడ్డుపై పడేసి కొట్టారు. స్థానికులు సర్దిచెప్పబోయినా వినిపించుకోకుండా వారిపైనా దాడిచేశారు. దీంతో ఆ వీధిలో ఒక్కసారిగా గందరగోళం ఏర్పడింది. దీంతో విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు ఒక్కొక్కరుగా అక్కడకు చేరుకున్నారు. దాడి జరిగిన విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తుండగా, అక్కడే ఉన్న వైసీపీ యువకులు పెద్ద పెద్దగా అరుస్తూ రెచ్చగొడుతూ వీరంగం సృష్టించారు. దీంతో డీఎస్పీ ఆధ్వర్యంలో భారీగా పోలీసులు మోహరించి పరిస్థితిని అదుపుచేసే ప్రయత్నం చేయగా, వారి అండ చూసుకున్న వైసీపీ శ్రేణులు మరింత రెచ్చిపోయారు. తొడలు గొడుతూ, మీసాలు మెలేస్తూ, ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతూ సమతా నగర్‌లో రెచ్చిపోవడంతో స్థానికులు భయం గుప్పిట్లో తలుపులు వేసుకున్నారు. వైసీపీ చేసిన వీధి రౌడీయిజంపై నగరంలో చర్చనీయాంశం కాగా, వైసీపీ దాడులపై ప్రతి ఒక్కరూ అసహ్యించుకుంటున్నారు.

రేయ్.. జనా.. అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు

టీడీపీ నాయకుడు మోహన్‌రావుపై వైసీపీ నాయకుల దాడిని తెలుసుకున్న దామచర్ల జనార్దన్ నగరంలోని ప్రచార కార్యక్రమాలను రద్దుచేసుకుని సమతానగర్ చేరుకున్నారు. అయితే పూటుగా మద్యం సేవించి ఉన్న వైసీపీ యువత అక్కడే ఉన్న జనార్దన్‌పై నోరు పారేసుకుంటూ ఊగిపోయారు. కొందరైతే రేయ్ జనా... చూసుకుందాం రారా అంటూ రెచ్చగొట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం నడిచింది. ఓ పది అడుగుల దూరంలో ఉన్న వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య సవాళ్ల వార్ నడవడంతో ఏం జరుగుతుందోన్న భయం అందరిలోనూ కనిపించింది. అక్కడే ఉన్న పోలీసులు సర్దిచెప్పే ప్రయత్నాలు చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐలు భక్తవత్సలరెడ్డి, లక్ష్మణ్‌ల నేతృత్వంలో భారీగా పోలీసులు మోహరించారు. అయితే అక్కడ జరిగిన ఘటనకు కారణమైన వారిని పల్లెత్తుమాట కూడా అనని పోలీసులు టీడీపీ వారిని మాత్రం అడ్డుకున్నారు. అంతే కాకుండా టీడీపీ శ్రేణులనే చెదరగొట్టే ప్రయత్నాలు చేశారు. ఇదే సమయంలో వైసీపీ వర్గీయులకు అండగా నిలబడ్డారు.





మోహన్‌రావును కిందకు తోసి కొడుతున్న వైసీపీ మూకలు

నగర వైసీపీ మొత్తం అక్కడే



గాయపడ్డ మోహన్‌రావు

సమతానగర్‌లో గొడవ జరిగిందని తెలుసుకున్న వైసీపీ శ్రేణులు నిమిషాల వ్యవధిలోనే ఒక్కసారిగా వందలసంఖ్యలో అక్కడకు చేరుకోవడం చూస్తే ఇదేదో పక్కా ప్లాన్‌తో జరిగిందని స్థానికులు చర్చించుకోవడం కనిపించింది. వైసీపీకి చెందిన కార్పొరేటర్లు, ఇతర విభాగాల కమిటీలు, నగర వైసీపీ శ్రేణులంతా అక్కడకు చేరుకోగా, టీడీపీ శ్రేణులు కూడా భారీగానే అక్కడకు చేరుకున్నారు. తమపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ టీడీపీ నేతలు న్యాయం చేయాలని, నిందితులపై కేసు నమోదు చేయాలని నినాదాలు చేయగా, అక్కడే ఉన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయారు. టీడీపీ నేతలను బెదిరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు.

రౌడీయిజం మాకు చేతగాకకాదు : దామచర్ల

ఉద్రిక్తత అనంతరం దామచర్ల జనార్దన్ బాధితుల ఇంటికెళ్లి పరామర్శించారు. జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒంగోలులో వైసీపీకి ఓటమి తప్పదన్న భయంతో ఆ పార్టీ నేతలు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రౌడీయిజం చేస్తే ఓట్లు రావన్నారు. ప్రజలను బెదిరిస్తే భయపడి ఓటు వేస్తారని అనుకోవడం అవివేకమన్నారు. మౌనంగా ఉంటున్న తమ పార్టీ నేతలపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. రౌడీయిజం చేయడం తమకు తెలుసన్నారు. తాము కూడా ఇలా రౌడీయిజం చేస్తే ఇళ్లకు కూడా వెళ్లలేరన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అందరి లెక్కలు తేలుస్తామని హెచ్చరించారు.

రిమ్స్‌లో చేరిన బాధితులు

వైసీపీ గూండాల దాడిలో గాయపడి చప్పిడి ప్రభావతి కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకుడు మేడికొండ మోహన్‌రావు చికిత్సకోసం రిమ్స్‌లో చేరారు. ఈ మేరకు వైద్యులు అడ్మిట్ చేసి, తగిన చికిత్స అందించారు. ఈ సందర్భంగా టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్, టీడీపీ రాష్ట్ర యవ నేత దామచర్ల సత్య, పలువురు పార్టీ శ్రేణులు రిమ్స్ వద్దకు చేరుకుని బాధితులకు మెరుగైన సేవలు అందించేలా వైద్యులను కోరారు.

వైసీపీ మూకల దాడిని ఖండిస్తున్న జనార్దన్, పక్కన సత్య బాధితులు మోహన్‌రావు

చేరికల జోరు....ప్రచార హోరు

ఉధృతంగా కూటమి అభ్యర్థుల ప్రచారం

వైసీపీని వీడి భారీగా టీడీపీలోకి వస్తున్న శ్రేణులు

పలుచోట్ల విభిన్న వర్గాలతో ఆత్మీయ సమావేశాలు

కార్యకర్తలకు నేతలు దిశానిర్దేశం

ఒంగోలు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థుల ప్రచార కార్యక్రమం ఉధృతంగా సాగుతోంది. ఒకవైపు ఇంటింటా తిరిగి ప్రచారం, మరోవైపు వైసీపీని వీడి పార్టీలోకి భారీగా వస్తున్న శ్రేణులకు సాదర స్వాగతాలు, ఇంకొకవైపు కార్యకర్తలతోనూ, వివిధ సామాజికవర్గాలతోనూ ఆత్మీయ సమావేశాలు ఊపందుకున్నాయి. అలాగే ఎక్కడికక్కడ స్థానికంగా పార్టీ కార్యాలయాలు ప్రారంభిస్తూ అభ్యర్థులు వేగంగా ముందుకు సాగుతున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా బుధవారం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు అలాగే ఒంగోలు, బాపట్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థులు తమ పరిధిలో విభిన్న కార్యక్రమాల్లో కనిపించారు. ఒకవైపు రాష్ట్రంలో జగన్ ప్రభుత్వ ఐదేళ్ల అరాచకం, అవినీతి పాలన, మరోవైపు రాష్ట్ర భవిష్యత్- చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం, ఇంకొకవైపు ఆయావర్గాల సంక్షేమానికి టీడీపీ కూటమి ప్రకటించిన మేనిఫెస్టోలోని అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నారు. అదే సమయంలో ఆయా ప్రాంతాల్లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తీసుకోవాల్సిన చర్యలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. టీడీపీ కూటమిలోని జనసేన, బీజేపీ శ్రేణులు ఆ కార్యక్రమాల్లో భాగస్వామ్యులు అవుతున్నారు. జిల్లాలో బుధవారం ఆయా ప్రాంతాల్లో జరిగిన ప్రధాన కార్యక్రమాలు ఇలా ఉన్నాయి.

- ఒంగోలు టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ సమక్షంలో వైసీపీ నుంచి పెద్దసంఖ్యలో వచ్చి పార్టీలో చేరారు. ఆయన నివాసం వద్ద కొత్తపట్నం మండలం పిన్నివారిపాలెం, వజ్జిరెడ్డిపాలెం, అలాగే నగరంలోని 10వ డివిజన్ అగ్రహారంకు చెందిన పలువురు టీడీపీలో చేరారు. 37వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్‌తోపాటు ఆయన సోదరులు ప్రసాదరావు, హరిబాబు, శ్రీనివాసరావులు అలాగే దాదాపు వందమందికి పైగా వారి వర్గం టీడీపీలో చేరారు. వేణుగోపాల్ నివాసానికి వెళ్లిన జనార్దన్ వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు. రాత్రికి 50వ డివిజన్‌లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు.
- సంతనూతలపాడు అభ్యర్థి బీఎన్.విజయకుమార్ మంగమూరు రోడ్డులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక కర్నూలు రోడ్డులోని ఫంక్షన్ హాలులో బాపట్ల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్‌తో కలిసి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న బీఎన్ రాత్రికి బసవన్నపాలెంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు.
- కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, పార్టీ యువనేత దామచర్ల సత్యలు సాయంత్రం టంగుటూరులో ఎంపీ మాగుంటతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం వావిలేటిపాడు వద్ద వేలాది మందితో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మాదిగ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.
- కనిగిరి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో లక్ష్మీనరసాపురం వాసులు భారీగా వైసీపీ వర్గీయులు టీడీపీలో చేరారు. దర్శి ఎమ్మెల్యే వేణుగోపాల్ సోదరుడు రవి కూడా చేరిన వారిలో ఉండగా సాయంత్రం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించి రాత్రికి ఇంటింటి ప్రచారం చేశారు.
- దర్శి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పాపారావు, ఇతర నేతలతో కలిసి దర్శి పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు.
- మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి సమక్షంలో చినమనగుండంకు చెందిన 30 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. నాలుగు మండలాల్లోనూ కందులతోపాటు కుటుంబ సభ్యులు ప్రచారం నిర్వహించారు.
- గిద్దలూరు అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు జనార్దన్ టీడీపీలో చేరారు. రాత్రికి గిద్దలూరు మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.
- ఎర్రగొండపాలెం టీడీపీ అభ్యర్థి గుదూరి ఎరిక్షన్‌బాబు సమక్షంలో అక్కపాలెంకు చెందిన 15 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అలాగే సాయంత్రం గ్రామాల్లో ఇంటింటి ప్రచారంలో ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు.



దర్శిలో లక్ష్మి సమక్షంలో టీడీపీలో చేరుతున్న నేతలు

వైసీపీ అరాచక పాలనకు అంతం పలకండి

వలపర్లలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ఏలూరి

ఆంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు

భారీగా స్వాగతం పలికిన గ్రామస్థులు



వలపర్లలో ప్రచారం చేస్తున్న ఏలూరి, కృష్ణప్రసాద్

మార్టూరు, ఏప్రిల్ 10 : వైసీపీ అరాచక పాలనకు అంతం పలకాలని పిలుపునిస్తూ బుధవారం రాత్రి మండలంలోని వలపర్ల గ్రామం నుంచి టీడీపీ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. పార్టీ కార్యకర్తలతో కలిసి వైసీపీపై ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని భారీ జనసందోహం నడుమ ఏలూరి ప్రారంభించారు. గత రెండుసార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో వలపర్ల నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ఏలూరి ఈ ఎన్నికల్లో కూడా అదే సెంటిమెంట్‌ను పాటిస్తూ ఇక్కడి నుంచే ప్రచారాన్ని మొదలుపెట్టారు. కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన ఏలూరి, కృష్ణప్రసాద్‌కు సినిమా హాలు సెంటర్ నుంచి సాగర్ కాలువ పక్కనున్న ఆంజనేయస్వామి గుడి వరకు ప్రజలు బ్రహ్మాండమైన స్వాగతాన్ని పలికారు. అనంతరం ఆంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ఆశీస్సులను అందుకున్నారు. అనంతరం ప్రచార రథంపై గ్రామ ప్రధాన సెంటర్‌కు వెళ్లగా వారికి మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు.

పర్చూరును అగ్రస్థానంలో నిలిపా

తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో రూ.2వేల కోట్లతో పర్చూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేసి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపానని ఏలూరు గుర్తుచేశారు. వలపర్లలో సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, కాలువలు తదితర పనులను కోట్ల రూపాయలతో నిర్మించామన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం నాశనమైందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్ర కావాలంటే టీడీపీ ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఒక్క చాన్స్ అంటూ వచ్చిన జగన్‌రెడ్డి ఏ ఒక్క హామీనీ నెరవేర్చకపోగా, అన్నివర్గాల ప్రజలపై భారాలు మోపారన్నారు. అరాచక, విధ్వంస పాలన సాగిస్తున్న వైసీపీకి సమాధి కట్టాలని ఏలూరి పిలుపునిచ్చారు.

నేను లోకల్..వలపర్లను అభివృద్ధి చేసేది మేమే

వలపర్ల గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేది మేమే. బీసీలకు అండగా ఉండేది టీడీపీ అని ఏలూరి అన్నారు. వలపర్లలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఏలూరి, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఏలూరి మాట్లాడుతూ నేను లోకల్ అని, మీ ఇంట్లో పెద్ద కుమారుడిగా అండగా ఉంటానని మాటిచ్చారు. ఆంజనేయస్వామి గుడిని కోటప్పకొండలా అభివృద్ధి చేస్తానన్నారు. ఇక్కడ టీడీపీ చేసిన అభివృద్ధి పనులను చూసి, ప్రజలంతా ఆలోచించి ఓటేయాలని కోరారు. విద్యావంతుడైన ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ కూడా మీకు అండగా ఉంటారని ఆయన్ని, తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రం బాగు కోసం, ప్రజల సంక్షేమం కోసం టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. ఏలూరిపై మీరు చూపించే అభిమానం, ఆదరణ మరువలేమని, మీకు సేవ చేసి రుణం తీర్చుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గుంటి వెంకటేశ్వర్లు, జంజనం సుబ్బారావు, కంభంపాటి హనుమంతరావు, షేక్ బషీర్, వంకాయలపాటి సుబ్బారావు, గుంజి వెంకట్రావు, శివరాత్రి శ్రీను, పోలూరి సింగయ్య, తాటి నాగేశ్వరరావు, కోటపాటి సురేష్, కామేపల్లి హరిబాబు, కామినేని జనార్దన్, మిన్నెకంటి రవికుమార్, షేక్ రజాక్ పాల్గొన్నారు.

అందరూ ఓటు వేయాలి

స్వీప్ ప్రకాశం ఆధ్వర్యంలో గ్రానైట్ కార్మికులకు అవగాహన

చీమకుర్తి, ఏప్రిల్ 10 : గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్న ప్రతి ఒక్క కార్మికుడు తమ అమూల్యమైన ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ కోరారు. స్వీప్ ప్రకాశం ఆధ్వర్యంలో కార్మికులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని రామతీర్థం వద్ద ఉన్న ఏపీఎండీసీ గ్రానైట్ క్వారీలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు 'స్వీప్ ప్రకాశం' అంటూ ప్రదర్శించారు కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ గోపాలకృష్ణలు పాల్గొని మాట్లాడారు. కార్మికులు ఓటుహక్కును వినియోగించుకోవడానికి యజమానులు సెలవు మంజూరు చేయాలని కోరారు. కార్మికులతో ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. వేర్వేరు రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులతో చీమకుర్తి మినీఇండియాను తలపిస్తుందన్నారు.

తర్వాత చీమకుర్తిలోని ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆర్ఓ గోపాలకృష్ణకు పలుసూచనలు చేశారు. టోల్‌ఫ్రీ నంబరుకు వస్తున్న ఫిర్యాదులపై ఆరా తీశారు. కార్యక్రమంలో మైన్స్ డీడీ జగన్నాథరావు, స్వీప్ నోడల్ అధికారులు రవి, జ్యోతి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదలపై జగన్ కక్ష సాధింపు..!

- వారి జీవితాల్లో మార్పు టీడీపీతోనే
- అభివృద్ధి..సంక్షేమమే లక్ష్యంగా కృషి
- వైసీపీ వికృత పాలనతో అంతా అస్తవ్యస్తం
- పథకాలను రద్దు చేసిన అధికార పార్టీ
- టీడీపీ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే ఏలూరి
- సైకిలెక్కిన రాజుపాలెం, పోతుకట్ల గ్రామస్థులు



రాజుపాలెం ఎస్టీ కాలనీ, పోతుకట్ల వాసులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, ఏప్రిల్ 10: పేదలపై జగన్‌రెడ్డి కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతూ అనేక సంక్షేమ.. అభివృద్ధి పథకాలను రద్దు చేశారని, వైసీపీ వికృత చర్యలకు అనేక మంది పేదలు బలయ్యా రని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి ఏలూరి సాంబ శివరావు అన్నారు. బుధవారం మార్టూరు మండ లం రాజుపాలెం, పర్చూరు మండలం పోతుకట్ల గ్రామాల నుంచి పలువురు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో క్యాంప్ కార్యాలయంలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ పేదల జీవితాల్లో మార్పు తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. ప్రజా సంక్షేమం అభివృద్ధే టీడీపీ లక్ష్యమన్నారు. పేదలు ఆర్థికంగా, సా మాజికంగా, రాజకీయంగా ఎదిగేందుకు చంద్రబాబు విశేష కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు అనేక సంక్షేమ పథకాలను రద్దుచేసి వారి జీవితాలను అంధకారంలోకి నెట్టారని ఏలూ రి మండిపడ్డారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి అభివృద్ధిని విధ్వంసం చేసిన జగన్ అండ్ కోకు గుణపాఠం చెప్పే రోజులు వచ్చాయన్నారు. ఓటు విలు వేంటో వైసీపీకి చెప్పాలని ఏలూరి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలం తా సంఘటితంగా ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఏలూరి కోరారు. కలసి వచ్చే వ్యక్తులు, పార్టీల తో ముందుకెళ్లి..వైసీపీని సాగనంపుదామన్నారు.

రాజుపాలెంలో చేరికలు..

మార్టూరు మండలం రాజుపాలెంకు చెందిన పలువురు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఏలూరి సాధరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చల్లమాచర్ల యోహాను, ఏటగిరి ప్రసాద్, ఏటగిరి సముద్రాలు, పొట్లూరి సుధాకర్, మిల్లిక కార్తీక్, పూనూరి రాజు, కరవతి నారాయణ, ఏటగిరి రాకేష్, పూనూరి సీతమ్మ, పొట్లూరి అరుణ, పూనూరి రాధ, పొట్లూరి మల్లేశ్వరి, ఐమాల కిషోర్, ఉ య్యాల అంకమ్మ, నాగరాజు, హుస్సేన్, గంజి పెద్దవీరయ్య తదితరులు ఉన్నారు.

పోతుకట్ల నుంచి పార్టీలోకి..

పర్చూరు మండలం పోతుకట్ల గ్రామానికి చెందిన పలువురు ఏలూరి సమక్షంలో సైకిల్ ఎ క్కారు. వారిలో తెలగతోటి మహేష్, మద్దు ఏలియా, దాసి అన్వేష్, శేషుబాబు, సందీప్, రావూరి సతీష్, మద్దు వంశీ, రావూరి లోకేష్, మిండ్యాల నాగరాజు, గండికోట నాగేశ్వరావు ఉన్నారు.

అబద్ధపు హామీలతో మోసగించిన జగన్‌రెడ్డి

- అధికారంలోకి వచ్చాక యథేచ్ఛగా దోపిడీ
- రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ రావాలి
- ఎమ్మెల్యే గొట్టిపాటి



టీడీపీలో చేరిన వల్లాపల్లి మాజీ సర్పంచ్ అల్లాఉద్దీన్

అద్దంకి, ఏప్రిల్ 10 : గత ఎన్నికల్లో జగన్‌రెడ్డి అబద్ధపు హామీలతో అన్ని వర్గాల ప్రజలను మోసగించారని, అధికారంలోకి వచ్చాక యథేచ్ఛగా దోపిడీకి పాల్పడ్డారని కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బుధవారం అద్దంకి గోవాడ, సాధునగర్‌లో ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రైతుల భూములతో వైసీపీ ప్రభుత్వం ఆటలాడుకుం టుందన్నారు. భూసర్వే పేరిట రైతుల తాత తండ్రుల నుంచి వచ్చిన పొలాల్లో జగన్ పేరుతో హద్దు రాళ్ల ఏర్పాటు చేయడం దుర్మార్గమన్నా రు. మళ్లీ జగనొస్తే రైతుల భూములు తాకట్టు పెడతారని గొట్టిపాటి ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, ప్రజలు అప్రమత్తంగా.. విజ్ఞతతో కూట మి అభ్యర్థులను గెలిపించాలన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు రావాలన్నారు. రైతులు అప్రమతంగా ఉండి టీడీపీని గెలిపించాలన్నారు. బస్సు యాత్రలతో మరోసారి ప్రజలను ముంచేందుకు జగన్‌రెడ్డి సిద్ధమయ్యారన్నారు. మద్యం నిషేధించాకే వస్తానని చెప్పి మాట తప్పిన జగన్‌ను ఇంటికి పంపాలన్నారు. అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు మరికొద్ది రోజులే గడువు ఉందన్నారు. 20 ఏళ్లుగా పార్టీలకు అతీతంగా మీకు సేవ చేస్తున్నానని, తనను మళ్లీ ఆశీర్వదించి సేవ చేసుకునే భాగ్యాన్ని కల్పించాలని రవికుమార్ కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కఠారి నాగేశ్వరరావు, మానం మురళీమోహన్‌దాస్, కరి పరమేష్, సాంబయ్య, కొండలు, స్వాములు పాల్గొన్నారు.



గోవాడలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

టీడీపీలో చేరిన వల్లాపల్లి మాజీ సర్పంచ్

బల్లికురవ : వల్లాపల్లిలో వైసీపీకి షాక్ తగిలింది. గ్రామ మాజీ సర్పంచ్ షేక్ అల్లాఉద్దీన్ తన అనుచరులతో కలిసి బుధవారం చిలకలూరిపేటలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఇంటికి వెళ్లి అయన మద్దతు తెలిపారు. వైసీపీ వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గొట్టిపాటి కండువాలు వేసి ఆహ్వానించారు. ముస్లింలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. గ్రామ పార్టీ నేతలు చింతల రామారావు, అమరనాథ్, పత్తిపాటి వెంకట్రావు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవీందర్

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

పర్చూరు, ఏప్రిల్ 10: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నిలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని పర్చూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బాపట్ల రెవెన్యూ డిజజన్ అధికారి గంధం రవీందర్ అన్నారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల నియమావళిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పారదర్శకంగా ఎన్నిలను నిర్వహించడమే ఉద్యోగుల కర్తవ్యం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే అట్టివారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో పర్చూరు తహసీల్దార్ సీహెచ్.సుబ్బయ్య, చినగంజాం తహసీల్దార్ జీవీఎం ఫణీంద్రబాబు, కారంచేడు తహసీల్దార్ మెహర్‌బాబు, యద్దనపూడి తహసీల్దార్ వై.నాగరాజు, ఇంకొల్లు తహసీల్దార్ ఎం.ప్రమీల, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ద్రోణాదుల రెస్టారెంట్ వద్ద ఘర్షణ

రెండు కేసులు నమోదు

మార్టూరు, ఏప్రిల్ 10: మండలంలోని ద్రోణాదుల గ్రామంలో రాయల్ రెస్టారెంట్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణలో బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం రెండు కౌంటర్ కేసులను నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలిలావున్నాయి. మంగళవారం రాత్రి మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన మల్లెల శివకృష్ణ తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలోని సరిమల్ల వేణు, మల్లెల నవీన్, గాలి రాజ్ కుమార్, గాలి ఏసుబాబు, సురభి షడ్రక్, గణపవరపు సుధీర్‌తో ద్రోణాదుల గ్రామంలోని రాయల్ రెస్టారెంట్ వద్దకు వెళ్లారు. అయితే అక్కడ సరిమెళ్ల వేణుకు రెస్టారెంట్ యజమాని పాలెపు వెంకటరావు, అతని కుమారుడు రామాంజనేయులుకు గతంలో ఫుడ్ బిల్లులు ఇవ్వలేదనే కారణంగా దానిపై వారి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో రెస్టారెంట్ యజమానితో పాటు సిబ్బంది తమపై కులంపేరుతో దూషించి దాడి చేయగా గాయపడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సురభి షడ్రక్, గణపవరపు సుధీర్‌లు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా రెండో కేసులో రెస్టారెంట్ యజమాని పాలెపు రామాంజనేయులు అతని తండ్రి వెంకటరావు కోలలపూడి గ్రామానికి చెందిన సరిమెళ్ల వేణుతో పాటు 6 గురు వ్యక్తులు రెస్టారెంట్ లోని కుర్చీలు, బల్లలను పగులగొట్టారని, అంతేగాకుండా తమపై వంట సిబ్బందిపై దాడి చేయగా, గాయపడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుననట్లు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ రెండు వర్గాల నుంచి అందిన ఫిర్యాదు మేరకు రెండు కేసులను నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గెలుపు మనదే.. అశ్రద్ధ వద్దు

శ్రేణులకు కూటమి అభ్యర్థి కొండయ్య దిశానిర్దేశం



వార్డుల కమిటీలతో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి కొండయ్య

చీరాల, ఏప్రిల్ 10 : గెలుపు మనదే. అందులో ఎలాంటి సందేహం లేదు. అలా అని ఎక్కడా అశ్రద్ధ వద్దని నాయకులు, కార్యకర్తలకు కూటమి అభ్యర్థి ఎంఎం కొండ య్య పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో బుధవారం 33 వార్డుల కమిటీల బాధ్యులతో కొండయ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులో ఇంటింటికీ ఎన్ని ఓట్లు ఉన్నాయి. వాటిలో సింహభాగం సైకిల్‌కు పడేలా ఏం చేయాలన్నదానిపై పక్కా వ్యూహంతో వ్యవహరించాలన్నారు. ప్రతి ఓటూ కీలకమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు సానుభూతిపరులు, తటస్థులు మనతో ప్రయాణం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. అందుకు సంబంధించి పలు సూచనలను కొండయ్య చేశారు. కూటమికి ఎక్కడెక్కడ బలంగా ఉన్నదీ.. ఎక్కడెక్కడ మధ్యస్తంగా బలహీనంగా ఉందో గుర్తించి ఆ ప్రాంతాల్లో ఓటర్లను మనవైపు తిప్పుకునేం దుకు చర్యలు చేపట్టాలన్నారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ఉమ్మడిగా ఎలా ప్రయాణం చేయాలి, ఒంటరిగా క్షేత్ర స్థాయిలో ఎవరెవరు ఏఏ బాధ్యతలు నిర్వహిస్తే ఎలాంటి సత్ఫలితాలు వస్తాయనే అంశంపై ప్రత్యేకంగా చర్చించారు. అంతిమంగా మనం గెలుపు లక్ష్యంగా ముందుసాగాలన్నారు. భవిష్యత్ కా ర్యాచరణపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు నాతాని ఉమామహేశ్వరరావు, గౌరీఅమర్‌నాథ్, యాసిన్, గజవల్లి శ్రీనివాసరావు, 33 వార్డుల అధ్యక్షులు పాల్గొన్నారు.

పాలేటి, మహేంద్రనాథ్ సమక్షంలో పార్టీలో చేరికలు

వేటపాలెం మండల పాపాయిపాలెంలో బుధవారం మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు, మహేంద్రనాథ్ సమక్షంలో గ్రామ మాజీ సర్పంచ్ పులి వెంకటేశ్వర్లు మరికొందరు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అభ్యర్థి కొండయ్య గెలుపుకు కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో గవిని పోతురాజు, సిహెచ్. వెంకటేశ్వర్లు, పులి శ్రీనివాసరావు, పులి తిరుపతి రావు, గొర్ల చక్రపాణి, గవిని ప్రసాద్, గొర్ల కృష్ణమూర్తి, రాజు ఉన్నారు.

ఇఫ్తార్ విందులో..

నవాబుపేటలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కొండయ్య పాల్గొన్నారు. తరువాత వేటపాలెంలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఆయా సందర్భాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కొండయ్య వెంట శ్రేణులు పాల్గొన్నారు.

జయహో బీసీ నినాదాన్ని చాటండి

నియోజకవర్గంలో జయహో బీసీ నినాదాన్ని చాటిచెప్పాలని కొండయ్య పిలుపునిచ్చారు. మండలంలోని వాడరేవు పంచాయతీ పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో అభ్యర్థి కొండయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్‌తో బీసీలకు పొందే లబ్ధి, ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

18 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

చీరాల, ఏప్రిల్ 10 : సెయింట్ ఆన్స్ కళాశాలలో ఇటీవల ఒయాసిస్ ఆటోమేషన్ టెక్నాలజీస్ వారు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 18 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జగదీష్, అక్రిడేషన్స్ డైరెక్టర్ డాక్టర్ సీ. సుబ్బారావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

150 మందికి దంత పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అడుసుమల్లి(పర్చూరు), ఏప్రిల్ 10 : పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామంలో పబ్లిక్ హెల్త్ డెంటిస్టు విభాగం, సిబార్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో డాక్టర్ దేవకి, డాక్టర్ శ్రీలేఖ సారథ్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 150 మందికి దంత పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈసదర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ వర్చస్వీ వెల్లంకి మాట్లాడుతూ దంత సమస్యలపై అశ్రద్ధ చేయకూడదని, కొద్దిపాటి సమస్య వచ్చినా వైద్యుడిని సంప్రదించాలన్నారు. గ్రామీణ రోగులకు ఉచిత వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో ఈశిబిరాన్ని ఏర్పా టు చేసినట్లు చెప్పారు. శిబిరానికి సహకారం అందించిన అడుసుమల్లి ఎల్‌ఎస్‌సీఎస్ (సొసైటీ) ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నరిశెట్టి వెంకటరమణ, దొప్పలపూడి రమాదేవి, దొప్పలపూడి శ్రీను, నరిశెట్టి విపెన్, వెల్లంకి బ్రదర్స్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి సాయం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 10: వంట పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కనపర్తి రాజేశ్వరి కుమార్తె చదువుకు దాతలు ఆర్థిక సాయం అందజేశారు. అద్దంకిలోని ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి ప్రతి ఏటాలాగే రూ.16వేలు సేకరించి దాతలు అందజేశారు. బాలిక చదువుకోసం సమకూర్చిన నగదును కళాశాల డైరెక్టర్‌కు బుధవారం అందజేశారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

చీరాలటౌన్, ఏప్రిల్ 10 : ఓటు ప్రతి ఒక్కరి హక్కు. అని 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని ఎస్‌ఐ మురళి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలో బీఎస్‌ఎఫ్ పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ మురళి కోరారు. కార్యక్రమంలో వన్‌టౌన్ స్టేషన్ సిబ్బంది, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు

- అవస్థలు పడిన ప్రయాణికులు
- రాజకీయ కార్యక్రమాలకు ప్రజా వాహనాల తరలింపుపై ఆగ్రహం



బస్సులు లేక బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

అద్దంకి, ఏప్రిల్ 10 : సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులను తరలించడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. అద్దంకి డిపోకు చెందిన 27 పల్లె వెలుగు బస్సులను పల్నాడు జిల్లాలో బుధవారం జరిగిన ముఖ్యమంత్రి మేం సిద్ధం కార్యక్రమానికి పంపారు. దీంతో అద్దంకి డిపో పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులు రద్దయ్యాయి. ప్రధానంగా వినుకొండ, పొదిలి, ఇంకొల్లు రూట్లలో అద్దె బస్సులు నడిపిస్తుండగా, మిగిలిన అన్ని గ్రామీణ రూట్లలో బస్సులన్నీ రద్దు చేశారు. విషయం తెలియ డిపోల వద్ద, రోడ్లపై గ్రామాలకు వెళ్లే ప్రయాణికు బస్సుల కోసం ఎండలో వేచి చూడాల్సిన పరిస్థితి ఎదురైం ది. జగన్‌రెడ్డి సభకు బస్సులు వెళ్లిపోయాయని తెలియడంతో చేసేది లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ఇదిలావుండగా పిడుగురాళ్లలో సీఎం సభ జరుగుతుండగా నామ్ రోడ్డులో నడిచే లారీలను మేదరమెట్ల - అద్దంకి వద్ద నిలిపి వేశారు. దీంతో గంటల సమయం వాహనాలు నిలిచిపోవడంతో ఎండకు డ్రైవర్లు అల్లాడిపోయారు. శుక్రవారం కూడా గుంటూరు జిల్లాలో జరిగే జగన్ సభకు ఆర్టీసీ బస్సులను కేటాయించారు. ఆరోజు కూడా ప్రయాణికులకు తిప్పలు తప్పవని పలువురు అంటున్నారు. రాజకీయ సభలకు ప్రజా రవాణా వాహనాలను తరలించడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాసులు

ఎన్నికలకు అప్రమత్తంగా ఉండాలి

చీరాల, ఏప్రిల్ 10 : ఎన్నికల నేపథ్యంలో ఎస్‌ఈబీ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఈబీ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు చెప్పారు. ఎస్‌ఈబీ కమిషనర్ ఎం. రవిప్రకాష్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు బుధవారం స్థానిక కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కే ప్రభాకరరావు, చీరాల, పర్చూరు సీఐలు కర్ణ తదితరులకు ఆ ఉత్తర్వులను తెలిపారు. మద్యం అక్రమ నిల్వలు, నాన్ డ్యూటీపెయిడ్ లిక్కర్ రవాణా విక్రయాలు, మద్యం తయారీ, అక్రమ రవాణా, విక్రయాలు తదితరాల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల ప్రలోభాల్లో భాగంగా ఎవరైనా డ్యూటీ పెయిడ్ లిక్కర్ పంపిణీ చేసినా కూడా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : గ్రామాల్లో మద్యం అక్రమ నిల్వలు, అమ్మకాలపై నిఘా ఉంచాలని ఎస్‌ఈబీ డిప్యూటీ కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఆయనతోపాటు ఎస్‌ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ప్రభాకరరావు, ఎస్‌ఐ వీ సైమన్, సిబ్బంది ఉన్నారు.

నేడు రైతులతో ఆత్మీయ సమావేశం

మార్టూరు, ఏప్రిల్ 10 : కృషి జీవన్ ఆధ్వర్యంలో గాండీవ రైతు ఉత్పత్తిదారుల సంస్థ సహకారంతో చిరుధాన్యాల ప్రాముఖ్యతపై స్థానిక విజయలక్ష్మి కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం రైతులతో ఆత్మీయ సమావే శం నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీ శరత్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పశు పోషకులకు ఆచార్య ఎన్‌జీ రంగా రైతు పురస్కారంతో సత్కరిస్తామన్నారు. ముఖ్య అతిథులుగా ఫౌండర్ ఆఫ్ ప్రకృతి వనం ఎంసీవీ ప్రసాద్, అఖిల భారత కిసాన్ సంఘ్ కారిణి స దస్య జె కుమారస్వామి విచ్చేస్తున్నారన్నారు. మార్టూరు ప్రాంత రైతులు పశు పోషకులు కార్యక్రమానికి హాజరుకావాలని శరత్‌బాబు కోరారు.

ప్రపంచ హోమియో దినోత్సవం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 10: ప్రపంచ హోమియో దినోత్సవం సందర్భంగా బుధవారం అద్దంకిలో త్రిమూర్తులు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోమియో పితామహుడు డాక్టర్ శామ్యూల్ హనిమాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హోమియో వైద్యం, దాని ప్రాధాన్యతను హోమియో వైద్యులు డాక్టర్ కావూరి రఘుచంద్ వివరించారు. వడదెబ్బ తగలకుండా ఉండేందుకు హోమియో మాత్రలను చెబ్రోలు వెంకట సుబ్బయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు, చంద్ర, మరియదాస్, శ్రీను పాల్గొన్నారు.

గొట్టిపాటిని గెలిపించండి

ముప్పవరంలో చాయ్ విత్ హర్షవర్ధన్



కుందుర్రులో ప్రచారం చేస్తున్న హర్షవర్ధన్

పంగులూరు, ఏప్రిల్ 10 : మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో కూటమి అభ్యర్థి తన తండ్రి గొట్టిపాటి రవికుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని గొట్టిపాటి హర్షవర్ధన్ కోరారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో బుధవారం చాయ్ విత్ హర్షవర్ధన్ కార్యక్రమంలో భాగంగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీ దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాలకు వెళ్లి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు ప్రభుత్వం వస్తే అమలు చేసే పథకాలు, వాటి ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రైతులు, ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకుంటున్న హర్షవర్ధన్ టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. సుభిక్ష పాలన, రాష్ట్ర అభివృద్ధి, యువ తకు ఉద్యోగ అవకాశాలు చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అన్ని వర్గాల ప్రజలు కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని హర్షవర్ధన్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, కేవీ సుబ్బారావు, చింతల సహదేవుడు, బ్రహ్మానందస్వామి, బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, వరపర్ల సుబ్బారావు, జగన్మోహనరావు, నార్నె సుబ్బారావు, కాజా, అమృతపూ డి, శ్రీనివాసరావు, రాధాకృష్ణ, నాగిరెడ్డి, ఆదిరెడ్డి, శివరాజు, అశోక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థను బలపోతం చేస్తాం

బల్లికురవ : టీడీపీ అధికారంలోకి వలంటీర్ల వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు రూ.10వేల వేతనం ఇస్తుందని టీడీపీ యువతనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) తెలిపారు. బుధవారం కొత్తూరులో కూటమి అభ్యర్థి గొట్టిపాటి కోసం ప్రచారం నిర్వహించారు. వలంటీర్లు ఈ విషయాన్ని అర్థం చేసుకొని ప్రజల కోసం పనిచేయాలని కోరారు. జగన్‌రెడ్డి మరోసారి ప్రజలను మోసగించేందుకు, రాష్ట్రాన్ని దోచుకునేందుకు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తమై ఎన్నికల్లో ఓటుతో తరమేయాలని పిలుపునిచ్చారు. అయనవెంట పెంట్రాల అంజనేయులు, దొడ్డా వేణుగోపాల్,శ్రీనివాసరావు రామకోటేశ్వరరావు



కొత్తూరులో ప్రచారం చేస్తున్న కమల్‌కిషోర్

సంతమాగులూరు : పతనమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలోపెట్టే సమర్థుడు చంద్రబాబు అని, అయన్ని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడం ప్రజల బాధ్యత అని టీడీపీ యువనాయకుడు గొట్టిపాటి హర్షవర్ధన్ విజ్ఞప్తి చేశారు. కుందుర్తి గ్రామంలో కూ టమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీకి ఓటేసి రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ నాయకులు గాడిపర్తి వెంకట్రావు, దూపాటి ఏసోబు,రమేష్, వాసిరెడ్డి, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఏలూరికి ఓటేయండి

మార్టూరు : కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును భారీ మెజార్టీతో గెలిపించాలని బుధవారం మార్టూరులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. సంపత్‌నగర్, ఎంఎల్ఏపీ కాలనీ, కాకతీయనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జంపని శ్రీను, గన్నవరం బుడేకాకోలు వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి రమాదేవి, శారద, కస్తూరి, అరుణ పాల్గొన్నారు.





కిలో పొగాకు రూ.232

కలిగిరి, ఏప్రిల్ 10: కలిగిరి పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 589 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 11కంపెనీల ప్రతినిధులు పాల్గొని 551 బేళ్లు కొనుగోలు చేశారు. నో బిడ్-22, సీఆర్-12, జంపింగ్ లాట్స్-4 కారణాలతో 38 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.232, కనిష్ఠ ధర రూ.220, సగ టు ధర రూ.229.58గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్ఠం కనిష్ఠం	36.1 27.6	35.0 26.0	38.0 26.0	38.0 24.0	35.0 26.0

ఎన్నికల పరిశీలకుల నియామకం

- నెల్లూరు సిటీ, రూరల్‌కు నితిన్ సింగ్
- 18న ఎన్నికల గజిట్ నోటిఫికేషన్

నెల్లూరు (హరనాథపురం) : సార్వత్రిక ఎన్నికల కోసం జిల్లాకు ఎన్నికల పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించింది. నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కోవూరు, ఆత్మకూరు నియోజకవర్గాల సాధారణ పరిశీలకులుగా నితిన్ సింగ్ బదారియాను నియమించారు. కందుకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాలకు రామ్‌కుమార్ గౌతమ్, సర్వేపల్లికి కరీగౌడ నియమితులయ్యారు. ఆత్మకూరు, కోవూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, ఉదయగిరి నియోజకవర్గాల పోలీసు పరిశీలకుడిగా అశోక్ దూదే, సర్వేపల్లికి అరవింద సాల్వే నియమితులయ్యారు. ఏప్రిల్ 25 నుంచి మే 13 వరకు పోలీసు పరిశీలకులు, ఏప్రిల్ 25 నుంచి జూన్ 4 వరకు సాధారణ పరిశీలకులు జిల్లాలో విధుల్లో ఉంటారు.

ఈ నెల 18న ఎన్నికల గజిట్ నోటిఫికేషన్ ఇస్తామని కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 12న ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో మొదటి విడత ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల ర్యాండమైజేషన్ చేస్తామన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

ఈవీఎం గోదాములనె తెరుస్తామని, ఓటర్ల నమోదుకు 14 వరకు దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న 7932 దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 20,48,252 మంది ఓటర్లు ఉన్నారన్నారు. రాజకీయ పార్టీల వారు పూర్తిస్థాయిలో పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, తెలుగుదేశం నుంచి రసూల్, బీఎస్పీ నుంచి శ్రీరామ్, ఆమ్ ఆద్మీ నుంచి శివరామరెడ్డి పాల్గొన్నారు.




బాణసంచా కాల్చుతున్న ముస్లిం యువత

అటకెక్కిన మగ్గం!

- చేనేతను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం
- గత ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రోత్సాహకాల రద్దు

అబ్బురపరిచే వస్త్రకళా నైపుణ్యం చేనేతలది. అలాంటి నేతన్న సమస్యలతో పోరాటం చేస్తూ అతికష్టంగా మనుగడ సాగిస్తున్నాడు. రెక్కలు విరిగేలా.. కీళ్లు అరిగేలా కాళ్లతో రోజంతా పావు చెక్కలు తొక్కి గొడ్డు చాకిరీ చేస్తున్నా ఐదు వేళ్లు నోటిలోకి వెళ్లే పరిస్థితి లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక చేనేత కార్మికులు కోలుకోలేనంతగా దెబ్బతిన్నారు. టీడీపీ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు రద్దు చేసి ఒకరిద్దరికి పదో.. పరకో.. చిల్లర రాల్చిన ప్రభుత్వం వారి సమస్యలను పూర్తిగా పక్కన పెట్టింది. ఫలితంగా చేనేత వృత్తి ప్రశ్నార్థకంగా మారింది.



కూలి గిట్టుబాటు కాక మూలకు చేరిన మగ్గం



అటక మీదకు చేరిన మగ్గం డాబీ

సంగం, ఏప్రిల్ 10 : జిల్లాలో వ్యవసాయం తరువాత చేనేత పరిశ్రమపై అత్యధికంగా ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో చేనేత మగ్గాలు 6,850 ఉన్నాయి. అనధికారికంగా (నేతన్న నేస్తం రానివారు) మరో రెండు వేలు ఉంటాయి. వాస్తవానికి జిల్లాలో చేనేత కుటుంబాలు 25 వేల వరకు ఉన్నాయి. వీరిలో కొంత మంది కులవృత్తి గిట్టుబాటు కాక మగ్గం మూలన పడేసి తాపీ, వంట పని, ఉపాధి హామి వంటి ఇతర పనులకు వెళ్తున్నారు. వీరు కాకుండా మరో 7వేల కుటుంబాలు చేనేత ఉప కులాల వారు ఉన్నారు. సంగం, వింజమూరు, కోవూరు, పాటూరు, గుమ్మళ్లదిబ్బ, చెన్నూరు, ఆత్మకూరు, ఏఎస్‌పేట, కావలియడవల్లి, కొత్తపేట, నారాయణరెడ్డిపేట, బుచ్చి తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులు ఉన్నారు. స్వయం పోషకంగా ఉన్న ఈ రంగానికి ప్రభుత్వాలు కొద్దిపాటి ఊతం ఇస్తే సరిపోతుంది. వైసీపీ ప్రభుత్వం అవేవీ పట్టించుకోలేదు. గత ప్రభుత్వాలు ఇచ్చిన సబ్సిడీలు, ప్రోత్సాహకాలను రద్దు చేయడంతో ఆ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది.

ముంచిన కరోనా

2020లో కరోనా నివారణకు చేపట్టిన లాక్‌డౌన్ చేనేత కార్మికుల వృత్తికి శాపంగా పరిణమించింది. ఆ రోజు నుంచి ఇప్పటి వరకు చేనేత పరిశ్రమ కోలుకోలేదు. లాక్‌డౌన్ కారణంగా విదేశాల నుంచి రావాలసిన జరీ నిలిచిపోయింది. దీంతో డిమాండ్ పెరిగి ధరలు రెట్టింపయ్యాయి. ఉత్పత్తుల ధరలు మాత్రం పెరగలేదు. ఉత్పత్తులు పెరిగి మార్కెట్ డిమాండ్ తగ్గింది. వస్త్రానికి ధర లు పతనమై గిట్టుబాటు తగ్గిపోయింది.



ఉపాధి హామి పనులకు వెళ్తున్న నేత కార్మికులు

జీఎస్టీతో కుదేలు

జీఎస్టీతో చేనేత పరిశ్రమ కుదేలయ్యింది. 2020 నుంచి చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ విధించడంతో ఉత్పత్తులపై ధరలు పెరిగాయి. దీంతో డిమాండ్ తగ్గి మార్కెట్ పడిపోయింది. దీనిప్రభావం ఎగుమతులపైనా పడింది. అంతేగాక హ్యాండ్‌లూమ్‌పై తయారయ్యే 18 రకాల వస్త్ర డిజైన్లను మరమగ్గాలపై నేయకుడదని నిషేధం ఉంది. అయినా పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో నిషేధిత డిజైన్లు మరమగ్గాలపై కొందరు తయారు చేస్తున్నారు. మరమగ్గాలపై తక్కువ కాలంలో ఎక్కువ ఉత్పత్తి తయారు కావడంతో ఆ ఉత్పత్తులను మార్కెట్‌లో తక్కువ ధరకే విక్రయించవచ్చు. ఆ ధరకు హ్యాండ్‌లూమ్‌పై తయారయ్యే ఉత్పత్తులు ఇస్తే గిట్టుబాటు కాదు. హ్యాండ్‌లూమ్‌పై తయారయ్యే వస్త్రం నాణ్యత, మన్నిక కలిగినదైనా మార్కెట్‌లో మరమగ్గాలపై ఉత్పత్తులు తక్కువ ధరకు లభ్యమవుతుండటంతో హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులకు డిమాండ్ తగ్గి ధరలు పతనమై గిట్టుబాటు కావడంలేదు. దీంతో నేతన్న మనుగడ సాగించలేకపోతున్నాడు.

టీడీపీ హయాంలో ఊరట

టీడీపీ హయాంలో చేనేత సంరక్షణకు నూలు రంగంపై సబ్సిడీ ఇచ్చింది. చేనేత సహాయనిధి, పొదుపునిధి, రంగుల కోసం, ఆధునిక పనిముట్ల కింద రాయితీ కింద రూ. కోట్లు ఖర్చు చేసింది. 50 ఏళ్ల దాటిన వారికి చేనేత పింఛను కింద రూ. 2వేలు అందచేశారు. చేనేత పరిశ్రమను రక్షించడానికే కాకుండా కార్మికులకు వ్యక్తిగతంగా కూడా కొంత ఊరటనిచ్చేది. అందులో భాగంగా 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు జీవో విడుదల చేసింది. అయితే, వైసీపీ వచ్చిన తరువాత ఆ జీవో ఊసే లేదు.

- ఐసీఐసీఐ లంబార్డ్ ఇన్సూరెన్స్ ఆరోగ్య పథకం పూర్తిగా నిలిపి వేశారు. ఈ పథకంలో చేనేత కార్మికుడు రూ.100 చెల్లిస్తే ఏడాదిపాటు రూ. 15వేలు ఆరోగ్య బీమా వర్తించేది. చేనేత కార్మికులకు వృత్తిపరంగా రంగుల వల్ల ఊపిరితిత్తులు, కీళ్ల నొప్పులు, కంటిచూపు లోపం, టీబీ వంటి వ్యాధుల పాలవుతుంటారు. ఇలాంటి సందర్భంలో చేనేత కార్మిక కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం పాలై ఏ వైద్యశాలలోనైనా వైద్యం చేయించుకుని బిల్లు పెట్టితే రూ. 15వేలు ఇచ్చేవారు.
- బునకర్ బీమా యోజన పథకంలో రూ.80లకే ఇన్సూరెన్సు కల్పించేవారు. ఈ పథకంలో కుటుంబ యజమాని సాధారణ మరణం చెందితే రూ.60 వేలు, ప్రమాదవశాత్తు అయితే రూ.1.5 లక్షలు ఇచ్చేవారు. ఈ పథకాన్ని కూడా వైసీపీ రద్దు చేసింది.
- ఎన్‌హెచ్‌డీసీ (నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ స్కీమ్) పథకంలో చేనేత కార్మికుడికి నూలు కొనుగోలుకు 10 శాతం రాయితీ ఇచ్చేవారు. ఇప్పుడీ పథకం లేదు.
- ఎన్‌సీడీసీ (నేషనల్ క్రెడిట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఈ పథకంలో కార్మికులకు ముద్ర యోజన రుణాల కింద రూ.50 వేల బ్యాంకు రుణాలు ఇచ్చే పథకం నిలివేశారు.
- గతంలో మగ్గం నేసే కార్మికులకు వర్క్ షెడ్డు కోసం రూ.75 వేల ఇచ్చేవారు. దాన్ని పూర్తిగా నిలిపివేశారు.

టీడీపీ హయాంలో అమలైన ఈ పథకాలన్నిటినీ వైసీపీ అధికారంలోకి రాగానే రద్దుచేసింది. దీంతో చేనేత కార్మికులకు గడ్డిపూస సాయం కూడా వారికి లభించలేదు. చేనేత వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ ఉంది. నైపుణ్యం కలిగిన కార్మికులూ ఉన్నారు. అయితే, ప్రభుత్వ ఆదరణే కరువయ్యింది. కార్మికుల ఉపాధి విషయాన్ని గాలికొదిలి వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో అరకొర కేటాయిస్తూ వచ్చింది. అది చేనేత జౌళి శాఖ ఉద్యోగుల జీతాలు, నేతన్న నేస్తానికి కూడా చాలలేదు.

నేతన్న నేస్తంతో సరి

రాష్ట్ర ప్రభుత్వం నేతన్న నేస్తం పథకంతో సరిపెట్టింది. మగ్గం ఉన్నవారికి ఏడాదికి రూ.24 వేలు మాత్రమే ఇస్తోంది. ఇందులోను అనేక తిరకాసులు పెట్టి నేతన్న నేస్తం ఎగనామం పెడుతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుభరోసా, 300 యూనిట్లపైన కరెంటు బిల్లు, ఇంట్లో ఎవరైనా చదువుకుని చిన్న ఉద్యోగం వచ్చినా వారి తల్లిదండ్రులకు నేస్తం ఇవ్వడం లేదు. అంతేకాదు 50 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికుడికి పింఛను ఇవ్వాల్సి ఉండగా రకరకాల కారణలతో ఎగనామం పెడుతున్నారు.

వీరికి మొండిచెయ్యి

చేనేత రంగంపై ఆధారపడి 18 ఉప కులాలు అచ్చుల అతికేవారు, కండెలు చుట్టేవారు, పోడుగులు పట్టేవారు. నూలు వడికేవారు ఉన్నారు. వీరితోపాటు చేనేత అనుబంధంగా పన్నెలు కట్టేవారు, మగ్గాలు తయారు చేసేవారు అచ్చులు కట్టేవారు, నూలుకు రంగులు అద్దేవారు తదితర 12 ఉప వృత్తులవారు ఉన్నారు. వీరందరికి ప్రభుత్వం మొండిచెయ్యి చూపింది. ప్రభుత్వం అందచేసే నేతన్న నేస్తం పథకానికి అనర్హులను చేసింది. దీంతో వీరంతా వీధిన పడ్డారు.

చేనేత సమస్యలకు శాశ్వత పరిష్కారాలివే..

- ప్రతి నేతన్నకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వస్త్ర డిజైన్ల తయారీపై నిరంతరం శిక్షణ కల్పించడం, ఆధునిక సాంకేతిక పనిముట్లు, వర్క్ షెడ్డు నిర్మాణానికి ప్రత్యేక ప్యాకేజి కింద రూ. 2.5 లక్షల ఆర్థిక సాయం చేయాలి.
- చేనేత ఉత్పత్తులకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ మార్కెట్ వసతి కల్పించడంతోపాటు పెట్టుబడి కింద ప్రతి చేనేత కార్మికుడికి వడ్డీలేని రుణం రూ.2లక్షలు అందచేయాలి.
- చేనేత ముడి సరుకుల (నూలు, జరీ తదతర) దిగుమతులు, ఉత్పత్తుల ఎగుమతు లపై విధించిన 5 శాతం జీఎస్టీని పూర్తిగా తొలగించాలి.
- ముడి నూలు కొనుగోలు, అద్దకం రంగులపై 10 శాతం రాయితీ ఇవ్వాలి.
- చేనేత రిజర్వేషన్ చట్టం కింద కేటాయించిన 18 రకాల ఉత్పత్తులను పవర్‌లూమ్‌లపై ఉత్పత్తి చేయకుండా చర్యలు చేపట్టాలి.
- ప్రతి చేనేతకు టుంబానికి 300 యూ నిట్ల ఉచిత కరంటు సరఫరా చేయాలి.
- ప్రతి జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో చేనేత ఉత్పత్తుల విక్రయాలకు రైతు బజార్లు మాదిరి చేనేత బజారు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఈ కేంద్రాల్లో నేతన్నలే వస్త్ర ఉత్ప త్తులను స్వ యంగా విక్రయించి, దళారుల వ్యవస్థ లేకుండా నేతన్నే లబ్ధి పొందే అవకాశం కల్పించాలని చేనేత సం ఘాలు, నా యకులు డిమాండ్ చేస్తున్నారు.

కుటుంబ పోషణ భారమైంది



ప్రస్తుతం ముడిసరుకు ధరలు పెరిగిపోయాయి. దీంతో మాస్టర్ వీవర్స్ ముడి సరుకులు ఇవ్వటంలేదు. చేసేదిలేక ఉన్న మగ్గాన్ని మూలన పెట్టి ఉపాధి హామి పనులకు వెళ్తున్నాం. టీడీపీ హయాంలో వడ్డీలేని రుణాలు, ఆదరణ కింద పనిముట్లు, ముడిసరుకుపై సబ్సిడీ ఇచ్చేవారు. ప్రస్తుతం సంక్షేమ పథకాలు ఏమీ ఇవ్వడంలేదు. నేతన్న నేస్తం సొంత మగ్గం ఉంటేనే ఇస్తున్నారు. దీంతో కుటుంబ పోషణ భారమై కూలి పనులకు పోతున్నా.

- శీనయ్య, చేనేత కార్మికుడు, సంగం

వైసీపీ పాలనలో ఒరిగిందేమిలేదు



వైసీపీ ఐదేళ్ల పాలనలో చేనేతలకు ఒరిగిందేమీ లేదు. పైగా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదు. నేతన్న నేస్తం కొందరికే ఇస్తున్నారు. కార్మికులకు పని కల్పిస్తే నేతన్న నేస్తం లేకపోయినా బతుకుతాం. పనిలేని కారణంగా చాలామంది వేరే వృత్తివైపు వెళ్తున్నారు.

- పెంచలమ్మ, నేత కార్మికురాలు, సంగం

నేడు రంజాన్

నెలవంక దర్శనంతో సంబరాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 10 : ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్)ను గురువారం జిల్లా వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఈ పండుగ ప్రత్యేక ప్రార్థనల కోసం అన్ని మసీదులు, ఈద్గాలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మసీదులను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. నిత్యావసర సరుకులు, నూతన వస్త్రాలు కొనుగోళ్లతో బజార్లు కిటకిటలాడు తున్నాయి. రంజాన్ మాసమంతా ఉపవాస దీక్ష చేసిన ముస్లింలు అందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకునే రోజే ఈద్ ఉల్ ఫితర్ పండుగ. ఈ పండుగ సందర్భంగా మసీదులు, ఈద్గాలలో సామూహిక ప్రార్థనలు, దువా చేస్తారు. ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రాంతాలను బట్టి కార్యక్రమాలు జరుగుతాయి. ప్రభుత్వం రంజాన్ పండుగ సందర్భంగా అన్ని మసీదులు, ఈద్గాల వద్ద పారిశుధ్యం, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించింది.

రంజాన్ మాసంలో బుధవారం సాయంత్రం ఇఫ్తార్ ప్రార్థనలతో ఉపవాస దీక్షలు ముగిశాయి. గురువారం జరుపుకునే ఈద్ ఉల్ ఫితర్ పండుగను ఆహ్వానిస్తూ నెల్లూరు నగరంలోని పలు కూడళ్లలో పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి ముస్లింలు హర్షాన్ని వ్యక్తం చేశారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, మాజీ మంత్రులు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు వేర్వేరు ప్రకటనల్లో పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



బారాషహీద్ దర్గాలో ఏర్పాట్లు

నిర్మాణాలు ఆపకుంటే తొలగిస్తాం!

- కావలిలో ఆక్రమణదారులకు నోటీసులు

కావలి, ఏప్రిల్ 10 : మందాటి చెరువులోతట్టు ప్రాంతంలోని రాళ్లగుట్టలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ దారులకు మున్సిపల్ ప్రణాళికాధికారి బాబూరావు నోటీసులు జారీ చేశారు. 'సందట్లో సడేమియాలా' అనే శీర్షికతో మందాటి చెరువులో అక్రమ నిర్మాణాలపై బుధవారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మున్సిపల్ ప్రత్యేకాధికారి, కావలి ఆర్డీవో శీనానాయక్ ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో ప్రణాళికాధికారి బాబూరావు తమ సిబ్బందితో అక్కడకు వెళ్లిజరుగుతున్న నిర్మాణాలను ఆపు చేయించి, ఆక్రమణదారులకు నోటీస్‌లు జారీ చేశారు. ఈ నిర్మాణాలు ఆపకుంటే పూర్తిగా కూల్చివేయాల్సి వస్తోందని హెచ్చరించారు.



భవన నిర్మాణ పనులను ఆపిస్తున్న మున్సిపల్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ఉదయగిరి రూరల్ : పట్టణంలోని మంగళగిరి, ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు ఈవోపీఆర్డీ మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'అప్పుడే గొంతెండుతోంది' అనే శీర్షికన కథనం ప్రచురితమవడంతో పంచాయతీ కార్యదర్శి కరీముల్లాతో కలిసి ఆయన కాలనీల్లో పర్యటించారు. దెబ్బతిన్న ట్యాంకు వాల్వుకు మరమ్మతు చేయించి మంచినీటి సరఫరా చేస్తామని తెలిపారు.

ముమ్మర తనిఖీలు

- నగదు, మద్యం స్వాధీనం

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 10: ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. మద్యం అక్రమ అమ్మకాలపై, పేకాట స్థావరాలపై బుధవారం ఆకస్మిక దాడులు చేశారు. నెల్లూరులోని నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలో రూ.3.50 లక్షలు, కోవూరులో రూ.8 లక్షలు, మనుబోలులో రూ.లక్ష, వెంకటాచలం సత్రంలో రూ.3.30 లక్షలు, కావలి రూరల్ స్టేషన్ పరిధిలో రూ.1,10,180 నగదును స్వాధీనం చేసుకున్నారు. మనుబోలు పరిధిలో 15 మద్యం బాటిళ్లు, ఇందుకూరుపేటలో 16, కోవూరులో 12, వింజమూరులో 11, వెంకటాచల సత్రంలో 12, సైదాపురంలో 7, ఎస్ఆర్‌పురంలో 13, ముత్తుకూరులో 12, వీవీ పాలెంలో 15, నవాబుపేటలో 15, పొదలకూరులో 10, కలిగిరిలో 10, రాపూరులో 13, కందుకూరు రూరల్ పరిధిలో 20 చొప్పున మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకోగా, సెబ్ అధికారులు 117 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. పేకాట స్థావరాలపై దాడులు చేసిన పోలీసులు పొదలకూరు పరిధిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.22,180 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, వేదాయపాలెం స్టేషన్ పరిధిలో నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.2,200 నగదు, ముత్తుకూరులో ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.24,200 నగదును స్వాధీనం చేసుకున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం!

- కలిగిరి ప్రచారంలో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి

కలిగిరి, ఏప్రిల్ 10 : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తామని ఎన్డీఏ కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం కలిగిరి, ఉదయగిరి ప్రాంతాల్లో ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్‌తో కలిసి వేమిరెడ్డి ప్రచారం నిర్వహించారు. ముందుగా కలిగిరిలోని కలిగిరమ్మ దేవాలయంలో వారు పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో ఇంటింటా తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. టీడీపీ నాయకులు కార్యకర్తలు వారికి ఘనస్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే ఉపాధి అవకాశాలతోపాటు చిరువ్యాపారులకు రాయితీ రుణాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికే తాను రాజకీయాల్లోకి వచ్చానని, గెలిచిన వెంటనే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ మాట్లాడుతూ గ్రామాల వారీగా ప్రజా సమస్యలు తెలుసుకున్నానని, గెలిచిన వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కలిగిరి ప్రాంతంలో సాగునీటి సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, చేరెడ్డి సుబ్బారెడ్డి, నోటి శ్రీనివాసులురెడ్డి, గంగవరపు మదన్‌కుమార్, నిశ్శంకర సురేష్, జిర్రా చిన్నఅంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుడిని ఓటు అభ్యర్థిస్తున్న వేమిరెడ్డి, కాకర్ల

ప్రజా సంక్షేమం టీడీపీకే సాధ్యం : కాకర్ల

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 10: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు కావాలంటే ప్రజలు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయానికి సహకరించాలని ఉదయగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జ్యోత్స్న పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ నాయకులతో కలిసి వారు పలు దుకాణాల్లో ప్రచారం నిర్వహించారు. అనంతరం పెద్ద మసీదు వరకు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోత్స్న మాట్లాడుతూ రాష్ట్రం బాగుడాలంటే ఎన్డీయే కూటమి అధికారంలోకి రావాలన్నారు. గత రెండేళ్లుగా సురేష్ నియోజకవర్గాన్ని తన గుండెల్లో పెట్టుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చిన సురేష్ ను గెలిపిస్తారో.. నాకెందుకు రాజకీయాలు, నన్ను బలవంతంగా నెట్టారుబాబోయ్... అంటున్న వైసీపీ అభ్యర్థిని గెలిపిస్తారో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీకి ప్రజలు శాశ్వతంగా చరమగీతం పాడాలన్నారు. నాసిరకం మద్యం విక్రయాలు చేపడుతూ ఇళ్లు, ఒళ్లు గుల్ల చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ఆడబిడ్డలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం కాకర్ల సురేష్ మాట్లాడుతూ జరగనున్న ఎన్నికల్లో తనతోపాటు నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



ఉదయగిరిలో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న కాకర్ల సురేష్, తదితరులు



రోడ్‌షోలో మాట్లాడుతున్న కాకర్ల సురేష్

● ఇఫ్తార్ విందులో కాకర్ల

రంజాన్‌ను పురస్కరించుకొని ఉదయగిరి పెద్ద మసీదులోనూ, మండలంలోని మాసాయిపేటలో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బయ్యన్న, రియాజ్, సందానీ, సజిల్, గడ్డం వెంకటేశ్వర్లు, ఓబులరెడ్డి, బొజ్జా శ్రీనివాసులు, ఖాన్‌షా, మాబాషా, నరసింహా, కలివెల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

13న ఆత్మీయ సమావేశం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 10: ఈనెల 13న హైదరాబాదు మియాపూర్‌లో ఉన్న నరైన్ గార్డెన్స్‌లో ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన వలసవాసులతో ఆత్మీయ స మావేశం నిర్వహించనున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ సీహెచ్ బయ్యన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెం బ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్ లు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. కావున హైదరాబాదులో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

రంజాన్‌కు ముస్తాబైన ఈద్గాలు



ఉదయగిరి : నమాజుకు సిద్ధమైన ఈద్గా

ఉదయగిరి, ఏప్రిల్ 10: రంజాన్ సందర్భంగా ముస్లింలు చేసుకునే ప్రత్యేక నమాజుకు ఈద్గాలు సిద్ధమయ్యాయి. మండలంలోని ఉదయగిరి ఈద్గాలతోపాటు బిజ్జంపల్లి, పుల్లాయపల్లి, దాసరిపల్లి, గండిపాళెం, వెంగళరావునగర్ తదితర గ్రామాల్లోని ఈద్గాలను ముస్లింలు నమాజు కోసం సిద్ధం చేశారు.

అనంతసాగరం: రంజాన్‌ను గురువారం నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సోమశిల, అనంతసాగరం, ఉప్పలపాడు, పాతదేవరాయపల్లి, ఆమనిచిరువెళ్ల, కేడీపల్లి గ్రామాల్లోని ఈద్గా పరిసరాలను శుభ్రం చేశారు. ఈద్గాలకు రంగులు దిద్ది సుందరంగా అలంకరించారు.

21న ప్రవేశ పరీక్ష

సీతారామపురం : స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ షేక్ ముజీబుర్ రెహమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. హాల్‌టికెట్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

ఆలయ పునర్నిర్మాణానికి పూజలు



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

ఉదయగిరి రూరల్ : మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీలో ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. కాలనీలో 15 ఏళ్ల క్రితం రామాలయ నిర్మాణం చేపట్టారు. అనివార్య కారణాల వల్ల మధ్యలో ఆగింది. ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కాలనీవాసులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. త్వరితగతిన ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వారు తెలిపారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా గంధమహోత్సవం

ఉదయగిరి : స్థానిక కోన కాలువ సమీపంలో వెలసి ఉన్న అబీద్‌బాబా గంధ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. అబీద్‌బాబా మహారాజ్ ట్రస్టు నిర్వాహ కులు సమీపంలోని అమ్మాజీ ఆస్థానం నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి చదివింపుల అనంతరం భక్తులకు పంచిపెట్టారు. దర్గా వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

అనంతవరంలో మాలేపాటి ప్రచారం

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 10: దగదర్తి మండలం అనంతవరం పంచాయతీలో బుధవారం టీడీపీ కావలి నియోజకవర్గ నేత మాలేపాటి సుబ్బానాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపించడమే ప్రధాన లక్ష్యం అన్నారు.

పూలే జయంతి సభను జయప్రదం చేయండి

కందుకూరు, ఏప్రిల్ 10: ఈనెల 11న సాయంత్రం కనిగిరి రోడ్డులోని విజయగాయత్రీ ఫంక్షన్ హాలులో జరిగే జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పూలే విగ్రహ కమిటీ, బీసీ సంఘాల సభ్యులు సంగా రమణయ్య, హరిప్రసాద్, శివయ్య, మల్లికార్జున, మహేంద్ర, మాల్యాద్రి, పెరుగు ప్రసాద్, రాజేశ్వరరావు, మోహనరావు, వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం సభ్యులు మాట్లాడారు.

మీ బిడ్డగా ఆశీర్వదించండి : ఇంటూరి



ఇంటూరికి తిలకం దిద్ది ఆశీర్వదిస్తున్న మహిళ

పలేటివారిపాలెం, ఏప్రిల్ 10 : నన్ను మీ బిడ్డగా భావించి ఆశీర్వదిస్తే మన ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని కందుకూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు తెలిపారు. మండలంలోని రామచంద్రాపురం, అంకభూపాలపురం, పెద్దఅమ్మపాలెం, వీరన్నపాలెం, పోలినేనిచెరువు, గరుకుపాలెం గ్రామాలలో బుధవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

టీడీపీలో పలువురి చేరిక : పెద్దఅమ్మపాలెం, వీరన్నపాలెం, పోలినేని చెరువు, గరుకుపాలెం గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి నాగేశ్వరావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడులు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు సిరిగిరి కొండారెడ్డి, ప్రెగడ నరసింహం, లాయర్ శ్రీనివాసులు, చెంచు శ్రీనివాసులు, బక్కమంతుల మాల్యాద్రి, శనివారపు సాంబయ్య, శనివారపు మాల్యాద్రి పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థుల కోసం ఇంటింటి ప్రచారం

కందుకూరు : పట్టణంలోని 4వ వార్డు పరిధిలోని కుంచాల ట్రస్టు ఎదురు ప్రాంతంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలని ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గట్టమనేని హరిబాబు, టీడీపీ నాయకులు మచ్చా మనోహర్, ముచ్చు శ్రీను, సవిడిబోయిన వెంకటకృష్ణ, నందికనమల లక్ష్మణరావు, చీదెళ్ల పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అరాచకాలకు చరమగీతం పాడాలి : కావ్య



గాయిత్రీనగర్‌లో ప్రచారం చేస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 10: కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అరాచకాలకు చరమగీతం పాడుదామని కావలి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని 2వ వార్డులోని గాయత్రీనగర్, ఇస్లాంపేట ప్రాంతంలో బుధవారం ఆయన బీజేపీ, జనసేన నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. అలాగే 23వ వార్డులో ఆలా శ్రీనివాసులు ఆధ్వర్యంలో పులువురు వైసీపీ నాయకులు వారి అనుచరులతో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ క్రిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ప్రచారం నిర్వహించారు. ముస్లిం మహిళలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బోగోలుకు చెందిన వైసీపీ వార్డు మెంబరు సంజీవయ్య, స్వతంత్ర వార్డు మెంబరు మేకల కిరణ్ వారి అనుచరులతో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాలేపాటి నాగేశ్వరావు, నూకసాని శ్రీనివాసులు యాదవ్, షేక్.నూరుద్దీన్, అహ్మద్‌భాషా, ఎల్.సుధీర్‌బాబు, వెంకటేశ్వర్లురెడ్డి, అంజయ్యయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కష్టపడి పనిచేయండి : ఆనం



దువ్వూరులో మాట్లాడుతున్న రామనారాయణరెడ్డి

సంగం, ఏప్రిల్ 10: టీడీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మండలంలోని దువ్వూరు, మర్రిపాడు, చెన్నవరపాడు, తరుణవాయి గ్రామాల్లో వేర్వేరుగా జరిగిన టీడీపీ సమావేశాల్లో పేర్కొన్నారు. మొదట దువ్వూరులో కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం మర్రిపాడు, చెన్నవపాడు, తరుణవాయి గ్రామాల్లో కూడా కార్యకర్తల సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, శేఖరయ్య, రవీంద్రరెడ్డి, బాణా శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలోని వెంగారెడ్డిపాళెంలో సర్పంచు ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కనుమూరు సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆత్మకూరు : అభివృద్ధి ప్రధాత, టీడీపీ కూటమి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డిని, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని పట్టణ ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని ఆనం కుమార్తె ఆనం కైవల్యారెడ్డి, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని సత్రం సెంటర్ వద్ద నుంచి ప్రధాన రహదారి వెంబడి మహిళలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ మహిళా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పసుపులేటి గూటికి వైసీపీ నేతలు



పసుపులేటికి మద్దతు తెలిపిన వైసీపీ నేతలు

కావలిటౌన్, ఏప్రిల్ 10: స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్న పీఎస్సార్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ గూటికి రోజు రోజుకు నేతల చేరికలు పెరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం పట్టణంలోని పీఎస్సార్ కార్యాలయంలో రూరల్ మండల చలంచర్లకు చెందిన వైసీపీ నాయకులు టీ.యామయ్య, తన అనుచరులు వైసీపీని వీడి పసుపులేటి కండువాలు కప్పుకున్నారు. యామయ్య మాట్లాడుతూ పసుపులేటి పార్టీలకతీతంగా గ్రామా ల్లో సొంత నిధులతో మౌలిక వసతులు సమకూరుస్తుండడంతో ఆకర్షితులై పసుపులేటికి మద్దతు పలుకుతున్నామన్నారు. పసుపులేటి మాట్లాడుతూ ప్ర స్తుత రాజకీయాలు కలుషితమయ్యాయని దోచుకోవడం, దాచుకోవడం కోసమే ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీ పడుతున్నారన్నారు. జన్మభూమి రుణం తీర్చుకోవడమే ప్రధాన లక్ష్యంగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పోరాడుతానన్నారు. కార్యక్రమంలో టీం పసుపులేటి సభ్యులు బాబు, శ్రీనివాస్, మల్లికార్జున్, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో వైసీపీ కీలక నేతల చేరిక

అల్లూరు, ఏప్రిల్ 10 : అల్లూరులో వైసీపీ కీలక నేతలు పాపాల విజయకుమార్‌రెడ్డి, బత్తల గోపాల్, బత్తల శ్రీనివాసులు తదితరులు బుధవారం రాత్రి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి, నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, ఎ.చంద న్‌రెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే మండలంలోని పురిణి కొత్తపాలెంకు చెందిన 10 వైసీపీ కుటుంబాలు ఆపార్టీని వీడి టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మర్రిపాటి వెంకటేశ్వర్లు, నెల్లూరు గోపి, నెల్లూరు శ్రీకాంత్, ఆలపాక కిరణ్, తదితరులు ఉన్నారు. అంతకుముందు అల్లూరు పట్టణ పరిధిలోని కట్టకింద అరుంధతీయవాడ, సెటల్మెంటు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, అరగల రమణయ్య, కత్తుల శ్రీకాంత్, తిరువీధి అనూరాధ, కరీమా తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన నేతలు

కందుకూరు, ఏప్రిల్ 10: కందుకూరు నియోజకవర్గంలోని ముస్లింలకు టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి, ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నేత ఇంటూరి రాజేష్‌లు వేర్వేరు ప్రకటనల్లో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.